


# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక




ప్రచురణ : హైదరాబాద్, రంగారెడ్డి, సంపుటి 01, సంచిక 183, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8 మంగళవారం - 24 - సెప్టెంబర్ - 2024 , వెల రూ.2/-

## పని ఒత్తిడితో పాటు ఒత్తిడి నిర్వహణ బోధన జరగాలి

పని ఒత్తిడిపై నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలు... మండిపడిన కాంగ్రెస్

కార్పొరేట్లకు ఇబ్బంది వచ్చినప్పుడే ఆర్థికమంత్రి పట్టించుకుంటారని కాంగ్రెస్ విమర్శ



2

## చందమామపై బయటపడ్డ భారీ బిలం.. ప్రగ్యాన్ రోవర్ పరిశోధనలో గుర్తింపు

ఏకంగా 160 కిలోమీటర్ల వెడల్పు ఉందటున్న సైంటిస్టులు

చంద్రయాన్ 3 దిగిన చోటుకు దగ్గర్లో గుర్తించినట్లు వెల్లడి

అహ్మదాబాద్ కు చెందిన సైన్స్ డైరెక్ట్ మేగజైన్ లో ప్రచురణ



2

## బిజెపి, ఆరెస్సెస్ విద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నాయి

జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలో సెప్టెంబర్ 25న రెండోదశ అసెంబ్లీ ఎన్నికలు

పహారీ, గుజ్జర్ వర్గాల మధ్య చిచ్చు పెట్టేందుకు బిజెపి ప్రయత్నించింది



2

## గూగుల్ టు ఎన్విడియా..

15 టాప్ టెక్ సీఈవోలతో ప్రధాని మోదీ రౌండ్ టేబుల్ సమావేశం



ఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమెరికా పర్యటన కొనసాగుతోంది. మూడు రోజుల పర్యటన నిమిత్తం అమెరికా వెళ్లిన ప్రధాని.. క్వాడ్ దేశాల సదస్సులో పాల్గొన్నారు. ఆ తర్వాత న్యూయార్క్‌లో జరిగిన ప్రవాస భారతీయులతో ప్రత్యేక కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. తాజాగా టెక్ కంపెనీల సీఈవోలతో ప్రధాని రౌండ్ టేబుల్ సమావేశంలోపాల్గొన్నారు. మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్.. న్యూయార్క్‌లోని ఓ హోటల్‌లో ఈ సమావేశాన్ని నిర్వహించింది. గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, అడోబ్ సీఈవో శంతను నారాయణ్, ఎన్విడియా సీఈవో జెన్‌సెన్ హాంగ్ సహా 15 టాప్ టెక్ సీఈవోలు ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశానికి సంబంధించిన ఫొటోను మోదీ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. సీఈవోలతో ఫలప్రదమైన చర్చలు జరిగాయని, టెక్నాలజీ, ఇన్నోవేషన్ తదితర అంశాల గురించి చర్చించినట్లు తెలిపారు. సాంకేతికత, ఆవిష్కరణలు సహా పలు అంశాలపై చర్చలు జరిపామన్నారు. ఆయా రంగాల్లో భారత్ సాధించిన ప్రగతి గురించి మాట్లాడినట్లు చెప్పారు. మేడ్ బై ఇండియా గురించి ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు వెల్లడించారు.

# ఎమ్మెల్యేల మీద ద్రుష్టి పెట్టారా?

**తొలిసారి: ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ వార్నింగ్**

**మరో రెండు నెలల్లో ఆయన ముఖ్యమంత్రిగా ఏడాది పూర్తి**



హైదరాబాద్: దగ్గర దగ్గరగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టి ఏడాది అవుతోంది. మరో రెండు నెలల్లో ఆయన ముఖ్యమంత్రిగా ఏడాది పూర్తి చేసిన వారు అవుతారు. ఇప్పటివరకు పాలన మీదా.. తానుముఖ్యమంత్రిగా కుదురుకోవటం మీదనే ఫోకస్ చేసిన ఆయన.. ఇప్పుడు ఎమ్మెల్యేల మీద ద్రుష్టి పెట్టారా? అంటే అవునన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇందుకు తగ్గట్లే తనదైన శైలిలో ఎమ్మెల్యేలకు సిం'ఫుల్' వార్నింగ్ ఇవ్వటం ఆసక్తికరంగా మారింది. ఇటీవల టీపీసీసీ కొత్త రథసారథిగా ఎంపికైన మహేశ్ కుమార్ గౌడ్ ను సన్మానించేందుకు హైదరాబాద్ మహానగరంలోని ఒక స్టార్ హోటల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేయటం గమనార్హం. 'మన ఎమ్మెల్యేలు బాధ్యతతో మెలగాలి. అవినీతికి దూరంగా ఉండాలి. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల బదిలీలు.. ఇతర విషయాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డబ్బులు తీసుకోవటంతో వారిని ప్రజలు ఓడించారు. మన ఎమ్మెల్యేలు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఎమ్మెల్యేలు సచివాలయానికి గుంపులు గుంపులుగా రావొద్దు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండండి. పని చేయండి. అప్పుడే వారు మరోసారి గెలిపిస్తారు" అని వ్యాఖ్యానించటం గమనార్హం. పార్టీలోని కొందరు ఎమ్మెల్యేలు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారని.. వారంతా జాగ్రత్తగా ఉండాలన్న ముఖ్యమంత్రి రేవంత్.. 'ప్రతి ఎమ్మెల్యే సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు నియోజకవర్గ ప్రజలను కలిసేందుకు సమయాన్ని కేటాయించాలి. బీసీ జనగణన అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. త్వరలో ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కార్డు అందజేస్తాం. ఈ కార్డు ఆధారంగానే సదరు కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతాయి" అని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నంచి ఇప్పటివరకు ప్రతిపక్షాల నుంచి వచ్చే విమర్శల్ని తిప్పి కొట్టే విధంగా మిగతా..2లో


## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన మహేశ్ బాబు



- వరద బాధితుల కోసం రూ. 50 లక్షలు, ఏఎంబీ సినిమాస్ తరపున మరో రూ. 10 లక్షల విరాళం
- మహేశ్ బాబు వెరీ లేటెస్ట్ న్యూలుక్ చూసి ఫ్యాన్స్ ఫిదా!
- న్యూ లుక్‌లో మహేశ్ బాబు
- రాజమౌళి సినిమాలో ఇదే లుక్ అంటూ ఊహాగానాలు

హైదరాబాద్: తమ అభిమాన హీరోలను చూసినప్పుడు అభిమానులు పొందే ఆనందమే వేరు. ఇక సదరు హీరో న్యూ లుక్‌లో కనపడితే వారి సంతోషానికి హద్దే వుండదు. ఇప్పుడు మహేష్ న్యూలుక్‌ను చూసి ఆయన ఫ్యాన్స్ అలాంటి అనుభూతికే లోనవుతున్నారు. మహేశ్, రాజమౌళి కలయికలో మిగతా..2లో

## త్వరలోనే నామినేటెడ్ పోస్టుల భర్తీ....



2లో

మూడు పార్టీల్లో కష్టపడిన వారికి ప్రాధాన్యం

మంత్రులు, ఎమ్మెల్యేలు, గ్రామస్థాయి నేతలతో టెలీకాన్ఫరెన్స్

కార్యకర్తలకు ఇచ్చే ప్రమాద బీమా రూ.5 లక్షలకు పెంపు

100 రోజుల్లో ఏం చేశామో ప్రజలకు వివరించాలన్న చంద్రబాబు

# గిన్నిస్ బుక్ లోకి ఎక్కిన మెగాస్టార్ చిరంజీవి...

**అదిరిపోయే రికార్డ్**

- 1978 సెప్టెంబరు 22న కెరీర్ ప్రారంభించిన చిరంజీవి
- కెరీర్ లో 156 చిత్రాల్లో నటించిన మెగాస్టార్
- 537 పాటల్లో 24 వేల డ్యాన్స్ స్టెప్పులతో గిన్నిస్ బుక్ రికార్డ్
- హైదరాబాదులో గిన్నిస్ బుక్ రికార్డు ప్రదానోత్సవం
- నాకు ఈ గిన్నిస్ రికార్డు దక్కడానికి కారణం అదే అనుకుంటా!: చిరంజీవి




హైదరాబాదు: కోట్లాది మంది అభిమానుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించిన టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి తాజాగా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించారు. చిరంజీవి ఏ అంశంలో గిన్నిస్ బుక్ లోకి ఎక్కారన్నది అత్యంత ఆసక్తి కలిగించే అంశం. చిరంజీవి తన 45 ఏళ్ల కెరీర్ లో 156 సినిమాల్లో నటించి, 537 పాటల్లో 24,000 డ్యాన్స్ స్టెప్పులు వేశారు. మరే నటుడూ ఇన్ని డ్యాన్స్ స్టెప్పులు వేసిన దాఖలాలు లేవు. చిరంజీవి 1978 సెప్టెంబరు 22న తన కెరీర్ ప్రారంభించారు. భారతీయ సినీ చరిత్రలో మరే నటుడికి సాధ్యం కాని రీతిలో అత్యధిక స్టెప్పులతో గిన్నిస్ బుక్ రికార్డు నమోదు చేశారు. ఇవాళ హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో గిన్నిస్ బుక్ ప్రతినిధులు హాజరైన చిరంజీవికి రికార్డును అందజేశారు. చిరంజీవి బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్ చేతులమీదుగా అందుకోవడం విశేషం. కాగా, ఈ కార్యక్రమానికి టాలీవుడ్ సినీ ప్రముఖులతో పాటు మెగా ఫ్యామిలీ మెంబర్స్ అల్లు అరవింద్, సుస్మిత, వరుణ్ తేజ్, సాయి దుర్గా తేజ్, వైష్ణవ్ తేజ్ తదితరులు హాజరయ్యారు. మిగతా..2లో

## కావూరీహిల్స్ పార్క్ లోని స్పోర్ట్స్ అకాడమీని తొలగించిన హైడ్రా



2లో

- కావూరీహిల్స్ పార్క్ లో అక్రమ నిర్మాణాల కూల్చివేత
- అసోసియేషన్ నుంచి లీజుకు తీసుకున్నామని అకాడమీ నిర్వాహకుల వివరణ
- కోర్టు ఆదేశాలతోనే తొలగించామన్న హైడ్రా చీఫ్ రంగనాథ్

# జగన్ పై చంద్రబాబు ఫైర్

- తప్పు చేసి ప్రధానికి లేఖ రాయడానికి నీకు బుద్ధి ఉండక్కర్లా?
- తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్న తిరుమల లడ్డూ వ్యవహారం
- ప్రధానికి లేఖ రాసిన జగన్
- నీది అసలు మనిషి పుట్టుకేనా? అంటూ చంద్రబాబు ఆగ్రహం
- నువ్వు ఏంచేసినా నడుస్తుందనుకుంటున్నావా? అంటూ మండిపాటు




అమరావతి: తిరుపతి లడ్డూ వ్యవహారంలో వైసీపీ అధినేత జగన్ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాయడం తెలిసిందే. దీనిపై ఏపీ సీఎం చంద్రబాబు ఘాటుగా స్పందించారు. తప్పు చేసిందే కాకుండా, పైగా ప్రధానికి లేఖ రాయడం కూడానా! అంటూ మండిపడ్డారు. తప్పిదానికి పాల్పడి ప్రధానికి లేఖ రాయడానికి బుద్ధి ఉండక్కర్లా? నువ్వు ఏం చేసినా నడుస్తుందనుకుంటున్నావా? నీది అసలు మనిషి పుట్టుకేనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరిచి గీపెట్టి, హైరేంజిలో బుకాయిస్తే మీ పాపాలు కొట్టుకుని పోతాయా? మిగతా..2లో

## లడ్డూ ప్రసాదం కల్తీ.. శ్రీవారి ఆలయంలో శాంతి హోమం



2లో

- దేశవ్యాప్తంగా శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారం ప్రకంపనలు
- ఈ ఘటన నేపథ్యంలో ఆలయంలోని యాగశాలలో అర్చకుల శాంతి హోమం
- శ్రీవారి లడ్డూ తయారీకి వాడే నెయ్యిలో దోషం వల్ల అపచారం కలిగిందన్న ఈఓ శ్యామలరావు

# ఆ కుర్చీ ఎప్పటికైనా కేజ్రీవాల్ దే

**రాముడు వనవాసానికి వెళితే భరతుడిలా బాధ్యతలు చేపట్టా**

**ఆ కుర్చీ ఎప్పటికైనా కేజ్రీవాల్ దే అంటూ మాజీ సీఎం కుర్చీని పక్కనే పెట్టుకున్న అతిశీ**

**బాధ్యతలు స్వీకరించాక మీడియాతో మాట్లాడిన అతిశీ**

**ఢిల్లీ ప్రజలు కేజ్రీవాల్ కు మరోసారి పట్టం కడతారు**



ఢిల్లీ: రామాయణంలో రాజ్యాన్ని వదిలిపెట్టి రాముడు వనవాసానికి వెళితే ఆయన పాదుకలకు పట్టం కట్టి పాలించిన భరతుడిలా ఢిల్లీ ప్రభుత్వ బాధ్యతలు చేపట్టానని సీఎం అతిశీ పేర్కొన్నారు. అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా నేపథ్యంలో మిగతా..2లో

# పని ఒత్తిడితో పాటు ఒత్తిడి నిర్వహణ బోధన జరగాలి

ఢిల్లీ: విద్యార్థులకు విద్యను అందించడంతో పాటు పని ఒత్తిడి నిర్వహణ మీద బోధన జరగాల్సి ఉందని, సీఏ చదివిన యువతి పని ఒత్తిడిని భరించలేకపోయిందన్న వార్త తనను కలచివేసిందన్నారు. అయితే నిర్మలా సీతారామన్ ఏ కంపెనీ పేరు, యువతి పేరును ప్రస్తావించలేదు. కానీ ఇటీవల యర్నెస్ట్ యంగ్ ఇండియా ఉద్యోగి మరణాన్ని ఉద్దేశిస్తూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. విద్యార్థులకు విద్యతో పాటు పని ఒత్తిడిని జయించడం కూడా విద్యా సంస్థలు బోధించాలన్నారు. ఆమె వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. క్షీణిస్తున్న పని పరిస్థితుల గురించి మాట్లాడకుండా... పని ఒత్తిడిని జయించడం గురించి మాట్లాడటం సరికాదని కాంగ్రెస్ పేర్కొంది. కార్పోరేట్లకు ఇబ్బంది వచ్చినప్పుడే ఆర్థికమంత్రి పట్టించుకుంటారని, కార్పోరేట్ శ్రమ దోపిడీకి గురైన అన్నాసెబాస్టియన్ వంటి వారి బాధలు పట్టవని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విమర్శించారు. బాధితురాలికి, ఆమె కుటుంబానికి అండగా నిలవాల్సింది పోయి... ఆమెదే తప్పన్నట్లుగా మాట్లాడటం సరికాదన్నారు. క్లిష్టమైన కోర్సుల్లో ఒకటైన చార్టర్డ్ అకౌంటెన్సీ చేసిన యువతికి పని ఒత్తిడి గురంచి చెప్పాల్సిన అవసరం లేదని శివసేన (యూబీటీ) నేత ప్రియాంక చతుర్వేది మండిపడ్డారు. పని విధానం, సుదీర్ఘ పని గంటలు వంటి అంశాల గురించి ఆర్థికమంత్రి మాట్లాడాలని హితవు పలికారు. సన్నిత అంశాల పట్ల ఆచితూచి మాట్లాడాలన్నారు.

## చందమామపై బయటపడ్డ భారీ బిలం..
# ప్రగ్యాన్ రోవర్ పరిశోధనలో గుర్తింపు

ఢిల్లీ: చంద్రుడి దక్షిణ ధ్రువంపై భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) విజయవంతంగా విక్రమ్ ల్యాండర్ ను దింపిన విషయం తెలిసిందే. చంద్రయాన్ 3 ప్రాజెక్టులో భాగంగా విక్రమ్ ల్యాండర్ తో పాటు ప్రగ్యాన్ రోవర్ ను ఇస్రో చంద్రుడిపైకి పంపింది. చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండ్ అయిన తర్వాత ప్రగ్యాన్ రోవర్ అక్కడి పరిస్థితిని ఫొటోలు తీసి పంపించింది. విక్రమ్ ల్యాండర్ నుంచి కొద్దిదూరం పాటు ప్రయాణించి చుట్టుపక్కల ప్రాంతాలను ఎక్స్ ప్లోర్ చేసింది. ఈ క్రమంలోనే అక్కడ భారీ బిలంను గుర్తించింది. ల్యాండ్ అయిన ప్రదేశాన్ని, దాని చుట్టుపక్కల ప్రాంతాలను ప్రగ్యాన్ రోవర్ ఫొటోలు తీసి విక్రమ్ ల్యాండర్ కు పంపగా.. విక్రమ్ వాటిని ఇస్రోకు చేరవేసింది. ఇలా అందుకున్న ఫొటోలను ఇస్రో శాస్త్రవేత్తలు విశ్లేషించి ఈ బిలంను గుర్తించారు. దాదాపు 160 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ బిలం చాలాకాలం కిందటే ఏర్పడిందని వారు అంచనా వేస్తున్నారు. సాధారణంగా అగ్ని పర్వతం బద్దలైనపుడు ఇలాంటి బిలాలు ఏర్పడతాయని చెప్పారు. చంద్రుడి సౌత్ పోల్ కు సుమారు 350 కిలోమీటర్ల దూరంలో ఈ బిలం ఉందని వివరించారు. కాగా, చంద్రుడి ఉపరితలంపై విజయవంతంగా ల్యాండైన విక్రమ్, అందులో పంపిన ప్రగ్యాన్ రోవర్ ప్రస్తుతం స్లీపింగ్ మోడ్ లో ఉన్నాయి. అక్కడ రాత్రి సమయం దాదాపు మనకు పద్నాలుగు రోజులు.. ఆ సమయంలో ఉష్ణోగ్రతలు మైనస్ కు పడిపోతాయని, ఆ ఉష్ణోగ్రతలో విక్రమ్ ల్యాండర్, ప్రగ్యాన్ రోవర్ లు పనిచేయలేవని సైంటిస్టులు వివరించారు. వాటి బ్యాటరీలు పూర్తిగా డ్రై అయిపోయాయని వివరించారు. ప్రస్తుతం అవి రెండూ చంద్రుడిపై నిద్రిస్తున్నాయని సైంటిస్టులు చెప్పారు.

## బిజెపి, ఆరెస్సెస్ విద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నాయి

జమ్మూ కాశ్మీర్ : బిజెపి దాని సైద్ధాంతిక గురువు అయిన ఆరెస్సెస్‌లు దేశమంతటా విద్వేషాన్ని, హింసను వ్యాప్తి చేస్తున్నాయని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మండిపడ్డారు. జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలో సెప్టెంబర్ 25న రెండోదశ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం పూంచ్ జిల్లాలో జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'బిజెపి, ఆరెస్సెస్ నేతలు ఎక్కడికి వెళ్లినా కులాలు, ప్రాంతాలు, రాష్ట్రాలు, భాషల మధ్య విబేధాలు సృష్టించి సంఘర్షణను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తారు. పహారీ, గుజ్జర్ వర్గాల మధ్య చిచ్చు పెట్టేందుకు బిజెపి ప్రయత్నించింది. అయితే, ఆ పార్టీ చేసిన ఈ ప్రాజెక్టు విఫలమైంది' అని ఆయన అన్నారు. అందరినీ ఏకతాటిపైకి తెచ్చి, ప్రతిఒక్కరికీ వారి హక్కులను కల్పించేందుకు కాంగ్రెస్ ముందుకు సాగుతుంది. ప్రజలు కోరుకునేది, వారు ఏ పని చేయాలన్నా తాను పార్లమెంటులో ఎలాంటి సమస్యనైనా ప్రస్తావించేందుకు తాను సిద్ధమని, దానికి జమ్మూ కాశ్మీర్ ప్రజలు సూచనలివ్వడమే తరువాయి అని రాహుల్ పేర్కొన్నారు. లోక్‌సభ ఫలితాల తర్వాత ప్రతిపక్షాలు బలం పుంజుకున్నాయి. ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న ప్రజా వ్యతిరేక చట్టాలకు, విధానాలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఐక్యంగా నిలబడుతున్నాయి. దీంతో ప్రధాని నరేంద్రమోడీ విశ్వాసం కోల్పోయినట్ల ఆయన ముఖంలో స్పష్టంగా కనిపిస్తుంది. మేమంతా కలిసి ఆయనను సైకలాజికల్‌గా ప్రభావితం చేశాము. ఆయన ఒకప్పటిలా లేరని రాహుల్ అన్నారు. ఇండియా బ్లాక్ విద్వేషాలకు, హింసకు వ్యతిరేకం. బిజెపి అనుసరిస్తున్న ఈ అజెండాను 'ఇండియా బ్లాక్ ప్రేమ, కరుణలతో' ఎదుర్కొంటుంది అని రాహుల్ వ్యాఖ్యానించారు. కేంద్రపాలిత ప్రాంతాలను రాష్ట్రాలు, లేదా రాష్ట్రాలను కొత్త రాష్ట్రాలుగా విభజించడం జరుగుతుండగా.. ఒక్క జమ్మూ కాశ్మీర్‌నే రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించడం చరిత్రలో ఇదే తొలిసారి అని రాహుల్ కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కావూరీహిల్స్ పార్క్ లోని స్పోర్ట్స్ అకాడమీని తొలగించిన హైడ్రా

హైదరాబాద్: హైదరాబాదులో ప్రభుత్వ భూములు, చెరువులు కుంటలలో ఆక్రమణలను తొలగించే పనిలో హైడ్రా దూసుకుపోతోంది. అక్రమార్కులకు సింహస్వప్నంగా మారింది. భారీ నిర్మాణాలను, ఖరీదైన విల్లాల విషయంలోనూ వెనుకడుగు వేయడంలేదు. తాజాగా సోమవారం ఉదయం మాదాపూర్ లో హైడ్రా బుల్డోజర్లు తొలగింపులు చేపట్టాయి. కావూరిహిల్స్ లోని అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేస్తున్నాయి. స్థానిక పార్కులో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ అకాడమీ నిర్మాణాలను హైడ్రా అధికారులు తొలగించారు. కొంతకాలంగా ఈ అకాడమీపై కావూరిహిల్స్ అసోసియేషన్ ఫిర్యాదు చేస్తుండడంతో తాజాగా రంగంలోకి దిగిన హైడ్రా.. బుల్డోజర్లతో అక్రమ నిర్మాణాలను తొలగించింది. కావూరిహిల్స్ పార్క్ అంటూ అధికారులు అక్కడ బోర్డు ఏర్పాటు చేశారు. అయితే, కావూరిహిల్స్ అసోసియేషన్ నుంచి ఈ స్థలాన్ని లీజుకు తీసుకుని స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేశామని నిర్వాహకులు చెబుతున్నారు. 25 ఏళ్లకు లీజుకు తీసుకున్నామని, ఆ గడువు పూర్తికాకముందే తొలగిస్తున్నారని ఆరోపించారు. అయితే, కోర్టు ఆదేశాలతోనే కావూరీహిల్స్ పార్క్ లో ఆక్రమణలను తొలగించామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివరణ ఇచ్చారు.

## లడ్డూ ప్రసాదం కల్తీ.. శ్రీవారి ఆలయంలో శాంతి హెూమం

తిరుమల: శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ ఘటన నేపథ్యంలో ఆలయంలోని యాగశాలలో టీటీడీ శాంతి హెూమం నిర్వహిస్తున్నది. పాత్రశుద్ధి, యంత్రశుద్ధి, స్థల శుద్ధితో పాటు పంచగవ్య ప్రోక్షణతో ప్రాయశ్చిత్తం కార్యక్రమం కొనసాగుతున్నది. దోష నివారణ ఆలయ యాగశాలలో ఉదయం 6 గంటలకు ప్రారభమైన హెూమం 10 గంటలకు ముగియనుంది. హెూమంతోపాటు అన్ని పోటుల్లో అర్చకులు సంప్రోక్షణ చేయనున్నారు. వాస్తు యాగం అనంతరం లడ్డూపోటు, విక్రయాశాలలో వాస్తు శుద్ధి చేయనున్నారు. విమాన ప్రాకారం దగ్గర 3 హెూమగుండాలతో మహా క్రతువు కొనసాగుతున్నది. 8 మంది అర్చకులు, ముగ్గురు ఆగమ సలహాదారులతో యాగం నిర్వహిస్తున్నారు. సమస్త దోష పరిహారం, సంశయాల నివృత్తి కోసం ప్రత్యేక సంకల్పంతో టీటీడీ ఈ యాగం ఏర్పాటు చేసింది. లడ్డూ పోటు, ద్రవ్యశాల, ఆలయ ప్రాంగణంతో పాటు గర్భాలయంలో సంప్రోక్షణ చేయాలని నిర్ణయించారు. హెూమం తర్వాత అర్చకులు పంచగవ్య ప్రోక్షణ నిర్వహించనున్నారు ఈ కార్యక్రమంలో ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవో శ్యామలరావు మాట్లాడుతూ.. శ్రీవారి లడ్డూకు వాడే ఆవు నెయ్యిలో దోషం వల్ల అపచారం కలిగిందన్నారు. దీనికి ప్రాయశ్చిత్తంగా హెూమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హెూమం తర్వాత అన్ని పోటుల్లో సంప్రోక్షణ చేస్తామన్నారు. కాగా, లడ్డూ పవిత్రత దోష పరిహారం కోసమే యాగం నిర్వహిస్తున్నామని అర్చకులు అన్నారు. సందేహాల నడుమ ముందుకు సాగలేమని, అందుకే శాంతియాగం నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకులు రామకృష్ణ దీక్షితులు చెప్పారు.

## ఆ కుర్చీ ఎప్పటికైనా కేజ్రీవాల్ దే

మొదటి పేజి తరువాయి

శనివారం ఢిల్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన అతిశీ.. ముఖ్యమంత్రి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ పై తనకున్న భక్తిని చాటుకున్నారు. గతంలో కేజ్రీవాల్ ఉపయోగించిన కుర్చీని పక్కన పెట్టుకుని తాను మరో కుర్చీలో ఆసీనులయ్యారు. ఆ కుర్చీ ఎప్పటికైనా కేజ్రీవాల్ దేనని చెప్పారు. నాలుగు నెలల తర్వాత జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఢిల్లీ ప్రజలు మరోమారు కేజ్రీవాల్ కు పట్టం కడతారని, ఈ కుర్చీలో మరోమారు ఆయనను కూర్చోబెడతారని తనకు విశ్వాసం ఉందన్నారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత మీడియాతో మాట్లాడుతూ.. రామాయణంలో భరతుడితో తనను తాను పోల్చుకున్నారు. రాముడు వనవాసం వెళితే ఆయన తరఫున ప్రతినిధిగా పాలనా బాధ్యతలను భరతుడు చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం తాను కూడా అదేవిధంగా బాధ్యతలు చేపట్టానని వివరించారు. నాలుగు నెలల తర్వాత కేజ్రీవాల్ తిరిగి ఇక్కడికి (సీఎంవోకు) వస్తారని, అప్పటి వరకు పాలన కుంటుపడకుండా తాను చూసుకుంటానని అతిశీ చెప్పుకొచ్చారు.

## జగన్ పై చంద్రబాబు ఫైర్

మొదటి పేజి తరువాయి

అరిచి గీపెట్టి, హైరేంజిలో బుకాయిస్తే మీ పాపాలు కొట్టుకుని పోతాయా? అని ప్రశ్నించారు. శ్రీవారికి తీరని ద్రోహం చేసి చరిత్రహీనులయ్యారని... ఇప్పుడు న్యాయమా? ధర్మమా? అంటూ నీతి వచనాలు పలుకుతున్నారని చంద్రబాబు విమర్శించారు. గతంలో సోనియా గాంధీ, అబ్దుల్ కలాం వంటివారే తిరుమల వచ్చినప్పుడు, వెంకటేశ్వరస్వామిపై నమ్మకం ఉందని అఫిడవిట్ ఇచ్చారని, వాళ్లకంటే మీరు గొప్పవాళ్లా? అని నిలదీశారు. భూమన తన కుమార్తె పెళ్లిని క్రైస్తవ సంప్రదాయం ప్రకారం చేశారని చంద్రబాబు వెల్లడించారు. అలాంటి వ్యక్తికి టీటీడీ చైర్మన్ పదవి ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చరిత్రలో ఎప్పటికీ క్షమించరాని నేరం చేశారని అన్నారు. కాగా, తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై ఐజీ స్థాయి అధికారితో సిట్ వేస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయిస్తామని, సిట్ దర్యాప్తు చేసి రిపోర్టు ఇస్తుందని తెలిపారు. ప్రజల మనోభావాలతో ఆడుకునే హక్కు ఎవరికీ లేదని చంద్రబాబు స్పష్టం చేశారు. తిరుమల శ్రీవారి ప్రసాదం విషయంలో జరిగిన అపచారం తొలగిపోయేందుకు రేపు ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు శాంతిహెూమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పంచద్రవ్య సంప్రోక్షణ కూడా చేపడతామని పేర్కొన్నారు.

# గిన్నిస్ బుక్ లోకి ఎక్కిన మెగాస్టార్ చిరంజీవి...




### నాకు ఈ గిన్నిస్ రికార్డు దక్కడానికి కారణం అదే అనుకుంటా!: చిరంజీవి

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి కీర్తికిరీటంలో మరో కలికితురాయి చేరింది. భారతీయ సినీ చరిత్రలో ఒక అపురూపమైన నటుడు అని గుర్తిస్తూ ఆయనకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ సముచిత స్థానం కల్పించింది. తన సుదీర్ఘ సినీ కెరీర్ లో 156 సినిమాల్లో 537 పాటల్లో 24,000 డాన్స్ మూవ్స్ చేసినందుకు గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లో మెగాస్టార్ చిరంజీవి పేరు నమోదైంది. ఇవాళ హైదరాబాదులోని ఐటీసీ కోహినూర్ హెూటల్ లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రకటన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి చిరంజీవి, గిన్నిస్ బుక్ ప్రతినిధులు, బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్, టాలీవుడ్ ప్రముఖులు, మెగా కుటుంబ సభ్యులు, ఇతర రంగాలకు చెందినవారు హాజరయ్యారు. బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్ చేతుల మీదుగా గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్ అందుకున్న చిరంజీవి... అనంతరం మాట్లాడుతూ, నేను ఎదురు చూడని గొప్ప గౌరవం ఇది అని అభివర్ణించారు. నటన మీద కన్నా డాన్స్ మీద నాకున్న ఇష్టమే ఈ గిన్నిస్ అవార్డు రావడానికి కారణం అనుకుంటా అని వివరించారు. "చిన్నప్పటి నుంచి నేను డాన్స్ లు చేయడం అనేది నాకు ఎక్స్ ట్రా క్వాలిఫికేషన్ అయ్యింది. కొరియోగ్రాఫర్స్ వల్ల కూడా నా డాన్స్ లకు ప్రత్యేకత వచ్చింది. నటనకు అవార్డ్స్ వస్తాయి... కానీ ఈ రకంగా నా డాన్స్ లకు కూడా రికార్డు, అవార్డు వచ్చినందుకు సంతోషంగా ఉంది. ఈ విజయంలో నా దర్శకనిర్మాతలు అభిమానుల పాత్ర మరువలేనిది" అని వివరించారు.

### చిరంజీవి గిన్నిస్ రికార్డుపై చంద్రబాబు, రేవంత్ రెడ్డి స్పందన

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి అత్యధిక డ్యాన్స్ మూవ్ మెంట్స్ తో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించడం తెలిసిందే. నాలుగున్నర దశాబ్దాల సుదీర్ఘ కెరీర్ లో చిరంజీవి 156 సినిమాల్లో నటించారు. 537 పాటల్లో 24 వేల డ్యాన్స్ స్టెప్పులతో గిన్నిస్ బుక్ రికార్డు నమోదు చేశారు. ఇవాళ హైదరాబాదులో ఆయనకు గిన్నిస్ బుక్ వారు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. దీనిపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి స్పందించారు. "మెగాస్టార్, పద్మవిభూషణ్ చిరంజీవి గారికి ఈ సందర్భంగా నా హృదయపూర్వక అభినందనలు. నటుడిగా, డ్యాన్సర్ గా భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన సినీ తారగా చిరంజీవిని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వారు గుర్తించడం హర్షణీయం. తన ప్రతిభ, కళతో తెలుగు సినిమాకు అసమాన సేవలు అందించారు. ఇది చిరంజీవి కీర్తికిరీటంలో మరో కలికితురాయి మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజల ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేస్తుంది" అని ఏపీ సీఎం చంద్రబాబు వివరించారు. ప్రముఖ సినీ నటుడు శ్రీ కొణిదెల చిరంజీవి గారికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో చోటు దక్కడం తెలుగు వారు గర్వించదగిన విషయం అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ శుభ సందర్భంలో వారికి నా అభినందనలు అంటూ ట్వీట్ చేశారు.


### చిరంజీవి గారిది అద్భుతమైన ప్రస్థానం: కేటీఆర్

మెగాస్టార్ చిరంజీవి గిన్నిస్ బుక్ లో స్థానం సంపాదించడం పట్ల బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. తొలి సినిమాతో అరంగేట్రం చేయడం నుంచి, అగ్రగామిగా నిలవడం వరకు చిరంజీవి గారిది ఎంత అద్భుతమైన ప్రస్థానం! అని అభివర్ణించారు. "సరిగ్గా ఇదే రోజున (సెప్టెంబరు 22) 1978లో చిరంజీవి గారు చిత్రసీమలో తనదైన ముద్ర వేశారు. ఇప్పుడు 46 ఏళ్ల తర్వాత భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత ఫలప్రదమైన హీరోగా ఆయన అసమాన ఘనతలను గుర్తించిన ప్రపంచం గిన్నిస్ బుక్ రికార్డుతో వేడుకగా జరుపుకుంటోంది. 156 సినిమాలు, 537 పాటలు, 24000 డ్యాన్స్ మూవ్ మెంట్స్, లెక్కలేనన్ని స్మృతులు... చిరంజీవి గారూ మీరు ఇప్పటికీ కోట్లాది మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. సినిమా కళకు సరైన నిర్వచనంలా, అనేక తరాల వారిని సమ్మోహనంలో ముంచెత్తుతూ తెలుగు సినిమాకు గర్వకారణంలా నిలుస్తున్న మీకు శుభాభినందనలు" అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

### లెజెండ్ కు సెల్యూట్ చేస్తున్నాం: బీఆర్ఎస్ పార్టీ

చిరంజీవి గిన్నిస్ బుక్ రికార్డు సొంతం చేసుకోవడం పట్ల బీఆర్ఎస్ పార్టీ స్పందించింది. లెజెండ్ సెల్యూట్ చేస్తున్నామని ఓ ప్రకటనలో తెలిపింది. "చిరంజీవి గారూ... గిన్నిస్ బుక్ రికార్డు స్థాపించిన మీకు అభినందనలు... 46 ఏళ్ల కెరీర్, 156 సినిమాలు, 537 పాటలు, 24000 డ్యాన్స్ స్టెప్పులు... అద్భుతమైన ఘనత... తెలుగు సినిమా గర్వించదగిన క్షణాలు" అంటూ బీఆర్ఎస్ పార్టీ ట్వీట్ చేసింది.

# త్వరలోనే నామినేటెడ్.. పోస్టుల భర్తీ....



అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబు నేడు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్చార్జిలు, గ్రామ స్థాయి టీడీపీ నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. త్వరలోనే నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పారు. నామినేటెడ్ పోస్టుల భర్తీకి కసరత్తు చేస్తున్నామని, కూటమిలోని మూడు పార్టీల్లో కష్టపడ్డ నేతలకు ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం అని, వారి త్యాగాలు చిరస్మరణీయం అని కొనియాడారు. కార్యకర్తలకు ఇచ్చే ప్రమాద బీమాను రూ.2 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పెంచామని వెల్లడించారు. పార్టీ స్కిల్ డెవలప్‌మెంట్, ఎంపవర్‌మెంట్ విభాగం ద్వారా యువతకు వివిధ కంపెనీలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, ఎన్ఆర్ఐ టీడీపీ విభాగం ద్వారా విద్యార్థులకు శిక్షణను ఇచ్చి విదేశాల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నామని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని చంద్రబాబు చెప్పారు. 100 రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలు అంటున్నారని వివరించారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ పథకం అమలు చేస్తామని తెలిపారు.

చంద్రబాబు వ్యాఖ్యల హైలైట్స్...

చరిత్రలో కనీవినీ ఎరుగని విజయాన్ని ప్రజలు మనకు ఇచ్చారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా మన పాలన ఉండాలి. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసి వ్యవస్థలను సర్వనాశనం చేసింది. నాడు వారు చేసిన పాపాలే నేడు ప్రజలకు శాపాలుగా మారాయి. జగన్మోహన్ రెడ్డి అసమర్థ పాలన వల్ల జరిగిన నష్టాన్ని ప్రజా క్షేత్రంలో వివరించాలి. కూటమి ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో మనం చేసిన పనులు ప్రజలకు తెలపాలి. గత పాలకులు పాపాలను ప్రజలకు తెలియజేయాలి. సంక్షేమం,అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తున్నాం. 2029 నాటికి టీడీపీని తిరుగులేని శక్తిగా మారుస్తా. ప్రజల సెంటిమెంట్ తోనూ ఆడుకునే స్థాయికి గత పాలకులు దిగజారారు. కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి లడ్డూలో జంతువుల కొవ్వు వినియోగించారు. దోషులను వదలబోము. నేరం చేయడం, తప్పించుకోడానికి ఎదురుదాడి చేయడం అలవాటుగా మారింది. ఇలానే వదిలేస్తే అబద్ధాలను పదేపదే చెప్పి ప్రజలను మోసం చేస్తారు. అధికారం చేపట్టగానే తిరుమల నుండే ప్రక్షాళన మొదలు పెట్టాం. తిరుమలలో గోవింద నామస్మరణ తప్ప ఏ ఇతర నినాదాలు వినిపించకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. ప్రజలంతా ఇది మంచి ప్రభుత్వం అని భావిస్తున్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ఖజానాలో డబ్బులు లేకపోయినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకుంటున్నాం. గత అసమర్థ పాలనతో ప్రభుత్వంలోని పలు విభాగాలు గాడితప్పాయి. వాటిని సరిదిద్దుతున్నాము. పెండింగ్ బిల్లులను విడుదల చేస్తూ ముందుకు పోతున్నాం. మనది ప్రజా ప్రభుత్వం... ఆర్భాటాలు లేవు. 100 రోజుల్లో ఏం చేశామో ప్రజలకు చెప్పండి. నేతలు ఇంటింటికీ వెళ్లాలి. గ్రామ, వార్డు సచివాలయాలతో పార్టీ ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకోవాలి. చారిత్రాత్మక విజయం అందించిన ప్రజలకు మనం సంక్షేమం, అభివృద్ధి అందించాలి.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన మహేశ్ బాబు

మొదటి పేజి తరువాయి



రూపొందనున్న చిత్రం త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుంది. ఈ చిత్రంలో మహేశ్ ఎలా కనిపించబోతున్నాడనే విషయంపై అభిమానుల్లో కాస్త ఉత్కంఠ నెలకొంది. అయితే ఈ ఘట్టమనేని హీరో కూడా ప్రస్తుతం అదే మేకోవర్‌లో వున్నాడు. అడ్వెంచరస్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రం ఇండియానా జోన్స్ నేపథ్యంలో వుంటుందని ఇటీవల రాజమౌళి తండ్రి, రచయిత విజయేంద్రప్రసాద్ ఓ ఇంటర్వ్యూలో చెప్పిన సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రంలో మహేశ్ లుక్‌పై రకరకాల వార్తలు ప్రచారంలో వున్నాయి. అయితే మహేశ్ తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వరద బాధితుల కోసం రూ. 50 లక్షలు, ఏఎంబీ సినిమాస్ తరపున మరో రూ. 10 లక్షల విరాళం అందజేశారు. జూబ్లీహిల్స్ లోని రేవంత్ నివాసంలో ఆయనను కలిసి చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్ తో పాటు ఆయన సతీమణి నమ్రత కూడా వున్నారు. మహేశ్, రేవంత్ రెడ్డిని కలిసిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోలో లాంగ్ హెయిర్, గడ్డం, వైట్ ఫుల్‌హ్యాండ్ టీషర్ట్‌లో కనిపిస్తున్న మహేశ్ బాబును చూసి ఆయన అభిమానులు పండగ చేసుకుంటున్నారు. తమ హీరో రాజమౌళి సినిమాలో ఇదే లుక్‌లో కనిపించబోతున్నాడని చర్చించుకుంటున్నారు.

# పువ్వులనే దైవాలుగా పూజించే పండుగ.. మన బతుకమ్మ పండుగ.. విశేషాలు..!

హైదరాబాద్: దేవుళ్లను పువ్వులతో పూజించడం సహజం. కానీ పువ్వులనే దేవుళ్లుగా కొలిచే పండుగ ఒకటి ఉంది. అదే మన తెలంగాణ బతుకమ్మ పండుగ. ఇలా పువ్వులను పూజించే సంస్కృతి బహుశా ప్రపంచంలో ఎక్కడా ఉండకపోవచ్చు. మరికొద్ది రోజుల్లో తెలంగాణలో బతుకమ్మ సంబరాలు ప్రారంభం కానున్నాయి. తెలంగాణ ఉద్యమ కాలంలో పాటకు ఎంత ప్రాధాన్యం ఉండేదో.. బతుకమ్మకు కూడా అంతే ప్రాధాన్యం ఉండేది. తెలంగాణ అస్తిత్వ పోరాట చిహ్నంగా 'బతుకమ్మ' మారిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అంతటి ప్రాధాన్యం కలిగిన బతుకమ్మ గురించి మరిన్ని విశేషాలు తెలుసుకుందాం..

ప్రతి ఏటా ఈ బతుకమ్మ పండుగ సమీపించే సమయానికి ప్రకృతి అంతా పూలవనంగా మారుతుంది. ప్రకృతిలో సేకరించిన పూలను ప్రకృతికే సమర్పించుకోవాలనే ఉద్దేశంతో బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేస్తారు. నిత్యనూతనమై తెలంగాణ వాకిట్లో సిరులొలికించే ప్రకృతి పండుగ బతుకమ్మను మహిళలు భక్తి పారవశ్యంతో జరుపుకోవడం ఆనవాయితీ. శీతాకాలపు తొలిరోజుల్లో వచ్చే ఈ పండుగ వేళ వర్షాలతో జలాశయాలు కళకళలాడుతుంటాయి. రకరకాల, రంగురంగుల పువ్వులు వికసించి కనువిందు చేస్తుంటాయి. గునుగుపూలు, తంగేడు పూలు ఎక్కడ చూసినా విరబూసి ఉంటాయి. బంతి, చేమంతి, నందివర్ధనం లాంటి పూలకు కూడా ఇదే సీజన్. సోంపు పూలు, టేకు పూలు కూడా ఇదే సీజన్‌లో లభిస్తాయి. గుమ్మడి, కట్లాయి, అల్లీపూలు ఇదే సమయంలో విరబూస్తాయి. అశ్వయుజ మాసం పెత్రమాస (మహాలయ అమావాస్య, పితృ అమావాస్య) తో బతుకమ్మ వేడుకలు ఆరంభమవుతాయి. అష్టమి వరకు కొనసాగే ఈ పండుగలో కేవలం ఆచారమే కాదు.. శాస్త్రీయత కూడా దాగి ఉంది. కొత్త బట్టలు ధరించి, ఇత్తడి తాంబూలంలో గుమ్మడి ఆకులు పరిచి, వాటిమీద తంగేడు పూలు పేరుస్తారు. తర్వాత గునుగు, బంతి, చామంతి, అడవి చామంతి, ముత్యాల పువ్వు, రుద్రాక్ష, నీల గోరింట, పట్టుకుచ్చులు, కట్ల, బీర పువ్వులను బతుకమ్మలను పేర్చడంలో వినియోగిస్తారు. బతుకమ్మకు వాడే పువ్వులన్నీ ఔషధ గుణాలు కలిగి ఉంటాయి.



తంగేడు పూలు గొంతు, మూత్ర సంబంధిత సమస్యలకు ఔషధంగా పనిచేస్తాయి. గునుగు పువ్వు యాంటీ డయేరియా, యాంటీ డయోబెటిక్ లక్షణాలు కలిగి ఉంటుంది. బంతి పువ్వు క్రిమిసంహారిణి, దోమలను నివారించే శక్తికలిగి ఉంటుంది. చామంతిని కాలిన గాయాలకు, దెబ్బలకు, కంటి సంబంధిత రోగాలకు, జీర్ణానికి ఔషధంగా వాడతారు. ఇది యాంటీ బ్యాక్టీరియా లక్షణాలు కలిగి కాలుష్య కారకాలైన బెంజిన్, అమ్మోనియా వాయువులను పీల్చుకుని గాలిని శుద్ధి చేస్తుంది. ఇలా బతుకమ్మ పేరిట వాడే ప్రతీ పువ్వుకు అనేక ఔషధ గుణాలున్నాయి. ఈ పువ్వులన్నింటినీ గోపురంలా పేర్చాక పైన గుమ్మడి పువ్వు గొడుగు పెడతారు. తమల పాకులో పసుపుతో చేసిన గౌరమ్మను ఉంచి పక్కనే దీపం వెలిగిస్తారు. పసుపు శుభసూచకం. అంతేకాదు క్రిమి సంహారిణి కూడా. ఇక దీపం జ్ఞానానికి సంకేతం. అది గాలిని శుద్ధి చేస్తుంది. క్రిములను హరిస్తుంది. బతుకమ్మల్లోని పూలకున్న ఔషధగుణాలు నిమజ్జనం సందర్భంగా నీటిని శుద్ధి చేసి, నీటి ద్వారా వచ్చే రోగాలను హరిస్తాయి. తొమ్మిది రోజులు జరుపుకునే బతుకమ్మ పండుగలో ఎన్నో విశిష్టతలు దాగి ఉన్నాయి. అడపడుచులు తమ మనోభావాలను పాటల ద్వారా వెల్లడిస్తారు. సంతోషాన్ని అడుగులు, చప్పట్ల ద్వారా ప్రదర్శిస్తారు.

స్త్రీల సౌందర్య ఆరాధనం, అలంకార నైపుణ్యం, కళాత్మక దృష్టి, బతుకమ్మను పేర్చడంలో ఉట్టిపడుతుంది. పండుగలో తల్లి బతుకమ్మ, పిల్ల బతుకమ్మలు పేర్చడం ద్వారా తల్లి పక్కనే పిల్ల ఉండాలనే స్త్రీమాతృ హృదయం ఎలాంటిదో అవగతమవుతుంది. త్రికోణం స్త్రీకి సంకేతం. త్రికోణం (పిరమిడ్ ఆకారం) లోని పసుపు ముద్ద సంతాన, సౌభాగ్య ప్రదాయిని అయిన గౌరీదేవికి చిహ్నమని పూర్వీకులు ఆడపడుచులకు అర్థమయ్యే రీతిలో చెబుతుంటారు. 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో' అంటూ సాయంత్రం ఇంటి ముందు కానీ, వీధిలో కానీ, దేవాలయంలో కానీ, చెరువు దగ్గర కానీ, వాగు దగ్గర కానీ ఆడపడుచులంతా చేరి బతుకమ్మలను మధ్యలో పెట్టుకుని పాటలు పాడతారు. ఒకరు పాట చెబుతుంటే మిగతా మహిళలు వంతపాడుతారు.

### ఏ రోజు ఏ బతుకమ్మ..!

ఏకంగా తొమ్మిది రోజులపాటు ఈ బతుకమ్మ ఉత్సవాలు జరుగుతాయి. తొమ్మిది రోజులు జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలను 9 వేర్వేరు పేర్లతో పిలుస్తారు. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ, రెండోరోజు అటుకుల బతుకమ్మ, మూడోరోజు ముద్దపప్పు బతుకమ్మ, నాలుగో రోజు నాన బియ్యం బతుకమ్మ, ఐదోరోజు అట్ల బతుకమ్మ, ఆరోరోజు అలిగిన బతుకమ్మ, ఏడోరోజు వేప కాయల బతుకమ్మ, ఎనిమిదో రోజు వెన్న ముద్ద బతుకమ్మ, తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ. ఇలా రోజుకో పేరుతో అమ్మవారిని కొలుస్తారు. ఆరో రోజున అలిగిన బతుకమ్మకు నైవేద్యం ఉండదు. కానీ మిగిలిన అన్ని రోజుల్లో రోజుకో రకం పదార్థాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు.

# ఎమ్మెల్యేల మీద దృష్టి పెట్టారా?

కాంగ్రెస్ నేతలు పని చేయట్లేదన్న వాదన బలంగా వినిపిస్తోంది. తాజాగా ఆ అంశాన్ని సీఎం రేవంత్ ప్రస్తావించటం గమనార్హం. "ప్రతిపక్షాల విమర్శల్ని తిప్పి కొట్టేందుకు సన్నద్ధంగా ఉండాలి. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసే వారికి పదవులువస్తాయి. పార్టీ అనుబంధ విభాగాల్లో పని చేసిన 36 మందికి నామినేటెడ్ పోస్టులు ఇచ్చాం. అధికారం కోల్పోయిన ప్రతిపక్షం అసహనంతో ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలకు పాల్పడుతోంది. పార్టీ నేతలు వాటిని తిప్పి కొట్టాలి. ఇంచార్జి మంత్రులు వారానికి రెండుసార్లు తమకు కేటాయించిన జిల్లాల్లో పర్యటించాలి. వచ్చే ఎన్నికల్లో నాలుగోసారి గెలిచి అధికారంలోకి వచ్చేందుకు జమిలి ఎన్నికల్ని మోడీ తీసుకొస్తున్నారు. జాగ్రత్తగా ఉండాలి" అంటూ హెచ్చరించారు.



ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకుతాను ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదన్న ముఖ్యమంత్రి.. ప్రభుత్వం చేపడుతున్న కొత్త కార్యక్రమాల్ని ప్రజల్లోకి ఎమ్మెల్యేలు తీసుకెళ్లాలన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా 27 రోజుల్లో రూ.18వేల కోట్ల మేరకు రైతుల రుణాల్ని మాఫీ చేశామన్న రేవంత్.. "ప్రభుత్వానికి ప్రతి నెలా 18వేల కోట్ల ఆదాయం వస్తోంది.ఇందులో జీతభతయాలు.. అప్పుల వాయిదాలు.. వడ్డీలకే రూ.12వేలకోట్లు పోతున్నాయి. మిగిలిన రూ.6వేల కోట్లతోనే సర్దుబాటు చేసుకుంటూ వస్తున్నాం. దుబారా ఖర్చులు పూర్తిగా తగ్గించాం" అంటూ తమ ప్రభుత్వం చేస్తున్న కసరత్తును చెప్పుకొచ్చారు.

## సాగు చేసిన జామాయిల్ నరికివేతకు అనుమతివ్వండి

### అటవీశాఖాధికారికి సిపిఐ,వినతి .



ఖమ్మం(**నేటి శుభోదయ**): గిరిజనులు వన సంరక్షణ సమితి ద్వారా సాగు చేసిన జామాయిల్ పంట నరికి విక్రయించేందుకు అనుమతి ఇవ్వాలని సిపిఐ ఆధ్వర్యంలో గిరిజనులు అటవీ శాఖాధికారికి విజ్ఞప్తి చేశారు. సోమవారం అటవీ శాఖాధికారులకు వినతి పత్రం సమర్పించారు. 2000 సంవత్సరంలో పెనుబల్లి మండలం గట్టుగూడెం ఫారెస్టు బీట్ లో వన సంరక్షణ సమితి ద్వారా 13 హెక్టార్లలో జామాయిల్ పంటను సాగు చేయడం జరిగిందని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. వాస్తవానికి ఐదేండ్లకే జామాయిల్లు కటింగ్ చేయాలని కాని 24 ఏళ్లు గడిచినా కటింగ్ చేసేందుకు అనుమతి ఇవ్వకపోవడంతో గాలికి చెట్లు విరిగి పోతున్నాయని గిరిజనులు అటవీ అధికారులకు తెలిపారు. వన సంరక్షణ సమితి సభ్యులు కుటుంబాలతో కలిసి జామాయిల్లు పెంచేందుకు చేసిన శ్రమ వృథా అవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దరఖాస్తులను పరిశీలించిన అటవీ శాఖాధికారులు వారం రోజుల్లో అనుమతులు ఇస్తామని గిరిజనులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటుప్రసాద్, నాయకులు తాటి వెంకటేశ్వరరావు, కొమ్మినేని సుధాకర్, వన సంరక్షణ సమితి ఛైర్మన్ పి.పుల్లయ్య, సభ్యులు జోగయ్య, సావిత్రి, వెంకటేష్, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా సామాన్యుడికి అందుబాటులో ఖమ్మం అన్న ఎన్టీఆర్ , క్యాంటీన్



ఖమ్మం(**నేటి శుభోదయ**): అన్న ఎన్టీఆర్ అభిమానుల ఆధ్వర్యంలో ఖమ్మం కాలవొడ్డు అన్న ఎన్టీఆర్ విగ్రహం నందు అన్నా క్యాంటీన్ ని సోమవారం, ఖమ్మం బిలీఫ్ హాస్పిటల్ రమజ్యోతి , మరియు నందమూరి బాలకృష్ణ ఫాన్స్ జిల్లా అధ్యక్షులు తాళ్లూరి శ్రీనివాస్ చౌదరి చే అన్న విగ్రహానికి నివాళులర్పించి అన్న క్యాంటీన్ ని ప్రారంభించడం జరిగింది. అన్న క్యాంటీన్ నిర్వాహకులు నల్లమల రంజిత్ మాట్లాడుతూ ఈ అన్న క్యాంటీన్ సామాన్యుడు కి అందుబాటులో ఉండి ప్రతి రోజు 150 నుంచి 200 మందికి అన్నం పెట్టాలని అనే ఆలోచన తోనే అన్న అభిమానుల ఆధ్వర్యంలో ఈ అన్న క్యాంటీన్ మొదలు పెట్టడం జరిగింది. ఈ అన్నా క్యాంటీన్ కి పుట్టినరోజు, పెళ్లిరోజుల సందర్బంగా లేదా మీ కుటుంబ సభ్యుల పేరు మీద అన్న మీద అభిమానం తో మీలో ఎవరైనా అన్నదానం చేయాలి అని అనుకుంటే ఈ అన్న క్యాంటీన్ ని సంప్రదించవచ్చు అని నిర్వహకులు చెప్పడం జరిగింది....ఈ కార్యక్రమం లో తాళ్లూరి శ్రీనివాస్ చౌదరి, ఆంజనేయులు గౌడ్, కైలేశ్వరరావు, కిరణ్, బి.కనకయ్య, బెల్లంకొండ శీను, నిరజ్, నవీన్ తదితరులు పాలుగోన్నారు..

## కూకట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా పుష్ప రెడ్డి నియామకం



(కూకట్‌పల్లి)(**నేటి శుభోదయ**): (సాధనాల వీరేంద్ర): మేడ్చల్ జిల్లా పరిధిలోని కూకట్ పల్లి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీకి కొత్త పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రం పరిధిలో పలు జిల్లాలలో వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చైర్మన్లు, వైస్ చైర్మనలను, కొత్త పాలకవర్గాలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ తో కలుపుకొని మొత్తం 18 మంది సభ్యులతో నూతన కమిటీని ప్రభుత్వం నియమించింది. ఇందులో భాగంగా కూకట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గా కొండకింది పుష్ప రెడ్డి, వైస్-చైర్మన్ గా జి. ప్రకాష్ ముదిరాజ్ ని నియమిస్తూ ఉత్తర్వులు శుక్రవారం జారీ చేసిన విషయం తెలిసిందే. వీరితో పాటు మరో 16 మంది పాలకవర్గ సభ్యులతో కూడిన జాబితాను ఏపీసి కార్యదర్శి రఘునందన్ రావు ప్రకటించారు. నూతన పాలక వర్గం నేటి నుండి రెండేళ్ల కాల వ్యవధిలో పని చేయనున్నారు. కూకట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నియామకానికి సహకరించిన కూకట్ పల్లి నియోజకవర్గ ఇన్చార్జి బండి రమేష్, ఇతర నాయకులకు, ప్రతినిధులకు కొండకింది పుష్ప రెడ్డి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆమె చెప్పారు.

## తాగునీటి ఇబ్బందులు రానివ్వొద్దు -మంత్రి తుమ్మల ఆదేశం



ఖమ్మం(**నేటి శుభోదయ**): ఖమ్మం నగరంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలెక్టర్‌ముజమ్మిల్ ఖాన్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యలను ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నీటి ఎద్దడి సమస్య పరిష్కారం, తదితర సమస్యలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మున్నేరు వరదల వల్ల మరమ్మత్తుకు గురైన మోటార్ల వల్ల నగరంలోని తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాత్రిలోగా సమస్యను పరిష్కరించి నేటి నుంచి నీటి సమస్య రానివకుండ చూడాలని అధికారులను ఆదేశించారు.

## కృష్ణాజిల్లా పంచాయతీ అధికారిణిగా అరుణ



(కూకట్‌పల్లి)(**నేటి శుభోదయ**): (సాధనాల వీరేంద్ర): కృష్ణాజిల్లా పంచాయతీ అధికారిణిగా జె అరుణ నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన జిల్లా పంచాయతీ అధికారుల బదిలీల్లో భాగంగా పోస్టింగ్ కోసం వెయిటింగ్ లో అరుణను జిల్లాకు బదిలీ చేశారు. ఇప్పటి వరకు జిల్లా పంచాయతీ అధికారిగా పని చేసిన నాగేశ్వర నాయక్ ను చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు. జిల్లా పంచాయతీ అధికారిణిగా నియమితులైన అరుణ గతంలో ఉమ్మడి కృష్ణాజిల్లా పంచాయతీ అధికారిణిగా విశేష సేవలు అందించారు.

# వీధి కుక్కల, కోతుల బెడత నుండి కాపాడండి....

## సంబంధిత అధికారులను వేడుకుంటున్న ప్రజలు...



పెద్దపల్లి ప్రతినిధి(**నేటి శుభోదయ**): పెద్దపల్లి జిల్లా మంథని మండలం లోని స్వర్ణ పల్లి గ్రామంలో వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడ్డ ఇద్దరు చిన్నారుల విషయం తెలిసినదే ఈ సంఘటనను దృష్టిలో పెట్టుకొని ఇలాంటి సంఘటనలు మల్లి పునరావృత్తం కాకా ముందే నివారణ చెర్యలు చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. మంథనిలో కుక్కల బెడద విపరీతంగా ఉండడంతో ప్రజలు భయభ్రాంతులకు లోనవుతున్నారు. అధికారులు వీటిని నియంత్రించకపోవడం బాధాకరమని ప్రజలు వాపోతున్నారు. వీధి కుక్కలు పలుచోట్ల పలు గ్రామాలలో చిన్నారుల పైన, మహిళల మీద,వృద్ధుల పైన అనేక దాడులు చేస్తున్నాయని,రాత్రి సమయం లో రహదారుల మీద ఉండటం వల్ల వాహన దారులకు రోడ్ ప్రమాదం లు జరుగుతున్నవి. కుక్కల దాడులను నియంత్రించాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులను బయటకు, పాఠశాలలకు వెళ్లి వచ్చే సమయం లో భయం వేస్తుందని మంథని మండలం లోని ప్రజలు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో కుక్కలను నియంత్రించకపోవడం విపరీతంగా పెరగటం వల్ల ఎక్కడ పడితే అక్కడ కుక్కలు గుంపులు గుంపులుగా వచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి,చాలా ఇబ్బందులు ఎదురుకుంటున్న సందర్భంగా ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని మంథని మండలం లోని ప్రజలు కోరుతున్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజా సమ్యవాదులు ప్రతి ఒకరు ఖండించాలి....

### సిపిఎం కార్వ వర్గ సభ్యులు ఎర్రవెల్లి ముత్యంరావు...... ప్రజా సంఘాల నాయకులు బూడిద గణేష్.... ఆర్ల సందీఫ్...



పెద్దపల్లి మంథని,(**నేటి శుభోదయ**): పెద్దపల్లి జిల్లా మంథని



పట్టణం లో సీపీయం మహాసభను సోమవారం రోజున మంథని విద్యార్థి యువత కార్యాలయంలో నిర్వహించారు.సీపీయం కార్యదర్శి బూడిద గణేష్ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు.ఈ సందర్భంగా సీపీయం మహాసభను ఉద్దేశించి ఎర్రవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవాలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజా సంఘాల నాయకులు, అభ్యుదయవాదులు, మంథనిలోని వారు ప్రతి ఒకరు ఖండించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 మాసాలు గడుస్తున్నా ప్రజా సమస్యల పట్ల దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. సామాన్య ప్రజలు కార్మికులు, విద్యార్థులు, యువకులు, దినసరి కూలీలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. పంట రుణాలు పూర్తిస్థాయిలో మాఫిగాక రైతులు అనేక ఇబ్బందులు పడుతూ బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు.గతంలో కౌలు రైతులకు రుణాల కోసం కార్డులు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కౌలు రైతులను పట్టించుకోవడంలేదని విమర్శించారు కార్మికులకు నెలలు తరబడి జీతాలు అందక దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని అన్నారు. విద్యార్థులకు ఫీజ్ రీమెంబర్ మెంట్స్ రాక ఆర్థికంగా చాలా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత చదువులు చదివిన విద్యార్థులకు ఎలాంటి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక రోడ్ల మీద తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా రాష్ట్ర, కేంద్ర



ప్రభుత్వాలు ప్రజా సమస్యలపై దృష్టి సారించి పనిచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్ల సందీప్ , ఏల్పుల సురేష్, బి రవి, గొరింకల సురేష్, మౌర్య, ఏ సమ్మయ్య, సీపీయం నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డును ఎత్తివేయాలి

### ప్రజల ఆందోళనకు సిపిఐ పూర్తి మద్దతు

### జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్



ఖమ్మం(**నేటి శుభోదయ**): ప్రజలు రోగాల బారీనపడేందుకు కారణమవుతున్న రాపర్తి నగర్ డంపింగ్ యార్డును వెంటనే ఎత్తి వేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ డిమాండ్ చేశారు. దాదాపు ఐదు కాలనీల పరిధిలోని వేలాది మంది -ఇబ్బందులుపడుతున్నా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని స్పందించకపోతే సిపిఐ పక్షాన -ఆందోళనను ఉధృతం చేస్తామని ఆయన తెలిపారు. నాలుగు రోజులుగా డంపింగ్ యార్డును ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ -ఆందోళన చేస్తున్న స్థానికులకు సోమవారం దీక్షా శిబిరం వద్దకు చేరుకుని దీక్షలకు సంఘీభావం ప్రకటించారు. నగరంలోని చెత్తను ఇక్కడకు తీసుకు వచ్చి వేయడం ద్వారా దుర్గంధం వస్తుందని డంపింగ్ యార్డు చుట్టూ ఉన్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని శ్వాసకోశ వ్యాధులకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని ప్రసాద్ తెలిపారు. ఆందోళనలు జరిగినప్పుడు అధికార యంత్రాంగం ముఖం చాటేయడం ఆ తర్వాత షరామామూలే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రసాద్ ఆరోపించారు. డంపింగ్ -యార్డు మార్చకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. మద్దతు తెలిపిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, మేకల శ్రీనివాస్ తదితరులు ఉండగా దీక్షల్లో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బోడా వీరన్న, వివిధ పార్టీల నాయకులు పగడాల నాగేశ్వరరావు, గాలి క్రాంతి కుమార్, నాగాచారి, పాలడుగు నాగేశ్వరరావు, రాము, వెంకన్న, బానోత్ చంద్రరావు, -విజయ, సోమిరెడ్డి ఉపేందర్ రెడ్డి, నల్లమోతు కోటేశ్వరరావు, శెట్టి రవీందర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. డంపింగ్ యార్డును నిరసిస్తూ జరిగిన ఆందోళనకు ఇడ్లీ గరం బండ్ల సంఘం, లంబాడ పోరాట హక్కుల సమితి తదితర సంఘాలు మద్దతునిచ్చాయి.

## కార్మికుల సమస్యలపై నికరంగా పోరాడేది సిఐటియు మాత్రమే...



ఖమ్మం ,(**నేటి శుభోదయ**): దేశవ్యాప్తంగా కార్మికుల సమస్యలపై నిజాయితీగా, నిలకడగా పోరాటాలు చేసే సంఘంగా సిఐటియు , కు గుర్తింపు వుంది అని, యాజమాన్యాల ఒత్తిడికి లొంగకుండా కార్మికుల ప్రయోజనాలే పరమావధిగా సిఐటియు , భావిస్తుంది అని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ పేర్కొన్నారు. ఖమ్మం బైపాస్ రోడ్ పెద్ద కూరగాయల మార్కెట్ లో సిఐటియు హమాలీ నూతన కమిటీ సమావేశంలో అయన మాట్లాడారు. ఈ సందర్భంగా బైపాస్ రోడ్ పెద్ద కూరగాయల మార్కెట్ లో కార్మికుల విశ్రాంతి హల్ లో జరిగిన మీటింగ్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో వందల సంఖ్యలో సిఐటియు కు అనుబంధంగా వందల సంఖ్యలో రంగాలు వారిగా వివిధ సంఘాలు వున్నాయని, ప్రతి సందర్భంలోనూ కార్మికుల ప్రయోజనాలే పరమావధిగా భావించి నిజాయితీగా కార్మికుల పట్ల చిత్తశుద్ధితో పోరాటాలు నిర్వహించేది కేవలం సిఐటియు , సంఘం మాత్రమే అని సృష్టం చేశారు. ఖమ్మం బైపాస్ కూరగాయల మార్కెట్ లో వారు పడుతున్న కష్టాలకు అనుగుణంగా సరియైన వేతనం హమాలీలకు వచ్చే విధంగా తగిన పోరాటం చేస్తామని తెలిపారు. దేశంలోని ప్రతి కార్మికుడు కు నెలకు కనీస వేతనం 25 వేలు వచ్చే విధంగా రాబోయే కాలంలో కార్మిక సంఘాలను కలుపుకుని పోరాటాలు చేయబోతున్నట్లు పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వంలో సగటు కార్మికుడు కష్టాలు పడుతున్నాడు అని, వారు ఇబ్బందులు తొలగి



పోవాలంటు బిజెపి విధానాలకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమాల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు కోరారు. ఈ సందర్భంగా కూరగాయల మార్కెట్ హమాలీ వర్కర్స్ యూనియన్ సిఐటియు నూతన కమిటీ ను ఎన్నుకోనున్నారు.గౌరవ అధ్యక్షులు వై.విక్రమ్ , గౌరవ సలహాదారు అరిగే బీరప్ప అధ్యక్షులు గొడుగు సైదులు ఉపాధ్యక్షులు శనిగరపు శీను ఉపాధ్యక్షులు ఆకుల ఎంకన్న ప్రధాన కార్యదర్శి మేడబోయిన సీతయ్య సహాయ కార్యదర్శి బడికే నరసింహ సహాయ కార్యదర్శి కర్రే రమేష్ సహాయ కార్యదర్శి చిన్న ఇస్తారి కోశాధికారి వేముల సత్యనారాయణ ను ఎన్నుకోనున్నారు. ఈ కార్యక్రమంలో భుక్యా శ్రీనివాసరావు రావు, బండారు యాకయ్య, బోడపట్ల సుదర్శన్, భుక్యా ఉపేంద్ర నాయక్, బీరప్ప తదితరులు పాల్గొన్నారు

# 46వ డివిజన్ లో వరద బాధితులకు నిరంతరము దుప్పట్లను పంపిణీ





ఖమ్మం(నేటి శుభోదయ): తోట రామారావు ఆధ్వర్యంలో వారు సతీమణి కార్పొరేటర్ గోవిందమ్మ , వారి కుమారులు డాక్టర్ లక్ష్మణ్, రమేష్ మరియు కుమార్తె కందగొండ నాగమణి ఆధ్వర్యంలో మున్నేరు వరదల్లో కొట్టుకుపోయిన వారికిలితమకు తోచినంత సహాయం చేశామని అన్నారు 46వ డివిజన్ ప్రాంతంలో వరద బాధితులకు దుప్పట్లు, పంపిణీ నిరంతరము నిర్వహించడం. జరుగుతుంది. ప్రతిరోజు కొనసాగుతుందని ఈ సందర్భంగా తోట రామారావు తెలియజేసినారు. ఈ సందర్భంగా తోటరామారావు మాట్లాడుతూ 46వ డివిజన్లో ప్రజలు నాతో సంతోషంగా ఉంటారని కలిసిమెలిసి ఉంటారని వాళ్ల గుండెల్లో కూడా ఎప్పుడూ ఉండాలని ప్రతి ఒక్క ఇంటికి వెళితే కొడుకా అన్నయ్య తమ్ముడు డివిజన్లో ఉన్న ప్రజలు ఆప్యాయంగా పిలుస్తున్నారు ఈ సందర్భంగా అన్నారు అందువల్ల వారిని చూసి 46వ డివిజన్లో ప్రజలందరికీ ఇంటింటికి తిరుగుతూ ఈ దుప్పట్లను పంచి పెట్టడం జరుగుతుంది. అన్నారు ఈ కార్యక్రమంలోలి 46వ డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ యూత్ లీడర్ తోట రమేష్, వంగాల వెంకట్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను వెల్ఫేర్ బోర్డు ద్వారానే నిర్వహించాలి

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి (నేటి శుభోదయ): తెలంగాణ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను వెల్ఫేర్ బోర్డు ద్వారా ద్వారానే ఇవ్వాలని భవన నిర్మాణ కార్మికుల సమైక్య సంఘం పెద్దపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ కి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా

### మండలాధ్యక్షుడు మిట్టపల్లి సతీష్ మాట్లాడుతూ

పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు చిలువేరు స్వామి ఆదేశాల మేరకు కలెక్టర్కు వినతి పత్రం ఇవ్వడంజరిగిందన్నారు. సంక్షేమ పథకాలను టెండర్ పద్ధతిలో ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వాలన్న నిర్ణయాన్ని మార్చుకోవాలని ఇప్పుడు ఉన్న పద్ధతిలోనే వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు నేరుగా అందించాలని ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇస్తే వారు పెట్టే రూల్స్ కార్మికులకు అర్థం కాక వారు అడిగే సర్టిఫికెట్ ఇవ్వలేక పూర్తిస్థాయిలో కార్మికులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు .లేబర్ డిపార్ట్మెంట్ ద్వారా వెరిఫికేషన్ చేసి కార్మికులకు క్లెయిమ్స్ అందివ్వడం జరుగుతుందని అదే పద్ధతిలోనే ఇవ్వాలని అన్నారు.

### జిల్లా కార్యవర్గ సభ్యుడు కుక్క మల్లేష్ మాట్లాడుతూ

బయోమెట్రిక్ లోపాలతో కార్మికులకు లేబర్ కార్డు రెన్యువల్ చేసుకునే మరియు క్లెయిమ్స్ అప్లై చేసే సమయంలో మీ సేవా కేంద్రాలలో వేలిముద్రలు పడక కార్మికులు నానా ఇబ్బందులు పడుతున్నారని . సంక్షేమ పథకాలు ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు



కట్టబెడితే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మిట్టపల్లి సతీష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కుక్క మల్లేష్,. మండల ఉపాధ్యక్షులు తాటిపాముల నరసయ్య, కేదాసి శ్రీనివాస్,ఎండి అసన్ అలీ, ఎలిగేటి నారాయణ, ఆడెపురోహిత్, కలవీన సంపత్, బలవీణ రాజేశం, మల్యాల రవి, పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలి

### – పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

### ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి(నేటి శుభోదయ): ప్రజా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని స్థానిక సంస్థల జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ తో కలిసి కలిసి పాల్గొన్నారు.ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి సంబంధిత శాఖలకు జిల్లా కలెక్టర్ కేటాయించి ప్రజల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని ఆదేశించారు.సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (27) దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామానికి చెందిన పి.ఊపేందర్ ఎస్సీ కార్పొరేషన్ కింద సబ్సిడీపై ఆటో మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఈడీ ఎస్సీ కార్పొరేషన్ అధికారిక రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంట గ్రామానికి చెందిన ఎం.మల్లా రెడ్డి తన ఇంటిని దౌర్జన్యంగా కూలగొట్టి ఆక్రమించుకోవడానికి తనను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పెద్దపల్లి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కు రాస్తూ వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు.రామగుండం లోని కృష్ణ రామగుండం లోని కృష్ణ నగర్ కాలనీవాసులు ఏ.రాజేశం కృష్ణానగర్ లో ఎన్టిపిసి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న గల్లీలో 30 అడుగుల రోడ్డును ఆక్రమించి అక్రమ నిర్మాణం చేశారని, దీనివల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇట్టి అక్రమ నిర్మాణాన్ని జిల్లా టాస్కోర్స్ కమిటీ , రామగుండం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించేలా తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా రామగుండం మున్సిపల్ కమిషనర్ కు రాస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.పెద్దపల్లి మండలం హనుమంతునిపేట గ్రామానికి చెందిన ఏ.లలిత తనకు 50% ఫిజికల్ డిసేబిలిటి ఉందని, తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఓదెల మండలం గుంపుల గ్రామానికి చెందిన ఏ.బుచ్చమ్మ తమకు గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ లో ఉచిత విద్యుత్తు రావడం లేదని, కరెంట్ బిల్లు కూడా అధికంగా వస్తుందని, తన భర్త అనారోగ్యంతో ఉన్నారని, అధిక బిల్లు చెల్లించలేకపోతున్నామని తమకు గృహ జ్యోతి పథకం వర్తింపజేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఎస్ఈ ట్రాన్స్ కో అధికారికి రాస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలి...

### ఎస్ ఆర్ ఎస్ పి ఎస్ ఈ ని కోరిన మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు



ముత్తారం మండల ప్రతినిధి(నేటి శుభోదయ): ముత్తారం మండలం ఖమ్మం పెల్లి రామయ్య పల్లె జిల్లెల్లపల్లె గ్రామాల రైతుల పొలాలకు నీరు అందించాలని ఐటీ, పరిశ్రమలు,శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును కోరగా తక్షణమే ఇరిగేషన్ ఎస్ ఈ ని ఫోన్లో సంప్రదించి ఆర్ ఈ డి కెనాల్ కు నీటిని విడుదల చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎస్ ఆర్ ఎస్ పి ఎస్ ఈ నీటి విడుదలను వెంటనే చేస్తామని అన్నారు. కోరిన వెంటనే నీటి విడుదలకు స్పందించిన మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చొప్పరి సదానందం,ముత్తారం మండల అధ్యక్షులు దొడ్డ బాలాజీ మరియు ముత్తారం మండల రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కు సన్మానం



ముత్తారం మండల ప్రతినిది(నేటి శుభోదయ): ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామాన్ని టీ ఫైబర్ ఇంటింటికి ఇంటర్నెట్ పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినందుకు హైదరాబాద్ లో తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖామంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేసిన ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీ అడవి శ్రీరాంపూర్ తాజా మాజీ ఎంపిటిసి గీతా రాణి

# మంచి ప్రభుత్వ కార్యక్రమం ఇలా



### కూటమి ప్రభుత్వం!మంచి ప్రభుత్వం...

### రాష్ట్రనాయకులు బొర్ర నరేష్ కుమార్



వి.ఆర్.పురం(నేటి శుభోదయ): మంచి ప్రభుత్వం కార్యక్రమానికి రంపచోడవరం,నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, విలీన మండలాల్లో పర్యటన,ఇలా! వి.ఆర్.పురం, మండలం,ఎటపాక మండలం,చింతూరు మండలం, కూనవరం మండలాల్లో ది : 24:09:2024, 25:09:2024 తేదీల్లో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమంలో పాల్గొంటారు.(1) ది : 24-09-24 ఉదయం 10 గంటల నుండి 12:30 గంటల వరకు వి.ఆర్.పురం మండలంలో రామవరం,వడ్డీగూడెం గ్రామాల్లో పాల్గొంటారు. (2) మధ్యాహ్నం 02:30 గంటల నుండి 04:30 గంటల వరకు. ఎటపాక మండలంనెల్లిపాక గ్రామం,పురుషోత్తపట్నం గ్రామాల్లో పాల్గొంటారు.పురుషోత్తపట్నం గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి వర్యులు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ చేస్తారు. (1) ది: 25:09:2024 ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటలవరకు,కూనవరం మండలం,అభిచర్ల గ్రామం పెద్దర్కూరు గ్రామాల్లో పాల్గొంటారు. (2) మధ్యాహ్నం 02:00 గంటల నుండి 04:30 గంటల వరకు చింతూరు మండలం చట్టి గ్రామం ఏ.జీ కోడేరు గ్రామాల్లో పాల్గొంటారు.భద్రతా కారణాలవల్ల ఏదైనా గ్రామాల్లో ప్రోగ్రాం మరొక గ్రామానికి మారవచ్చును కానీ ఎమ్మెల్యే శిరీషాదేవి,పర్యటన ఉంటుందని కార్యాలయ సిబ్బంది తెలియజేశారు.ప్రెస్ నోట్ రాష్ట్ర నాయకులు,బొర్ర నరేష్ కుమార్,మీడియాకు విడుదల చేశారు.




# బాబుల్ రెడ్డి నగర్ లో ప్రజాసమస్యలు పరిష్కరించాలని

### డిసి రవికుమార్ కు వినతి పత్రం అందజేసిన కాంగ్రెస్ పార్టీ నేతలు




రాజేంద్రనగర్ ప్రతినిది(నేటి శుభోదయ): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోన మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్ బస్తీలో తీష్ఠ వేసిన సమస్యలను పరిష్కరించాలని డివిజన్ అధ్యక్షుడు ఎన్, ధనుంజయ్ ఆధ్వర్యంలో సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ కు వినతి పత్రం అందజేశారు.బాబుల్ రెడ్డి నగర్ సిసి రోడ్లు, వీధిదీపాలు, దోమల నివారణ నివారణ కోసం ప్యాకింగ్, నరస బాయ్ కుంట చెరువు సుందరీకరణ, పలు సమస్యల పట్ల డిప్యూటీ కమిషనర్ రాజేంద్రనగర్ సర్కిల్ దృష్టికి కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎన్ ధనుంజయ వివరించారు. ఈ యొక్క కార్యక్రమంలో డివిజన్ సెక్రెటరీ ఓం ప్రకాష్ బస్తీ పెద్దలు సహదేవ్ చేయవలసి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు లో అంగరంగ వైభవంగా గణనాథుని నిమజ్జనం



రాజేంద్రనగర్ ప్రతినిధి(నేటి శుభోదయ): రంగారెడ్డి జిల్లా కొత్తూరు గూడూరు గ్రామంలో గానంగా గణనాదుని నిమర్జనం చేసారు .గూడూరు గ్రామములో ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని గుండు ఆంజనేయులు ముదిరాజ్ తెలియజేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతున్నారు మా గ్రామంలో 16 నవరాత్రుల ప్రత్యేకంగా పూజలు చేస్తామని అన్నారు, చిన్ననాటి నుంచి వినాయకుని నిలబెట్టడం నాకు ఇష్టమని, 20 సంవత్సరాల క్రితం మట్టి వినాయకుడికి కుసుమలు పెట్టి అంగరంగ వైభవంగా పూజలు చేసి గ్రామస్తులు కూడా అన్ని విధాలుగా ప్రోత్సహించేవారని పేర్కొన్నారు. అంగరంగ వైభవంగా నిమజ్జనం ఏర్పాటు చేశామని, దేవుళ్ళ పాటలు వేసి నృత్యాలతో గణనాధుని నిమర్జనానికి తీసుకెళ్తాం కెళ్లారు, గణనాథుని నిమజ్జనం సమయంలో ప్రతి సంవత్సరం వర్షం పడుతోంది ఈ సంవత్సరం కూడా మా గ్రామంలో వర్షం నమోదు అయ్యిందని అన్నారు. గ్రామస్తులు ఎంతో ఇష్టపూర్వకంగా ఈ గణపతి నిమార్జనంలో పాల్గొంటారని, తీర్థప్రసాదాలు తీసుకుంటారని, గణపతికి ప్రత్యేక పూజలు చేసి గ్రామంలో ఉన్న రైతులు చిన్నల్లు పెద్దలు ప్రతి ఒక్కరిని భగవంతుడు చల్లగా చూడాలని గుండు ఆంజనేయులు అన్నారు.

# ఇది మంచి ప్రభుత్వం





వి.ఆర్.పురం ప్రతినిధి (నేటి శుభోదయ): సెప్టెంబర్ 23 వర రామచంద్రాపురం,మండలంలోని రాజుపేట గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో "ఇది మంచి ప్రభుత్వం" అనే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో జడ్పీ.టీ.సీ,వాళ్ళ రంగారెడ్డి,జనసేన పార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ,ఎం.పీ.టీ.సీ, వడ్డానపు భాగ్యలక్ష్మి,మాజీ జడ్పీ.టీ.సీ, ముత్యాల రామారావు,జనసేన మండల నాయకులు ములకాల కిషోర్ కుమార్,తెలుగుదేశం పార్టీ నాయకులు పెట్ట ముత్యాలరావు, భాను తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద యువకునికి ఆసుపత్రి వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం



పెద్దపల్లి జిల్లా ప్రతినిది(నేటి శుభోదయ): ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మన్నెగూడ మహోనియా ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్న పులిజాల శంకర్ కు వైద్య ఖర్చుల కొరకు నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 10,000/- రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. దేవరకొండ నియోజకవర్గానికి చెందిన నిరుపేద పులిజాల శంకర్ వినాయక నిమజ్జనం సందర్భంగా ప్రమాదానికి గురై తీవ్ర అనారోగ్యం చెందగా, మెరుగైన వైద్య చికిత్స కోసం రంగారెడ్డి జిల్లా, మన్నెగూడలోని మహోనియా ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు, ఆసుపత్రి ఖర్చులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడని నల్గొండ జిల్లా ఎన్సీపీ నాయకులు ఇడెం అరుణ్ కుమార్ తెలుసుకొని ఎన్సీపీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శ్రీధర్ యాదవ్ చేతుల మీదుగా 10,000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మేకల శ్రీధర్ యాదవ్ మాట్లాడుతూ " పులిజాల శంకర్ ప్రమాదం జరిగి అనారోగ్యం పాలయ్యాడని, వైద్య చికిత్సకు డబ్బులకు ఇబ్బందులు పడుతున్నాడని తెలుసుకొని వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం చేయడం జరిగిందని" అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్సీపీ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గోలివాడ ప్రసన్న కుమార్ గంగపుత్ర, ఎన్సీపీ నాయకులు ఇడెం అరుణ్ కుమార్, చెన్నూరి నాగరాజు, ప్రవీణ్ కుమార్, రవితేజ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో స్వచ్ఛతా హి సేవ 2024




గండిపేట (నేటి శుభోదయ): బండ్లగూడ మున్సిపల్ జాకీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సోమవారం కమిషనర్ బి శరత్చంద్ర ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ 2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్వభావ్ స్వచ్ఛతా, సంస్కార్ స్వచ్ఛతా అనే తీమ్ తో ఈరోజు డంపింగ్ యార్డ్ కోత్వలగూడ నందు వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కమీషనర్ బి.శరత్ చంద్ర మరియు గణపతి నిమజ్జనం జరిగిన పీరంచెరువు, కిస్మత్ పూర్,బ్రిడ్జి దగ్గర క్లీనింగ్ పనులను పర్యవేక్షించారు. ఇట్టి కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ నరేష్,పర్యావరణ ఇంజనీర్ శ్రవణ్, శానిటరీ జవాన్లు సురేష్,జగన్, యాదగిరి,రాము, సిబ్బంది పాల్గొన్నారు.




# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### ఆర్.జి -3 ఏరియా జి.ఎం



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి(నేటి శుభోదయ): ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షిస్తూ, పర్యావరణాన్ని కాపాడుకోవాలని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు అన్నారు.రామగుండం-3 - అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలోని సెంటినరీ కాలనీలో గల సింగరేణి పార్క్ లో సోమవారం నిర్వహించిన స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమంలో భాగంగా రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ వారి ఆదేశాల మేరకు ప్రభుత్వ రంగ సంస్థలలో ఈ నెల 16వ తేదీ నుండి అక్టోబర్ 31 వ తేదీ వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా ఈ పార్కులో వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు కలిసి సుమారుగా 75 వివిధ రకాల పండ్ల మొక్కలను నాటారన్నారు. ఈ క్యాంపెయిన్ లో భాగంగా వివిధ గనులు, విభాగాలలోని కార్యాలయాలు, నివాస ప్రదేశాలతో పాటు పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉండే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్రరెడ్డి, కోట రవీందర్ రెడ్డి, ఎస్వోటుజిఎం జి.రఘుపతి, ఫైనాన్స్ విభాగం ఎజిఎం పి.శ్రీనివాసులు, పర్యావరణ అధికారి పి.రాజారెడ్డి, అధికారులు జె.రాజశేఖర్, బి.వి.సత్యనారాయణ, ఐలయ్య, రాజేంద్రప్రసాద్, కళ్యాణ్, ఆర్.రాజేశ్వరి, గుర్రం శ్రీహరి, పి.రాజేశం, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



శుభోదయ
మంగళవారం - 24 - సెప్టెంబర్ - 2024

## కిస్మాత్ పూర్ ఎర్ర కుంట వద్ద జిల్లా గోర్ మలావ్ యజ్ఞం పూజ సేవాలాల్ మహారాజ్ పూజ



గండిపేట(నేటి శుభోదయ): బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్ పూర్ లోని ఎర్రకుంట



తండా దగ్గర లంబాడ జాతికి చెందిన సుమారుగా 1500 మంది లంబాడ నాయకులతో కలిసి మహబోగ్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా గోర్ మలావ్ యజ్ఞం పూజ సేవాలాల్ మహారాజ్ పూజ నిర్వహించడం జరిగింది. తరువాత జాతిని ఉద్దేశించి వక్తలు మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గోకరి శ్రీలత సురేష్ గౌడ్, గోర్ సేవా కమిటీ కి చెందిన నాయకులు హీరాలాల్ నాయక్, గోపాల్ స్వామి, గోవింద్ నాయక్, బాలాజీ నాయక్,రాములు నాయక్, గోపాల్ నాయక్, శివ నాయక్, ప్రశాంత్ నాయక్, రాజు నాయక్, లక్ష్మణ్ నాయక్, చందర్ నాయక్, సంజు నాయక్,,రాందాస్ నాయక్, జయరాం నాయక్, రవి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## బ్లాక్ "డే" సందర్భంగా నిరసన కార్యక్రమం



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి(నేటి శుభోదయ): దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 23న బ్లాక్ డే పాటించాలని కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాలు గెలుపులో భాగంగా గోదావరిఖని 2. ఇంక్లైన్ వద్ద బ్లాక్డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, ఐ ఎఫ్ టు యు రాష్ట్ర నాయకులు ఈ నరేష్, సిఐటియు రాష్ట్ర నాయకులు ఎం శ్రీనివాస్ లు మాట్లాడుతూ 2019 లో వేతనాల కోడ్ ను, 2020 లో ఐ అర్ కోడ్,ఓ ఎస్ హెచ్ కోడ్, సామాజిక భద్రత కోడ్.సామాజిక భద్రత కోడ్ మొత్తం నాలుగు లేబర్ కోడు లను కేంద్ర బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో ఆమోదించిందని ఇంతకుముందున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడులను తెచ్చి కార్మిక హక్కులను విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులకు కట్టబెట్టింది అన్నారు. కార్మిక వర్గానికి తీవ్రమైన నష్టం చేసిందన్నారు. పార్లమెంటులో ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చలు జరపకుండా యాజమాన్యాలకు కొమ్ము కాసిందన్నారు.గత నాలుగు సంవత్సరాలుగా ఈ లేబర్ కోడులు రద్దు చేయాలని అనేక సార్లు దేశవ్యాప్త సమ్మెలు సమర శీల ఉద్యమాలు జరిగినప్పటికీ బిజెపి ప్రభుత్వం లెక్క చేయడం లేదన్నారు. నాలుగు లేబర్ కోడుల బిల్లు తీసుకొచ్చి 4.సంవత్సరాలు అవుతుందని కేంద్ర కార్మిక సంఘాల ఈ రోజును బ్లాక్ డే గా ప్రకటించి నిరసన తెలిపాలనే పిలుపులో భాగంగా ఈరోజు గోదావరిఖని 2.ఇంక్లైన్ వద్ద కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బిల్లు పత్రాలను తగలబెట్టి నిరసన తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు జక్కుల నారాయణ, ఈదునూరి రామకృష్ణ,శేఖర్, రామ్ చందర్, ప్రసాద్, రాయపోషం, కుమార్, రాములు. తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర ప్రదేశ్ శ్రీకారం

### సబ్ కలెక్టర్-ఐ.టి.డి.ఏ,ప్రాజెక్టు,అధికారి అపూర్వ భరత్...



వి.ఆర్.పురం ప్రతినిధి చింతూరు డివిజన్(నేటి శుభోదయ)స్వర్ణాద్ర ప్రదేశ్ కి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ది23.09.2024. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా వికసిత్ భారత్ ఏ 2047 లో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వర్ణాంధ్ర ఏ 2047 విజన్ కు శ్రీకారం చుట్టిందని సబ్ కలెక్టర్-ప్రాజెక్ట్ ఆఫీసర్ ఐ.టి.డి.ఏ,అపూర్వ భరత్, పేర్కొన్నారు.సోమవారం ఈనేపథ్యంలో ఐ.టి.డి.ఏ, చింతూరు పరిధిలోని విద్య మరియు నైపుణ్యం,ఆరోగ్యం మరియు సామాజిక సంక్షేమం, మౌలిక సదుపాయాలు,మరియు కనెక్టివిటీ,వ్యవసాయం,మరియు పకృతి వ్యవసాయం,పర్యాటకం అభివృద్ధి,పర్యావరణ సుస్థిరాలపై దృష్టిసారిస్తున్నామని స్పష్టంచేశారు. 2047నాటికి భారతదేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రధానవృద్ధి కేంద్రంగా! మార్చుడానికి కావలసిన కార్యాచరణ ప్రణాళిక నిర్దేశించిందన్నారు.ఇందులో భాగంగా!రాష్ట్రప్రభుత్వం,స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్ రూపకల్పనలో భాగ్యస్వామ్యం కావాలని,నాలుగు మండలాల ప్రజలు, ప్రజాప్రతినిధులు,ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు,స్వర్ణాంధ్ర ఏ 2047 విజన్ సభల్లో పాల్గొని క్యూఆర్ కోడ్ ని స్కాన్ చేసి,తమ సూచనలను,అభిప్రాయాలను నమోదుచేయాలని అపూర్వ భరత్ ఐ.ఏ.ఎస్,- ప్రాజెక్ట్ ఆఫీసర్- ఐ.టి.డి.ఏ,చింతూరు వారు కోరారు.

## ఆర్.జి -3 ఏరియా లో పర్యటించిన జీ.ఎం.(సి.హెచ్.పి)



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి(నేటి శుభోదయ): సింగరేణి సంస్థ కార్పొరేట్ సి.హెచ్.పి.ల విభాగం జనరల్ మేనేజర్ తిరుమలరావు సోమవారం రామగుండం-3 ఏరియాలో పర్యటించారు. సి.హెచ్.పి.ల విభాగం జనరల్ మేనేజర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిసారిగా రామగుండం-3 ఏరియాలో పర్యటించిన సందర్భంగా జి.ఎం. కార్యాలయంనందు రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు వారిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రామగుండం-3 ఏరియాలోని సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఏరియాలోని సి.హెచ్.పి ద్వారా జరుగుతున్న బొగ్గు రవాణా వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన బొగ్గు రవాణా లక్ష్యాన్ని భద్రతతో సాధించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్వోటుజిఎం జి.రఘుపతి, ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర బాబు, ఎస్టేట్స్ అధికారి కె.ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రహరీ గోడ పనులకు శంకుస్థాపన..

### మున్సిపల్ చైర్మన్ పెంద్రు రమ-సురేష్ రెడ్డి.




పెద్దపల్లి ప్రతినిది(నేటి శుభోదయ): పెద్దపల్లి జిల్లా మంథని పట్టణం లోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం ప్రహరీ గోడ పనులను కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించిన మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రు రమ సురేష్ రెడ్డి, రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు సహాయ సహకారాలతో కలెక్టర్ కృషల్ ఫండ్ బ్యాలన్స్ కింద ప్రహరీ గోడ అంచనా విలువ 36 లక్షల తో మాత శిశు ఆరోగ్య కేంద్రం చుట్టూ 300 మీటర్ల కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నట్టు మంథని మున్సిపల్ చైర్పర్సన్ పెంద్రు రమా సురేష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సూపరిడెంట్ మనోహర్, మున్సిపల్ ఏ ఈ ఎండి షాహాభాజ్,మంథని సత్యం పాల్గొన్నారు.

## ఈస్ట్ బోడుప్పల్ కురుమ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

### అధ్యక్షులుగా కెమిడీ శ్రీశైలం కురుమ
### ప్రధాన కార్యదర్శి తెలంగాణ సిద్దు కురుమ
### కోశాధికారి సంకిరి విఠల్ కురుమ

బోడుప్పల్ (నేటి శుభోదయ): బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఈస్ట్ బోడుప్పల్ కురుమ సంఘం





కార్యాలయంలో కురుమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక కోసం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కురుమ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అధ్యక్షులు కెమిడీ శ్రీశైలం కురుమ,ప్రధాన కార్యదర్శి తెలంగాణ సిద్దు కురుమ,కోశాధికారి సంకరి విఠల్ కురుమ,గౌరవ అధ్యక్షులు చిన్నం బీరప్ప కురుమ,ఉపాధ్యక్షులు బండ లక్ష్మయ్య కురుమ, మైల శ్రీనివాస్ కురుమ, కార్యదర్శులు భూమండ్ల నరసింహులు కురుమ, చౌదరి పల్లి పాండారి కురుమ, ముఖ్య సలహాదారులు ఆసర్ల బీరప్ప కురుమ,గౌరిగె నరసింహ కురుమ, మజ్జిగ బలరాం కురుమ, గవ్వల రవి ప్రసాద్ కురుమ, కెమిడి రమేష్ కురుమ, బంద్రు ఆంజనేయులు కురుమ కార్యవర్గ సభ్యులు నంద చంద్రశేఖర్ కురుమ, మోటే పాండు కురుమ, ఏనుగు మహేందర్ కురుమ, గుంటి సునీల్ కురుమ, భక్కన నాగభూషణం కురుమ, కౌడే మల్లేష్ కురుమ, అల్లి కుమారస్వామి కురుమ, ఎన్నికైనట్లు పేర్కొన్నారు. సంఘం అభ్యున్నతికి పాటుపడతామని ఈసందర్భంగా నూతన కార్యవర్గం ప్రతినిధులు తెలిపారు. కురుమల కోసం ప్రభుత్వం ద్వారా పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం పెద్దలు,సభ్యులు పాల్గొన్నారు.

## జగన్ ఆంధ్రప్రదేశ్లో ఉండే అర్హత లేదు,,,

### జగన్ నీచ రాజకీయాలకు దిగజారాడు,?
### జగన్ తల్లకిందులు తప్పక చేసిన మళ్లీ అధికారంలో రాలేడు ?
### హిందువుల దేవాలయాలను కూల్చివేసిన జగన్కు ప్రజలు బుద్ధి చెప్పారు,,,
### టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్..



విజయవాడ (నేటి శుభోదయ): హిందువుల మనోభావాలను కించపరిచే విధంగా జగన్ అండ్ కో బ్యాచ్ వ్యవహరించారని, ఆంధ్రప్రదేశ్లో ఉండే అర్హత లేదని జగన్కు లేదని తిరుమల పవిత్రతను జగన్ ప్రభుత్వం దెబ్బతీసిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ తీవ్రంగా మండిపడ్డారు. విజయవాడలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుమల ప్రసాదాన్ని అపవిత్రం చేసి ప్రజల మనోభావాలను దెబ్బతీశారని వెంకటేశ్వర స్వామి లడ్డులో జంతువుల కొవ్వు వినియోగించారని టెస్ట్ నివేదికలో వెల్లడైందని ఆయన తెలిపారు తిరుమల పవిత్రను దెబ్బతీసేలా ఇప్పటివరకు ఏ పాలకులు జగన్నా ప్రవర్తించలేదని ఆయన తెలిపారు జగన్ రెడ్డి తప్పుతో దేశ విదేశాల్లో హిందువులు తీవ్రంగా మనోవేదంతో బాధపడుతున్నారని ఆయన తెలిపారు కల్తీ నెయ్యి సరఫరా చేసిన ఏ ఆర్ కంపెనీకి వైసీపీ గతంలోనే టెండర్ ఖరారు చేశారని కల్తీ నెయ్యి కొనుగోలుకు జగన్ ప్రభుత్వం హయాంలోనే ఆర్డర్ ఇచ్చారని ఆయన విమర్శించారు జగన్ తిరుమల ప్రతిష్ట అనుకుంటూ ఈ పాపానికి ఒడికట్టాడని ఆయన ఆరోపించారు లడ్లు వివాదంపై తమ వైఫల్యం కప్పిపుచ్చుకునేందుకే జగన్ అంబటి డైవర్షన్ రాజకీయాలకు తెరతీసారని ఆయన నిమర్శించారు చంద్రబాబును జగన్, అంబటి విజయసాయిరెడ్డి విమర్శించడం దుర్మార్గమన్నారు వైసీపీ పిచ్చి కలలు కంటున్నారని జగన్ తల్లకిందులు తప్పక చేసిన మళ్లీ అధికారం రావటం కళ అని ఆయన జోష్యం చెప్పారు రాష్ట్రంలో ప్రజలు చంద్రబాబు ప్రభుత్వం పై మంచి ప్రభుత్వం మనీ చంద్రబాబును ప్రజలు కొనియాడుతున్నారని ఆయన తెలిపారు జగన్ లడ్డు కల్తీ పైన వాస్తవాలు ప్రపంచానికి తెలియ చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరికి ఉందని ఆయన తెలిపారు జగన్ నీచ రాజకీయాలకు తెరతీసాడని ఆయన విమర్శించారు ఎలాంటి ఆధారాలు లేకుండా చంద్రబాబుపై అంబటి జగన్ విష ప్రచారం చేయటం సిగ్గుచేటు అన్నారు ఎలాంటి తప్పు చేయని చంద్రబాబుపై అవినీతి మచ్చ అంటించి 53 రోజులు అన్యాయంగా చంద్రబాబును జైల్లో ఉంచడంతో ప్రజలంతా జగన్ పై రగిలిపోయారని అందుకే జగన్కు 11 సీట్లకు పడేసారని ఆయన తెలిపారు చంద్రబాబును విమర్శించే స్థాయి జగన్కు విజయసాయిరెడ్డి అంబటిలకు లేదని ఆయన అన్నారు తమ ప్రభుత్వం 100 రోజులో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసిన చరిత్ర తెలుగుదేశం కూటమి ప్రభుత్వాని ఉందని ఆయన తెలిపారు స్వామివారి లడ్లు ప్రసాదములు కల్తీ నెయ్యి కలిపిన దుర్మార్గులు తప్పు చేసిన వారు ఎంతటి వారైనా వారికి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు తిరుమలలో నాణ్యమైన నెయ్యిని వాడటంలో లడ్డూలు నాణ్యత పెరిగిందని అన్న ప్రసాదములు లడ్లు తో పాటు కూడా పవిత్ర ల సమర్పణ జరిగిందని ఆయన తెలిపారు జగన్ ఐదేళ్ల భక్తుల సమస్యలు పట్టించుకోలేదని ఆయన విమర్శించారు ప్రపంచవ్యాప్తంగా తిరుమలకు ఎంతో విశిష్టత ఉందని, రాష్ట్రంలో ఐదేళ్లు జగన్ పాలనలో హిందూ దేవాలయాలను కూల్చివేశారని ఆయన విమర్శించారు ఐదేళ్లు జగన్కు అధికారమిస్తే వ్యవస్థలన్నీ సర్వనాశనం చేశాడని తమ ప్రభుత్వం 100 రోజుల్లో 175 అన్నా క్యాంటీన్లను తెరిచి పేదవారికి ఐదు రూపాయలకు భోజనం పెడుతున్న చరిత్ర తెలుగుదేశం కూటమి ప్రభుత్వాన్ని ఆయన కొనియాడారు రాష్ట్రంలో పేదలకు 3 వేల రూపాయలు ఉన్న పెన్షన్ ను తమ ప్రభుత్వం 4, వేల రూపాయలు పెంచి పెన్షన్ను ఒకటవ తేదీనే ఉదయాన్నే ఇస్తున్నామని ఆయన తెలిపారు తమ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నా ప్రభుత్వామన్ని ఆయన తెలిపారు

## బాణసంచా నిల్వలు, తయారీ, విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

### విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి, ఐపిఎస్




విశాఖపట్నం జిల్లా(నేటి శుభోదయ): దీపావళి పండుగ వస్తున్న నేపథ్యంలో బాణసంచా ప్రేలుళ్ళు జరగకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని విశాఖపట్నం రేంజ్ పరిధిలోని అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలను సెప్టెంబరు 23న విశాఖపట్నం రేంజ్ డిఐజి శ్రీ గోపీనాథ్ జట్టీ, ఐపిఎస్ ఆదేశించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం రేంజ్ డిఐజి శ్రీ గోపీనాథ్ జట్టీ మాట్లాడుతూ - గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకొని ఈ సంవత్సరం విశాఖ రేంజ్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. బాణసంచా నిల్వలు, తయారీ, విక్రయాలు జరిపే వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, నిఘా ఏర్పాటు చేయాలన్నారు. బాణసంచా నిల్వలు, విక్రయాలు, తయారీ చేసే అనుమతులు ఉన్న గోడౌన్లు, షాపులు వద్ద భద్రత ప్రమాణాలు, లేనిది రక్షణ చర్యలు చేపడుతున్నది లేనిది పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఇతర శాఖల అధికారులతో జాయింట్ తనిఖీలు నిర్వహించాలని, బాణసంచా విక్రయాలు, నిల్వలు, తయారీకి అనుమతులు ఉన్నది లేనిది పరిశీలించాలని, ఇతర రికార్డులను తనిఖీ చేయాలన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు, నిల్వలు, తయారీ చేపట్టే వారిపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో అనధికారంగా బాణసంచా తయారీ, విక్రయాలు, నిల్వలు చేపట్టే వారిని ముందుగా గుర్తించి, మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేటు వద్ద బైండోవరు చేయాలని అధికారులను విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టీ ఆదేశించారు. బాణసంచా విక్రయాలు, నిల్వలు, తయారీ చేపట్టే వ్యాపారులు పాటించాల్సిన ముఖ్య సూచనలుః బాణసంచా నిల్వలు, తయారీ, విక్రయాలు చేసే వారి వద్ద తప్పనిసరిగా అనుమతులు కలిగి ఉండాలి. బాణసంచా గోడౌన్లు, షాపులు, తయారీ కేంద్రాలు నివాస ప్రాంతాలకు నిర్ధిష్ట దూరంలో ఉండాలి.ఫైర్ సేఫ్టీ ప్రికాషన్స్ అన్నింటిని తప్పనిసరిగా పాటించాలి. దురదృష్టవసాత్తు అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి ప్రతీ దుకాణం వద్ద అగ్ని నిరోధక సిలెండర్లు, తగినంత పొడి ఇసుక, కావాల్సిన నీరు అందుబాటులో ఉండాలి. మైనర్లును బాణసంచా నిల్వ, తయారు, విక్రయాలు చేసే కేంద్రాలు వద్ద పనుల్లో వినియోగించ కూడదు. లైసెన్సు కలిగివ్ను విక్రయదార్లు లైసెన్సు లేని వ్యాపారులకు విక్రయించి, తద్వారా ఏదైనా ప్రమాదం సంభవిస్తే,దానికి లైసెన్సు దారులే బాధ్యత వహించాలన్నారు. అనుమతి పొందిన దుకాణదారులు అధికారులు సూచించిన సమయం వరకు మాత్రమే విక్రయాలు నిర్వహించాలి.

## ఉప్పల చారిటబుల్ ట్రస్టు వైద్య సేవలు

### వర్షకాలం సీజనల్ వ్యాధులు కామినేని హాస్పిటల్,లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ వారి సౌజన్యంతో మాదాయ పల్లి గ్రామంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం



తలకొండపల్లి (నేటి శుభోదయ): రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం మాదాయపల్లి గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత



మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ వర్షకాలం సీజనల్ వ్యాధులు గ్రామాలలో వ్యాపిస్తున్నాయి అని గ్రహించి ప్రజలందరూ బాగుండాలని ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది.డాక్టర్ అఖిల్ డాక్టర్ అనిల్,కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో 225 మందికి డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ బిపి షుగర్ జలుబు దగ్గు వైరల్ ఫీవర్ వంటి వ్యాధుల బారిన వారికి మందులు అందజేసి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ హైమావతి రామస్వామి, ఉప సర్పంచ్ జయమ్మ శ్రీనివాస్, బయ్య గౌరయ్య, బయ్య తిరుపతయ్య, గుళ్ళ శేఖర్, భూషమోని గెలవలయ్య, ముదిగొండ పెంటయ్య, యాదయ్య, కొత్తూరు శేఖర్, శీలం శీను, భూషమోని చంద్రమౌళి, సత్యం గౌడ్, సుల్తాన్ గౌడ్, ముదిగొండ సాయిలు, కద్తాల రామస్వామి, బుచ్చిబాబు, అఖిల్, తుడుం శ్రీశైలం, ముదిగొండ వినోద్ కుమార్, ముదిగొండ సతీష్, ముదిగొండ శ్రీకాంత్, పత్రికా మిత్రులు ఆశా వర్కర్లు గ్రామ పెద్దలు నాయకులు తదితరులు పాల్గొన్నారు...



## స్వచ్ఛత -సేవా కార్యక్రమంలో రామకృష్ణ రెడ్డి



గండిపేట ప్రతినిధి(**నేటి శుభోదయ**): మణికొండ :- మణికొండ మున్సిపాలిటీ 19వ వార్డు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛత- సేవా పచ్చదనం - పరిశుభ్రత పై అవగహన కల్పిస్తూ ప్రధానో ఉపాధ్యాయులు నిరంజన్, ఉపాధ్యాయులు విద్యార్థులచే స్వచ్ఛత -సేవ కార్యక్రమం పై ప్రతిజ్ఞ చేయించారు అనంతరం శ్రీరామ్ నగర్ కాలనీలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 19వ వార్డు కౌన్సిలర్ కె. రామకృష్ణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ.... గృహ నివాసం దారులు తడి పొడి చెత్త వేరు చేసి వాహనంలో వెయ్యాలి, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ వైస్ బుదోళ్ల శ్రీరాములు, నాయకులు బషీర్, ఏర్పుల కుమార్, శ్రవణ్ కుమార్, ఘంఘాదర్, ఆరిఫ్, మున్సిపాలిటీ ఎనివిరోల్మెంటల్ ఇంచార్జ్ సంపత్, సానిటేషన్ ఇన్స్పెకటర్ సాజిత్, సానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



## కేంద్రం కార్మికులకు వ్యతిరేకంగా కొత్త చట్టాలు తీసుకొస్తుందని ఆర్టీసీ కార్మికుల నిరసన



రాజేంద్రనగర్ ప్రతినిధి(**నేటి శుభోదయ**): కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి కొత్తగా నాలుగు లేబర్ కోడ్స్ ను తీసుకువచ్చింది. ఇవి పూర్తిగా యాజమాన్యాలకు అనుకూలమైనవి కార్మిక వర్గానికి వ్యతిరేకమైనవి అందుకు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని నిరసనగా ఎస్ డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం రోజు ఆర్టీసీ రాజేంద్రనగర్ డిపో ముందు ఆర్టీసీ కార్మికులు బ్లాక్ డే ను పాటించారు.ఈ సందర్భంగా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ( సిఐటియు) హైదరాబాద్ రీజియన్ కార్యదర్శి ఎస్ కృష్ణ రాజేంద్రనగర్ డిపో కార్యదర్శి వడ్డే చంద్రయ్యలు మాట్లాడుతూ.... కార్మిక వర్గం అనేక త్యాగాలు పోరాటాలతో కార్మిక చట్టాలు సాధించుకున్నారని కొత్త లేబర్ కోడ్స్ అమలు అయితే కార్మికులు ప్రస్తుతం ఉన్న రక్షణ లన్ని కోల్పోయి పూర్తిగా యాజమాన్యాల దయాదాక్షిన్యాలపై ఆధారపడి పనిచేయాల్సి వస్తుందన్నారు. ఈ చట్టం వల్ల కొత్త పారిశ్రామిక సంబంధాల కోడులోయూనియన్ల పాత్రను పూర్తిగా పరిమితం చేస్తారని అన్నారు. లేబర్ కోడ్స్ రాకముందే ఆర్టీసీ కార్మిక ఉద్యమంపై ఆంక్షలు విధించారని ఆర్టీసీలో కార్మిక సంఘాలకు ఆరు సంవత్సరాలుగా ఎన్నికలే నిర్వహించలేదని అన్నారు. త్వరలో యూనియన్ల పై ఆంక్షలు ఎత్తివేసి ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలకు అనుమతించాలని అన్నారు. 29 కార్మిక చట్టాలు అమలులో ఉండగానే కార్మికులు బానిసత్వం అనుభవిస్తున్నారని ఈ లేబర్ కోడ్స్ అమలు అయితే కార్మికుల పరిస్థితి మరి దుర్భరంగా ఉంటుందని అన్నారు. అందుకని లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు పెద్ద ఎత్తున నల్ల రిబ్బన్ బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైనారు. ఈ కార్యక్రమంలో ఎస్డబ్ల్యుఎఫ్ నాయకులు ఎస్ బి బి చారి జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వెల్జాల్ అంగన్వాడిలో పోషణ మాసం -సిడిపిఓ శాంతి రేఖ



(**నేటి శుభోదయ**): రంగారెడ్డి జిల్లా ఆమనగల్ ప్రాజెక్ట్ తలకొండపల్లి మండలం వెల్జాల్ సెక్టార్ లోని వెల్జాల్ (3) అంగన్వాడి కేంద్రంలో పోషకార వారోత్సవాల్లో సిడిపిఓ శాంతిరేఖ మాట్లాడుతూ పిల్లలకు పోషకాలతో కూడిన ఆహారం అందించడంతో పాటు చదువు చెబుతామని చెప్పారు అంగన్వాడీ కేంద్రాలు 1,2,3,లో సోమవారం పోషణ మాసం నిర్వహించారు ఈ సందర్భంగా పౌష్టికాహారంలో లభించే కూరగాయలు ఆకుకూరలు ప్రదర్శించారు అనంతరం వాటి గురించి వివరించారు పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని చెప్పారు గర్భిణీలు బాలింతలు చిన్న పిల్లలు కిషోర్ బాలికలు సమతుల్య ఆహారం తీసుకోవాలని సిడిపిఓ సూచించారు.కార్యక్రమంలో వెల్జాల్ గ్రామ స్పెషల్ ఆఫీసర్ ఎంపిఓ రఘు సూపర్వైజర్ తిరుమల డాక్టర్ సైదమ్మ హెచ్ ఈ ఓ ఆంజనేయులు సెక్రెటరీ ఎం.శరత్,అంగన్వాడీ టీచర్లు నస్రీన్ బేగం,వసంతలక్ష్మి, భూషణమ్మ,ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తల్లులు,గర్భిణీలు, చిన్ననరులు, తదితరుల పాల్గొన్నారు



## ఏపీలో మహిళలకు త్వరలో ఫ్రీ బస్సు.. మంత్రి కీలక ప్రకటన



విశాఖపట్నం జిల్లా (**నేటి శుభోదయ**): ఏపీలో మహిళలకు త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి విధివిధానాలు రూపొందిస్తున్నామన్నారు. దీపావళి నుంచి అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసేందుకు వారికి రూ.5-10 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. అటు అన్న క్యాంటీన్ల ద్వారా ఆకలి కేకలు లేకుండా పేద ప్రజలకు మూడు పూటలా ఆహారం సమయానికి అందుతుందని మంత్రి అన్నారు.

## టిక్కెట్ లేకుండా రైళ్లలోని జనరల్ కోచ్ లో ప్రయాణిస్తే

### ఎంత జరిమానా విధిస్తారో తెలుసా

### టికెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న వారి మీద ఫోకస్ పెట్టిన రైల్వే శాఖ



విశాఖపట్నం జిల్లా(**నేటి శుభోదయ**): టికెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న వారిలో ఎక్కువ పోలీసులే కావడం గమనార్హం వారిపై ప్రత్యేక దృష్టి, వారికోసం రైల్వే యాక్ట్ 1989 ప్రకారం చర్యలకు ఉపక్రమించిన రైల్వే శాఖ ఇందుకోసం వచ్చేనెల 1నుంచి 15 వరకు, 25 నుంచి నవంబర్ 10వ తేదీ వరకు తనిఖీలు నిర్వహించనున్న రైల్వే శాఖ ఎవరైనా టికెట్ తీసుకోకుండా రైల్ల జనరల్ కోచ్ లలో ప్రయాణిస్తూ పట్టుబడితే భారతీయ రైల్వే నిబంధనల ప్రకారం రూ.250 జరిమానా విధిస్తారు. అంతే కాకుండా, వారు ప్రయాణించిన దూరానికి ఛార్జీ చెల్లించాల్సి ఉంటుంది. డబ్బు కట్టకపోతే రైల్వే చట్టంలోని సెక్షన్ 137 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వారిని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ( ర్ పి ఎఫ్ )కి అప్పగిస్తారు. మళ్లీ మళ్లీ ఇదే తప్పు చేసే వారికి తీవ్రమైన జరిమానాలు ఉంటాయి.

## ఏపీలో భవన నిర్మాణాల అనుమతులకు 'సింగిల్ విండో ' విధానం



విశాఖపట్నం జిల్లా(**నేటి శుభోదయ**): ఏపీలో ఇక భవన నిర్మాణ అనుమతులకు సింగిల్ విండో విధానాన్ని ప్రభుత్వం తీసుకు రానుంది. అన్ని ప్రభుత్వ శాఖల నుంచి ఒకే పోర్టల్ ద్వారా అనుమతులు వచ్చేలా కార్యాచరణను సిద్ధం చేస్తోంది. 2025 జనవరి నుంచి కొత్త విధానం అమలులోకి వచ్చే అవకాశం ఉంది. ఇందుకోసం వివిధ శాఖల మంత్రులు ఇప్పటికే సమావేశం అయ్యారు. ఇందుకోసం నెలాఖరులో మరోసారి సమావేశం కానున్నారు.

## ఏపీకి మరోసారి ప్రపంచబ్యాంకు, ఏడీబీ ప్రతినిధుల పర్యటన



విశాఖపట్నం జిల్లా (**నేటి శుభోదయ**): ప్రపంచబ్యాంకు, ఏ డి బి (ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంకు) ప్రతినిధులు మరోసారి రాష్ట్రానికి రానున్నారు. ఈ నెల 23 నుంచి 27 వరకు పలు అంశాలపై సి ర్ డి ఏ అధికారులతో వీరు భేటీ కానున్నారు. ప్రాజెక్టు స్వరూపం, మౌలిక వసతుల కల్పన, వరద నివారణ, వాతావరణ మార్పులు, భూముల వినియోగం, పేదలకు ఇళ్ల నిర్మాణం,ఉపాధి కల్పన తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిసింది.

## 'మిస్ యూనివర్స్ ఇండియా 2024'గా రియా సింఘా



విశాఖపట్నం జిల్లా(**నేటి శుభోదయ**): జైపుర్లో నిర్వహించిన పోటీల్లో మిస్ యూనివర్స్ ఇండియా -2024గా రియా సింఘా నిలిచింది. మిస్ యూనివర్స్ ఇండియా 2024 గ్రాండ్ ఫినాలే రాజస్థాన్లోని జైపూర్లో జరిగింది. రియా విజేతగా నిలిచి ప్రతిష్టాత్మక టైటిల్ను కైవసం చేసుకోవడంతో ఈవెంట్ ఉత్సాహంగా మారింది. గ్లోబల్ మిస్ యూనివర్స్ 2024లో భారత్ తరుపున ఆమె ప్రాతినిధ్యం వహించనుంది.


## ఆర్ జి -3 జి.యం. కు వినతి పత్రం అందించిన సివిల్ కాంట్రాక్టర్





పెద్దపల్లి జిల్లా ప్రతినిది(**నేటి శుభోదయ**): గత మూడు నెలలుగా యు.ఆర్.ఎస్. టెండర్స్ పెనాల్టీ విషయము ఉన్నందున టెండర్స్ లో కాంట్రాక్టర్స్ పాల్గొనలేదు. పెనాల్టీ విషయంపై జిఎం ఇచ్చిన హామీ మేరకు టెండర్ లో పాల్గొంటామని సోమవారం వేయాల్సిన టెండర్లను వాయిదా వేయాలని జీ.ఎం. నరేంద్ర సుధాకరరావు కు సివిల్ డివైస్.ఎస్. ఈ. రాజేంద్రప్రసాద్ కు ఆర్. జి.3 సివిల్ కాంట్రాక్టర్స్ వినతి పత్రం అందించారు.

## ఈ రోజు పలు కీలక శాఖలపై చంద్రబాబు సమీక్ష



విశాఖపట్నం జిలా(**నేటి శుభోదయ**): ఏపీ సచివాలయంలో నేటి మధ్యాహ్నం పలు కీలక శాఖలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించనున్నారు. శాంతి భద్రతలు, మైనారిటీ శాఖ, యూత్ అండ్ స్పోర్ట్స్ శాఖ, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ శాఖలపై సీఎం చంద్రబాబు వరుస సమీక్షలను జరిపి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశాలలో ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొననున్నారు.

## రాజకీయాల్లో తమ్ముడు.. సినిమాల్లో అన్నయ్య



విశాఖపట్నం జిల్లా (**నేటి శుభోదయ**): మెగా ఫ్యామిలీ అన్నింటా దూసుకుపోతోంది. ఈ ఏడాదిలో మెగా ఫ్యామిలీకి చాలా గుడ్ న్యూస్లు వినిపించాయి. మెగాస్టార్ చిరంజీవికి పద్మ విభూషణ్, అలాగే పవన్ కళ్యాణ్ ఏపీ రాజకీయాల్లో సంచలనం సృష్టించారు. ఇప్పుడు మెగా బ్రదర్స్ చిరంజీవి, పవన్ కళ్యాణ్ వేర్వేరు విభాగాల్లో ప్రపంచ రికార్డులు అందుకున్నారు. ఏపీలో ఒకే రోజు 13,326 గ్రామాల్లో సభలు నిర్వహించి డిప్యూటీ సీఎం పవన్ సర్టిఫికెట్ అందుకున్నారు. మరోవైపు మెగాస్టార్ చిరంజీవి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్లో చోటు దక్కించుకున్నారు

## జలతరంగిణి జలపాతం విహారయాత్రలో విషాదం



విశాఖపట్నం జిల్లా (**నేటి శుభోదయ**): అల్లూరి జిల్లా మారేడు మిల్లిలో జలతరంగిని జలపాతం వద్ద సోమవారం సాయంత్రం విషాదం చోటుచేసుకుంది, ఏలూరు మెడికల్ కళాశాలకు చెందిన వైద్య విద్యార్థులు విహారయాత్ర కోసం వచ్చి జలతరంగిణి జలపాతం వద్ద ఐదుగురు వైద్య విద్యార్థులు గల్లంతు అయ్యారు. సోమవారం సాయంత్రం ఒక్కసారిగా వాగు ఉధృతంగా రావడంతో విద్యార్థుల గల్లంతు అయ్యారు. గల్లంతైన వారిలో నలుగురు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. ఒక అమ్మాయిని స్థానికులు రక్షించారు. ఆమెను ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు.మిగతా ముగ్గురు అమ్మాయిలు, ఓ అబ్బాయి కోసం గాలింపు కొనసాగుతోంది. పోలీసులు స్థానికుల సహాయంతో వైద్య విద్యార్థుల కోసం సహాయక చర్యలు చేపట్టారు. కాగా సంఘటన స్థలంలో వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తుండడంతో గాలింపు చర్యలకు ఆటంకం ఏర్పడింది.

## పోస్టాఫీస్ టైమ్ డిపాజిట్ పథకంలో

### రూ.5 లక్షలు పెట్టుబడితో రూ.15 లక్షలు



విశాఖపట్నం జిల్లా (**నేటి శుభోదయ**): పోస్టాఫీస్ టైమ్ డిపాజిట్ ( ఎఫ్ డి ) పథకంలో పెట్టుబడితో ఎన్నో లాభాలు ఉన్నాయి. తొలుత ఐదేళ్ల వ్యవధితో ఈ పథకంలో రూ.5 లక్షలు పెట్టుబడి పెట్టాలి. దీనిపై 7.5 శాతం వడ్డీ వస్తుంది. ఐదేళ్లలో వడ్డీతో కలిపి మొత్తం రూ.7,24,974 అవుతుంది. దీనిని మరో ఐదేళ్లు కొనసాగించాలి. మెచ్యూరిటీ తర్వాత రూ.10,51,175 వస్తుంది. దీనిని రెండు భాగాలు చేసి మరోసారి డిపాజిట్ చేయాలి. ఇలా చివరికి వడ్డీతో కలిపి మొత్తం రూ.15,24,149 పొందొచ్చు.

## జగన్ మెడకు లడ్డూ కల్తీ వ్యవహారం..

### హైదరాబాద్ లో వైసీపీ అధినేతపై కేసు



విశాఖపట్నం జిల్లా (**నేటి శుభోదయ**): లడ్డూ తయారీలో జరిగిన అవకతవకలపై ఏపీ మాజీ సీఎం, వైసీపీ నేత జగన్ పై హైదరాబాద్ లో కేసు నమోదు అయ్యింది. హైకోర్టు న్యాయవాది కే. కరుణ్ సాగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో ఉపయోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు వినియోగించినట్లు ల్యాబ్ టెస్ట్ రిపోర్టులలో నిర్ధారణ అయిన విషయం తెలిసిందే. దీనిపై కలత చెందిన కరుణ్ సాగర్ మాజీ సీఎం జగన్ పై సైదాబాద్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అలాగే గత ప్రభుత్వ హయాంలోని టీటీడీ చైర్మన్ సహా పాలక మండలి సభ్యుల పేర్లను కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఆయన మాట్లాడుతూ.. తిరుమలలో శ్రీవారి ప్రసాదంగా అందించే లడ్డూ దైవత్వానికి ప్రతీక అని, ఇది ఒక విధంగా హిందువుల మనోభావాలు దెబ్బతీసినట్టేనని తెలిపారు. అలాగే పవిత్రతో పాటు నాణ్యతలో శ్రీవారి లడ్డూ ప్రసిద్ధి పొందిందని, లడ్డూను తాను అత్యంత గౌరవిస్తానని, ఈ చర్య గత ప్రభుత్వ కుట్రలో భాగమేనని కరుణ్ సాగర్ ఆరోపించారు. ఇక తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం వైసీపీ అధినేత జగన్ మెడకు చుట్టుకుంటుంది. గత ప్రభుత్వ హాయాంలోనే తిరుమల ప్రసాదం లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యి సరఫరా చేసేందుకు టెండర్లు పిలిచి కాంట్రాక్టు ఇచ్చారు. దీంతో ఈ అంశంలో జగన్ పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రసాదం తయారీలో కూడా అవినీతికి పాల్పడటమేంటని అధికార పక్ష నేతలు మండిపడుతుండగా.. మరోవైపు కలియుగ దైవంగా కొలిచే శ్రీవారిని అప్రతిష్టపాలు చేశారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ అంశంపై ఇప్పటికే సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు కాగా.. ఇప్పుడు ఏకంగా జగన్ పైనే కేసు నమోదు కావడం ఆయన్ను చిక్కుల్లో పడేసినట్టు అయ్యింది. ఈ వ్యవహారంలో ఎవరెవరి ప్రమేయం ఉందో వారిని అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీలోని కూటమి ప్రభుత్వం ప్రకటించింది.

## సుప్రీంకోర్టుకు చేరిన తిరుమల లడ్డు వివాదం



విశాఖపట్నం జిల్లా (**నేటి శుభోదయ**): తిరుమల లడ్డూ వివాదం రోజు రోజుకు ముదురు తుంది, నెయ్యి కల్తీ, విశ్వాసానికి ప్రతీక అయిన తిరుమల ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపారన్న అభియోగాలు ఇటు ఆంధ్రప్రదేశ్ తోపాటు అటు దేశవ్యా ప్తంగా దుమారం రేపుతు న్నాయి. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలంటూ రాజకీయ నేతలు, ఆధ్యాత్మికవేత్తలు, పలువురు ప్రముఖులు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే తిరుమల లడ్డూ వ్యవహారంలో నిజాలను నిగ్గు తేల్చేందుకు, సమగ్ర విచారణకు సిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ ప్రభుత్వం కూడా ప్రకటించింది.. ఈ క్రమంలోనే తిరుమల లడ్డూ వివాదం సర్వోన్నత న్యాయస్థానానికి చేరింది.. తిరుమల లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టుకు రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలయ్యాయి. బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి, వైసీపీ నేత వైవీ సబ్బారెడ్డి సుప్రీం కోర్టును ఆశ్రయించారు.తిరుమల లడ్డూ వ్యవహారంలో సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్య లపై విచారణ చేయాలని బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి విజ్ఞప్తి చేశారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేశారని.. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దీనిపై విచారణ జరగాలని కోరారు. విచారణ కోసం ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టులో సుబ్రహ్మణ్యస్వామి పిల్ దాఖలు చేశారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో విచారణ కోరుతూ వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి సైతం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి లేదా నిపుణులతో విచారణ చేయించాలని వైవీ సుబ్బారెడ్డి కోరారు. ఈ పిటీషన్ ను స్వీకరించిన ఏపీ హైకోర్టు విచారణ చేపట్టనుంది.

## హనుమాన్ రక్ష...



విశాఖపట్నం జిల్లా (**నేటి శుభోదయ**): యూ పి లోని బాపు ఘాట్ లో ఒక కోతుల గుంపు ఒక బాలిక ని అత్యాచారం నుండి కాపాడాయి, ఇంటి ముందు ఆడుకుంటున్న ఒక చిన్నారిని ఒక పాపత్ముడు ఒక పాడు బడ్డ ఇంట్లోకి తీసేకెళ్లి అత్యాచారం చేయబోయాడు, పాప దుస్తులు తొలగిస్తుండగా ఒక కోతుల గుంపు వచ్చి వాడిని తరిమెసింది, కేసు నమోదు చేసిన పోలీస్ లు సీసీ టీవీ ఆధారంగా నిందితుడ్ కోసం గాలిస్తున్నారు.

## విద్యాసాగర్‌ను విజయవాడకు తీసుకొచ్చిన పోలీసులు



**విశాఖపట్నం జిల్లా (నేటి శుభోదయ): విద్యాసాగర్‌ను విజయవాడకు తీసుకొచ్చిన పోలీసులు ముంబై నటి జెత్వానీ కేసులో నిందితుడు కుక్కల విద్యాసాగర్‌ను పోలీసులు విజయవాడకు తీసుకొచ్చారు. డేహ్రాడూన్ నుంచి రైలులో అర్థరాత్రి విజయవాడలోని ఇబ్రహీంపట్నం పీఎస్‌కు చేరుకున్నారు. విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో విద్యాసాగర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు.**

## అనధికార చీటీలు వేసి మోసపోకండి

### పెందుర్తి బాధితుల వినతి



విశాఖపట్నం జిల్లా(**నేటి శుభోదయ**): విశాఖపట్నం జిల్లా టౌన్ పెందుర్తి గాంధీనగర్ పరిసరప్రాంతాలలో చీటీలు, ఇంకా దసరా, సంక్రాంతి, వరలక్ష్మి వ్రత చీటీ, సాయిరాం గోల్డ్ లక్కీ డ్రా మొదలగు స్కీమ్ లలో అధిక లాభాలు ఆశ చూపి మధ్యతరగతి వాళ్లం అయిన సుమారు 540 మంది వద్ద నుండి డబ్బులు వసూలు చేసి రూ.14 కోట్లు మేర మోసం చేసిన ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి, సివిల్ కాంట్రాక్టర్ సిల్లా ప్రసాదరావు కుమార్తె కంచి మాధవి ఆమె కుటుంబ సభ్యులు నుండి మా బాధితులు అందరికి న్యాయం చేయవలసిందిగా బాధితులు కోరారు ఈమేరకు మీడియా సమక్షంలో సదరు విషయాలను/వివరాలను తెలియ జేయుటకు డాబాగార్డెన్స్ విజేఎఫ్ ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం నిర్వహించారు కొలుపూరి నారాయణమ్మ మాట్లాడుతూ, పిల్లా ప్రసర్దారావు,విజయలక్ష్మి, కుమార్తె మాధవి 2018 నుంచి చీటీలు నిర్వహిస్తున్నారు గత ఏడాది డిసెంబర్ నుంచి చెల్లింపులు ఆపేసారు స్థలాలు అమ్మా డబ్బులు ఇస్తానన్నారు. కానీ 19 మందికి ఐపీ నోటీసులు ఇచ్చారు ఆగస్టు 5 న ఫిర్యాదు రిమాండ్ వేశారు 13 న బెయిల్ మీద వచ్చారు. ఎస్సీ,ఎస్టీ లానాను బాధితుల మీద ఉది గోల్పుతున్నారు ముగ్గరు పరారీలో ఉన్నారు అందరూ మద్య తరగతి ప్రజలే చీటీలు వేశారు 2022 నుంచి వరలక్ష్మి వ్రతం చీటీలు, సంక్రాంతి చీటీలు కట్టమని అన్నారు ప్రసాదరావు ఇంటిపై గతంలో వైసిపి ఇప్పుడు జన సేన పార్టీ జెండా ఎగురుతున్నా యన్నారు మూడు నెలలకో కొత్త కారు కొంటారు పీలా జ్యోతి మాట్లాడుతూ తనకు 15 లక్షలు 5 లక్షలు మాత్రమే ఇచ్చారు మరో రెండు నెలలు ఆగితే డబ్బులు ఇస్తాం అని మభ్యబెట్టారు బ్యాంకు రుణం తీదుని చీటీలు కట్టాను అన్నారు బాధితులను బెదిరి స్తున్నారు ప్రజలు అనధికార చీటీలు వేయొద్దని కోరారు.

## లడ్డు ఆరోపణలపై తిరుమలలో భూమన ప్రమాణం..!!



**అమరావతి,:** తిరుమల లడ్డు వివాదంపై మాజీ చైర్మన్ భూమన ప్రమాణానికి సిద్ధమయ్యారు. తమ హయాంలో లడ్డు ప్రసాద విషయంలో అపచారం జరిగిందని ఆరోపణ పైన ఆయన తిరుమలలో స్పందించారు. ఇటువంటి రాజకీయ వ్యాఖ్యలకు అవకాశం లేకుండా వ్యవహరించాలని భూమనకు పోలీసులు ఆదేశించారు. ఆ తర్వాత తిరుమల లో హారతి ఇస్తూ భూమన తాము ఎటువంటి తప్పు చేయలేదంటూ చెప్పుకొచ్చారు. తిరుమల లడ్డు విషయంలో టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తిరుమలకు చేరుకునే ముందు ఆయనతో పాటుగా తిరుపతి ఎంపీ గురుమూర్తి నుంచి ఎటువంటి రాజకీయ వ్యాఖ్యలు చేయవద్దంటూ పోలీసులు నోటీసులు ఇచ్చారు. తిరుమల చేరుకున్న భూమన పుష్కరిణిలో స్నానం చేశారు. అనంతరం అఖిలాండబద్ధ కర్పూర నీరాజనం అందించారు. హారతి వెలిగించి తాను ఎటువంటి తప్పు చేయలేదని.. రాజకీయాల కోసం పవిత్రమైన తిరుమల క్షేత్రాన్ని వాడుకుంటున్నారు అంటూ వ్యాఖ్యానించారు. తాము ఏ పొరపాటు చేసిన తన కుటుంబం మొత్తం సర్వ నాశనం అవుతుందంటూ చెప్పుకొచ్చారు. భూమన వ్యాఖ్యలు చేస్తున్న సమయంలోనే అక్కడ ఉన్న విజిలెన్స్ సిబ్బంది ఆయనను పక్కకు తీసుకువెళ్లారు. పోలీసులు తీసుకువెళ్తున్న సమయంలోనే భూమితో పాటు ఆయన మద్దతుదారులు గోవింద నామం స్మరిస్తూ నిరసన వ్యక్తం చేశారు. టిటిడి మరో మాజీ చైర్మన్ సుబ్బారెడ్డి సైతం తాను దేవదేవుడు ముందు ప్రమాణానికి సిద్ధమని ఇప్పటికే స్పష్టం చేశారు. సుబ్బారెడ్డి ఇప్పటికే హైకోర్టు తో పాటు సుప్రీంకోర్టులో లడ్డు వివాదంపై విచారణ చేపట్టాలని పిటిషన్లు దాఖలు చేశారు. బిజెపి మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి సైతం ఇదే అంశం పైన సుప్రీంకోర్టులో మరో పిటిషన్ దాఖలు చేశారు. లడ్డు వివాదం పైన విచారణ చేయించాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికే ఈ వివాదం పైన సీట్ ఏర్పాటు చేసింది. తిరుమలలో మహాయాగం నిర్వహించారు. ఈ సాయంత్రం భక్తులంతా దీపారాధన సమయంలో క్షమా మంత్రం పఠించాలని ఈవో శ్యామలరావు సూచించారు.

## పవన్ ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా మహాయాగం



**అమరావతి,:** తిరుమల లడ్డు కల్తీ ఘటనను నిరసిస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా తెనాలి వైకుంఠపురం దేవస్థానంలో తలపెట్టిన మహాయాగంలో మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. గత పాలకులకు తిరుపతి దేవస్థానం టికెట్లు అమ్ముకునే శ్రద్ధ, లడ్డు తయారీపై లేదని విమర్శించారు. ప్రధాన దేవాలయాల్లో సంప్రోక్షణ యాగాలు చేయ్యాలని దేవాదాయ శాఖ ఆదేశాలతో తెనాలి వైకుంఠపురంలో మహా యాగం నిర్వహించామన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తలపెట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా మహా యాగం చేపట్టామన్నారు. వందల ఏళ్ళ నుంచి స్వామివారికి లడ్డు రూపంలో అందించే మహా ప్రసాదం కోట్లాది భక్తులు భక్తి భావంతో హృదయానికి అద్దుకొని స్వీకరిస్తారన్నారు. మన పూర్వీకులు లడ్డు ద్వారా మన సంస్కృతి ధర్మంతో అందించటం జరిగిందన్నారు. దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందన్నారు. తిరుమల దేవస్థానం విషయంలో కేవలం అహంకారంతో చేసిన పనులను, పాలకులు స్వార్థాల కోసం ఆలయాలను ఉపయోగించుకుంటున్నారన్నారు.

## ప్రజల దృష్టి మళ్లించేందుకే 'అమృత్'పై కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు

**హైదరాబాద్, :** ప్రజల దృష్టి మళ్లించేందుకే 'అమృత్'పై కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు చేస్తున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. అవినీతి బయటకు రావాలంటే సీవీసీ విచారణ కోరాలని, దేశంలో పట్టణాల్లో మౌలిక వసతులు మెరుగుపర్చే ఒక సదుద్దేశ్యంతో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అమృత్ పథకాన్ని ప్రవేశపెడితే.. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతూ ఈ పథకం ప్రయోజనాలు ప్రజలకు అందకుండా చేస్తున్నాయన్నారు. ఈ పథకంలో అవినీతి జరిగిందని ఈ రెండూ పార్టీలు ఒకదానిపై మరొకటి ఆరోపణలు గుప్పించుకుంటూ డ్రామాలాడుతున్నాయని ఆయన మండిపడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకంలో పెద్దఎత్తున అవినీతికి పాల్పడి తమకు కావాల్సిన వాళ్లకే కాంట్రాక్టులు కట్టబెట్టిందని బీఆర్ఎస్ ఆరోపిస్తుంటే గత బీఆర్ఎస్ ప్రభుత్వమే అవినీతికి పాల్పడిందని కాంగ్రెస్ ప్రత్యారోపణలు చేయడం దొందుదొందే అన్న చందంగా ఉందని ఆయన అన్నారు. అంతేకాకుండా..'కాంగ్రెస్ 6 గ్యారంటీల అమలులో వైఫల్యాలపై ప్రజల దృష్టి మళ్లించేందుకు వీరిరువురూ సవాళ్లు, ప్రతిసవాళ్లు చేసుకుంటూ డ్రామాను రక్తి కట్టించే ప్రయత్నం చేస్తున్నారు. దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్న చందంగా వీరిద్దరూ ఈ పథకంలో పెద్దఎత్తున అవినీతికి పాల్పడి, తమకు కావాల్సిన వాళ్లకు కాంట్రాక్టులు ఇప్పించుకొని, పెద్దఎత్తున కమీషన్లు కొట్టేశారన్నది వాస్తవం. ఈ స్కీంలో చోటుచేసుకున్న అవినీతిని వెలికితీయాలన్నా బీఆర్ఎస్, కాంగ్రెస్ ఆరోపణల్లో నిజానిజాలు బయటకు రావాలన్నా సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఆధ్వర్యంలో తెలంగాణలో ఈ కేంద్ర పథకం అమలుపై విచారణ జరిపించాలి. ఇందుకు అమృత్ పథకంలో జరిగిన అవినీతిపై విచారణ కోరుతూ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సెంట్రల్ విజిలెన్స్ కమీషన్ (సీవీసీ)కు లేఖ రాయాలి. రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాస్తే దీనిపై విచారణ జరిపేందుకు సీవీసీని ఒప్పించేలా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి హోదాలో నేను వ్యక్తిగతంగా చొరవ చూపుతాను. తెలంగాణలో అమృత్ పథకం సక్రమంగా అమలవుతుందని, ఇందులో ఎలాంటి అవినీతి జరగలేదని, కాంట్రాక్టు కట్టబెట్టడంలో పక్షపాతం చూపలేదని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తే తక్షణమే సీవీసీకి లేఖ రాయాలి. లేకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడినట్టు భావించాల్సి వస్తుంది. 6 గ్యారంటీల అమలులో వైఫల్యం, హైడ్రా కూల్చివేతల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే 'అమృత్' విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్డ్రామాలాడుతున్నాయని స్పష్టమవుతోంది.' అని బండి సంజయ్ అన్నారు.

## మోడీ "మన్ కీ బాత్" వినేందుకు ప్రజలు సిద్ధంగా లేరు..

**న్యూఢిల్లీ,:** లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ శ్రీనగర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని మోడీని, బీజేపీని తీవ్రంగా టార్గెట్ చేశారు. జమ్మూకశ్మీర్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చడం ద్వారా ఇక్కడి ప్రజల ప్రజాస్వామ్య హక్కులను బీజేపీ హరించిందని అన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు నరేంద్ర మోడీకి '56 అంగుళాల ఛాతీ' ఉందని చెప్పడాన్ని మీరు తప్పక చూసి ఉంటారని రాహుల్ గాంధీ అన్నారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని.. గత ఎన్నికల ఫలితాల ఆధారంగా ఆయన వ్యాఖ్యానించారు. ఇండియా బ్లాక్, కాంగ్రెస్ పార్టీలు నరేంద్ర మోడీ సైకాలజీని మార్చేశాయన్నారు. ప్రధాని మోడీ సుదీర్ఘ ప్రసంగాలు చేస్తారని, ఆయన తన భావాల గురించి మాట్లాడుతారని, కానీ నిరుద్యోగం గురించి మాట్లాడరని రాహుల్ గాంధీ అన్నారు. ముందు దేశంలో నిరుద్యోగాన్ని తొలగించండి.. ద్రవ్యోల్బణాన్ని తగ్గించండి.. యువతకు దార్శనికత ఇవ్వండి.. జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇవ్వండి.. ఈ విషయాలపై మోడీ స్పందించాలన్నారు. మోడీ 24 గంటలూ తన మనసులోని మాట(మన్ కీ బాత్) ను చెబుతూనే ఉంటారని.. కానీ ప్రస్తుతం ఎవరూ ఆయన మాట వినడానికి ఇష్టపడటం లేదన్నారు. చదువుకున్న వారికి ఉద్యోగాలు రాకపోవడంతో దేశవ్యాప్తంగా నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. ఇది నరేంద్ర మోడీ ఇచ్చిన బహుమతని విమర్శించారు.

## సింహాచలం ప్రసాదానికి విశాఖ డెయిరీ నెయ్యి



విశాఖపట్నం జిల్లా**(నేటి శుభోదయ):** సింహాచలం సింహాద్రి అప్పన్న ఆలయంలో లడ్డూల తయారీ, దీపారాధన, ఇతర అవసరాలకు వినియోగించేందుకు తాత్కాలికంగా విశాఖ డెయిరీ నెయ్యి కొనుగోలు చేయాలని దేవాదాయ అధికారులు నిర్ణయించారు. దేవస్థానం స్టోర్లో ఈనెల 21న ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించి నెయ్యిని సీజ్ చేశారు. ప్రస్తుతం రోజుకు 25 వేల నుంచి 30 వేల లడ్డూలు విక్రయిస్తారు. సోమవారం వంద డబ్బాల విశాఖ డెయిరీ నెయ్యి (1500 కేజీలు) దేవస్థానానికి రానుంది.

# శ్రీవారి లడ్డూ లెక్కలు మారిపోయాయ్!

**నాణ్యత పునరుద్ధరించిన టీటీడీ**

**శ్రీవారి లడ్డూ ప్రసాదాల - పవిత్రత, నాణ్యతను మళ్లీ పునరుద్ధరించినట్లు టీటీడీ ఈవో ఎక్స్? వేదికగా తెలియజేశారు.**

**కూటమి ప్రభుత్వం వచ్చాక నందిని నెయ్యిని కొంటున్నట్లు వెల్లడించారు.**

**నెయ్యి నాణ్యతల ల్యాబ్? రిపోర్ట్?లను ఎక్స్? వేదికగా పోస్ట్? చేశారు.**



విశాఖపట్నం జిల్లా**(నేటి శుభోదయ):** వైఎస్సార్సీపీ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో అపవిత్ర పదార్థాలున్న నెయ్యిని వినియోగించడంపై తీవ్ర దుమారం రేగుతున్న వేళ అపోహలకు తావు లేకుండా తిరుమల తిరుపతి దేవస్థానం ప్రస్తుతం నాణ్యతను పునరుద్ధరించినట్లు ప్రకటించింది. గతంలో వాడిన నెయ్యి, ప్రస్తుతం వినియోగిస్తున్న దానికి సంబంధించి ల్యాబ్ పరీక్షల నివేదికలను సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకుంది. ఎక్స్‌లో పోస్ట్‌చేసిన టీటీడీ : నాణ్యమైన నెయ్యిని కొనుగోలు చేసి, వినియోగించడం ద్వారా లడ్డూ ప్రసాదం ప్రాశస్త్యాన్ని తిరిగి తెచ్చినట్లు ప్రజలకు టీటీడీ తెలిపింది. ఈ మేరకు కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యలను ఎక్స్ వేదికగా వివరించింది. శ్రీవారి లడ్డూ ప్రసాదాల పవిత్రతను తిరిగి పునరుద్ధరించామని పేర్కొంది. నాడు వైఎస్సార్సీపీ హయాంలో గుత్తేదారు సరఫరా చేసిన నెయ్యిలో 'ఎస్' విలువ ఎంత ఉండాలి, ఎంత ఉందనే విషయమై ల్యాబ్ నివేదికను ట్యాగ్ చేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో సేకరిస్తున్న నెయ్యిలో 'ఎస్' విలువ ఏ మేరకు ఉందనే వివరాలనూ జతపరిచింది. ల్యాబ్ రిపోర్ట్‌లను ఎక్స్‌లో పోస్ట్: శ్రీవారి లడ్డూ తయారీకి సరఫరా అవుతున్న నెయ్యిలో కల్తీ ఉందన్న విషయాన్ని గ్రహించిన టీటీడీ ఈవో శ్యామలరావు పరీక్షల నిమిత్తం ఎన్?డీడీబీ ( న్ డి డి బి ) కాఫ్ ల్యాబ్‌కు పంపించారు. నాలుగు ట్యాంకర్ల శాంపిళ్లను రెండు దఫాలుగా పరీక్షలకు ఇచ్చారు. రెండు ట్యాంకర్లకు సంబంధించిన నివేదికను ఇప్పటికే బహిర్గతం చేసిన అధికారులు ఇప్పుడు తాజాగా మరో రెండు ట్యాంకర్ల వివరాలను ఎక్స్‌లో వెల్లడించారు. తద్వారా ఎంత మేరకు కల్తీ జరిగిందనే విషయాన్ని ప్రజలే అర్థం చేసుకుంటారన్న భావన అధికారుల్లో నెలకొంది. ఎన్డీయే అధికారంలోకి వచ్చాక నందిని నుంచి నెయ్యి కొంటున్నారు. ఆ నెయ్యి శాంపిల్‌నూ ల్యాబ్‌కు పంపించి పరీక్షలు నిర్వహించారు. ఆ నివేదికనూ వెల్లడించారు. నాడు సరఫరా చేసిన నెయ్యి ఇప్పుడు కొంటున్నదాని నాణ్యతలో ఎంత తేడా ఉందనే విషయం నివేదికలు చెప్పకనే చెబుతున్నాయి.

# వైయస్ జగన్ హయంలో ఇటువంటి అక్రమాలు ఎన్నో జరిగాయి

- జీవీఎంసీ హార్టికల్చర్ విభాగం పనితీరు పై విచారణ చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంద్ర ప్రసాద్ కు తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ విజ్ఞప్తి
- స్టీల్ ప్లాంట్ పర్మినెంట్ ఉద్యోగులు వారి భార్యల పేరుతో కాంట్రాక్టులు దక్కించుకుంటున్నారని ఆరోపణ
- బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించకుండానే బిల్లులు సొంతం చేసుకుంటున్నారని వ్యాఖ్య
- పూర్తి విచారణ చేసి దోషులు ఎవరో తేలే వరకు టెండర్ ప్రక్రియ నిలిపివేయాలి-
- అక్రమాలు అన్నింటి పై కూటమి ప్రభుత్వం విచారణ జరిపించాలి : బి.వి.రామ్



విశాఖపట్నం జిల్లా**(నేటి శుభోదయ):** ప్రభుత్వ ఉద్యోగులు ఎటువంటి టెండర్ల ప్రక్రియలో పాల్గొనకూడదని, అయినప్పటికీ వాళ్ల భార్యల పేరుతో .. నామమాత్రంగా పనులు చేస్తూ భారీగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఇద్దరు స్టీల్ ప్లాంట్ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులపై తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ఆరోపించారు. మరోవైపు వీరికి జీవీఎంసీ హార్టికల్చర్ విభాగం అధికారుల నుంచి సంపూర్ణ సహకారాలు అందుతున్నాయని.. మొత్తం అక్రమాల పై విచారణ చేపట్టాలని సోమవారం.. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంద్ర ప్రసాద్ కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విశాఖ స్టీల్ ప్లాంట్ లో పర్మనెంట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న వెంకటేశ్వరరావు అనే వ్యక్తి లక్ష్మీ గాయత్రి ఎంటర్ప్రైజెస్ పేరిట ఆయన భార్య ధనలక్ష్మి పేరుతోనూ , నాయుడు అనే వ్యక్తి ఆయన భార్య లీలారాణి పేరుతోనూ విశాఖ నగరంలో పచ్చదనాన్ని పరిరక్షిస్తామనే పేరుతో కోట్లాది రూపాయల మేర జీవీఎంసీ నుంచి పొందుతున్నారని తీవ్ర ఆరోపణ చేశారు. నగర బ్యూటిఫికేషన్ సంబంధించి 60 ప్యాకేజీలకు గాని లక్ష్మీ గాయత్రి ఎంటర్ప్రైజెస్ 19 ప్యాకేజీలు, లీలారాణి పేరిట 21 ప్యాకేజీలను జీవీఎంసీ అధికారులతో కుమ్మక్కై లబ్ది పొందుతున్నారని ఆరోపించారు. మరోవైపు జీవీఎంసీ హార్టికల్చర్ విభాగంలో సాధారణ అధికారిగా చేరిన దామోదర రావు అదే విభాగంలో అసిస్టెంట్ డైరెక్టర్ గాను, డిప్యూటీ డైరెక్టర్ గాను పదోన్నతులు పొంది 30 సంవత్సరాలకు పైగా జీవీఎంసీ లోనే పోతుకుపోయారని ఆరోపించారు. ఒక అధికారి ఒకే చోట ఎక్కువ కాలం పని చేయడం వల్ల సాధారణంగానే కాంట్రాక్టర్లు సంబంధిత అధికారులతో 'సాన్నిహిత్యం' మరింతగా పెంచుకొని తమ పనులను చక్కబెట్టుకునే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇదే తరహాలో అనేకమంది కాంట్రాక్టర్లు ఉన్నప్పటికీ కేవలం స్టీల్ ప్లాంట్ లో శాశ్వత ఉద్యోగులుగా చేస్తున్న ఆ ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన సంస్థలకే కాంట్రాక్టులు దక్కడం.. అది కూడా అత్యధిక ప్యాకేజీలు దక్కడం అనుమానాలకు తావిస్తోందని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ ఉద్యానవన విభాగంలో అక్రమాల ఆరోపణల పై పూర్తి స్థాయిలో విచారణ చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంద్ర ప్రసాద్ కు విజ్ఞప్తి చేశామన్నారు. అప్పటివరకు తాజాగా నిర్వహించాల్సి ఉన్న టెండర్ల ప్రక్రియ నిలిపివేయాలని కోరామన్నారు అంతర్జాతీయ స్థాయిలో ఎదుగుతున్న విశాఖపట్నంలో జాతీయ రహదారి వెంబడి ఉన్న గ్రీన్ బెల్ట్, జాతీయ రహదారి మధ్యలో ఉన్న ప్రదేశాలు ( సెంటర్ మీడియన్లు ), బీచ్ రోడ్, ఇతర జంక్షన్ ల వద్ద గ్రీనరీ ని .. కాంట్రాక్టు విధానం ద్వారా పెంచి పరిరక్షించాల్సిన బాధ్యత జీవీఎంసీ పై ఉందన్నారు. అయితే ఇక్కడే అక్రమాలకు ఆస్కారం ఏర్పడిందని కేవలం ఇద్దరికి మాత్రమే మెజారిటీ శాతం ప్యాకేజీలు సొంతం అవుతున్నాయన్నారు. అయినప్పటికీ కూడా పనులు అంతంత మాత్రమే కొనసాగుతున్నాయని.. బిల్లులు మాత్రం పూర్తిస్థాయిలో మంజూరు చేయించుకుంటున్నారని వ్యాఖ్యానించారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాం నుంచి కొనసాగాయని .. వీటన్నిటి పైన కూటమి ప్రభుత్వం దృష్టి సారించి బాధ్యుల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బి.వి.రామ్ డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ను కలిసిన వారిలో డాక్టర్ పప్పూర్ నికుంజ్, బి.వెంకటేశ్వరరావు, వి.వంశి తదితరులు పాల్గొన్నారు.

## ఆ ర్యాలీలో మా 'కమ్యూనికేషన్' పేలవం యూఎస్ సీక్రెట్ సర్వీస్ అంగీకారం

# ట్రంప్ భద్రతలో వైఫల్యం



వాషింగ్టన్: మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై జూలైలో హత్యాయత్నం జరిగిన ర్యాలీలో భద్రతా వైఫల్యాలను యూఎస్ సీక్రెట్ సర్వీస్ అంగీకరించింది. తమ సమీక్షలో వెల్లడైన వైఫల్యాలను శుక్రవారం వివరించింది. రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి ట్రంప్ నిర్వహించిన ఔట్‌డోర్ కార్యక్రమంలో షూటర్ థామస్ మాథ్యూ క్రూక్స్ కాల్పులు జరపడం, కుడి చెవికి గాయంతో ఆయన త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకోవడం తెలిసిందే. పెన్సిల్వేనియాలోని బట్లర్‌లో జరిగిన ఈ ర్యాలీలో కాల్పుల్లో ఇద్దరు గాయపడగా, అగ్నిమాపక సిబ్బంది మరణించారు. కాల్పులు జరిపిన క్రూక్స్‌ను సీక్రెట్ సర్వీస్ సిబ్బంది కాల్చి చంపారు. ఈ ఘటన తరువాత సీక్రెట్ సర్వీస్ డైరెక్టర్ కింబర్లీ చీట్లే రాజీనామా చేశారు. సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు సెలవులో వెళ్లారు. దీనిపై సమీక్ష నిర్వహించిన సీక్రెట్ సర్వీస్ ప్రణాళిక, దాని అమలులో లోపాలను గుర్తించిందని తాత్కాలిక డైరెక్టర్ రోనాల్డ్ రోవ్ జూనియర్ తెలిపారు. అడ్వాన్స్ టీంలోని కొందరు చాలా శ్రద్ధగా వ్యవహరించగా, మరికొందరి అలసత్వం భద్రతా ప్రోటోకాల్స్ ఉల్లంఘనకు దారితీసిందన్నారు.

**హెచ్చరికలు లేవు..**

స్థానిక యంత్రాంగంతో పేలవమైన కమ్యూనికేషన్, మొబైల్ పరికరాలపై అతిగా ఆధారపడటం, సమాచారం పక్కదారి పట్టడం వంటి సమస్యలను గుర్తించామని రోవ్ తెలిపారు. స్థానిక కాలమానం ప్రకారం సుమారు 18:10 గంటలకు కౌంటర్ స్నైపర్ రెస్పాన్స్ ఏజెంట్‌కు సీక్రెట్ సర్వీస్ సెక్యూరిటీ రూమ్ కాల్ చేసి.. ఏజీఆర్ భవనం పైకప్పుపై ఒక వ్యక్తి ఉన్నట్లు తెలిపింది. అయితే సీక్రెట్ సర్వీస్ రేడియో నెట్‌వర్క్ ద్వారా ఆ కీలక సమాచారం ప్రసారం కాలేదు. ఏదైనా ఘటన జరిగినప్పుడు దానికి ప్రతిస్పందించేందుకు కాక, ఏదీ జరగకుండా నివారించేందుకు సీక్రెట్ సర్వీస్‌కు అదనపు నిధులు, సిబ్బంది, పరికరాలు అవసరం... ట్రంప్‌పై హత్యాయత్నాన్ని దర్యాప్తు చేస్తున్న కాంగ్రెషనల్ టాస్క్‌ఫోర్స్ తెలిపింది. ఉద్యోగులను జవాబుదారీ చేయడం విషయంలో రోవ్‌ను అనుసరించాలని, స్వతంత్ర దర్యాప్తునకు సహకరించాలని, సీక్రెట్ సర్వీస్‌లో అలసత్వానికి స్థానం ఉండకూడదని సూచించింది.

**అధ్యక్షుడితో సమాన భద్రత..**

గత వారాంతంలో ఫ్లోరిడాలోని వెస్ట్‌పామ్ బీచ్‌లోని గోల్ఫ్‌కోర్స్‌లో ట్రంప్‌పై రెండోసారి హత్యాయత్నం జరగడంతో భద్రతకు డిమాండ్ పెరిగింది. అధ్యక్షుడు, ఉపాధ్యక్షులతో సమానంగా అధ్యక్ష అభ్యర్థులకు సీక్రెట్ సర్వీస్ భద్రతను పెంచే బిల్లును అమెరికా ప్రతినిధుల సభ శుక్రవారం ఏకగ్రీవంగా ఆమోదించింది. సెనేట్‌లో ఓటింగ్, అధ్యక్షుడు జో బైడెన్ సంతకం పూర్తయితే ఈ బిల్లు చట్టరూపం దాల్చుతుంది. అయితే ట్రంప్‌కు ఇప్పుడు అధ్యక్షుడితో సమానమైన రక్షణ కల్పిస్తున్నామని రోవ్ చెప్పారు. సీక్రెట్ సర్వీస్ పనిచేసే వాతావరణానికి ముప్పు విపరీతంగా ఉందని ఆదివారం జరిగిన ఘటన రుజువు చేస్తోందని రోవ్ అన్నారు. ఇక ఫ్లోరిడాలో గన్‌మెన్ ట్రంప్‌వైపు చూడను కూడా చూడలేదని, ముందే అతన్ని అరెస్టు చేశామని తెలిపారు.

## భక్తులు సాయంత్రం పూజా సమయంలో క్షమా మంత్రాన్ని పఠించాలి



**అమరావతి,:** శ్రీవారి లడ్డూ ప్రసాదాలు, ఇతర నైవేద్యాల పవిత్రత, దైవత్వాన్ని పునరుద్ధరింపజేసేందుకు సోమవారం తిరుమల శ్రీవారి ఆలయంలోని బంగారు బావి చెంతగల యాగశాలలో వైఖానస ఆగమోక్తంగా శుద్ధి, శాంతి హెూమాలను టీటీడీ నిర్వహించింది. శాంతి హెూమం నిర్వహించిన తరువాత ఆలయం వెలుపల టీటీడీ ఈవో శ్యామలరావు, టీటీడీ, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి మీడియాతో మాట్లాడారు. శ్రీవారి ఆలయంలో ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు రుత్వికులు వాస్తు శుద్ధి, కుంభజాల సంప్రోక్షణ నిర్వహించారని టీటీడీ ఈవో శ్యామలరావు అన్నారు. ఈ శాంతి హెూమం ద్వారా భక్తులు లడ్డూ ప్రసాదం, నైవేద్యం నాణ్యతపై తమకున్న భయాలను, అపోహలను పక్కన పెట్టవచ్చు అని టీటీడీ ఈవో శ్యామలరావు అన్నారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, ఆగమ సలహాదారు శ్రీ మోహనరంగాచార్యులు మీడియాతో మాట్లాడారు. యాగశాలలో సంకల్పం, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, వాస్తు హెూమం, కుంభప్రతిష్ట, పంచగవ్య ఆరాధన తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించినట్లు వారు తెలిపారు. పూర్ణాహుతి అనంతరం కుంభ ప్రోక్షణ నిర్వహించి విశేష నైవేద్యం కూడా సమర్పించినట్లు చెప్పారు. ఇక నుంచి లడ్డూ ప్రసాదాలు, నైవేద్యాలకు ఎలాంటి దోషాలు ఉండవని, శ్రీవారి భక్తులు సంతోషంగా లడ్డూ ప్రసాదాలను స్వీకరించవచ్చని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు శ్రీవారి భక్తులు తమ ఇంటిలో దీపారాధన చేసే సమయంలో, క్షమా మంత్రాలైన ఓం నమో నారాయణాయ, ఓం నమో భగవతే వాసుదేవాయ, ఓం నమో వేంకటేశాయ" లను పఠించి శ్రీవారి అనుగ్రహం పొందగలరని టీటీడీ ఈవో శ్యామలరావు, తిరుమల శ్రీవారి ఆలయం ప్రధాన అర్చకులు శ్రీవారి భక్తులకు మనవి చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీ పెద్ద జీయర్ స్వామి, తిరుమల శ్రీ చిన్న జీయర్ స్వామి తిరుమల శ్రీవారి ఆయం ప్రధానార్చకులు గోవిందరాజ దీక్షితులు, కృష్ణశేషాచల దీక్షితులు, ఆగమ సలహాదారులు రామకృష్ణ దీక్షితులు, సీతారామ దీక్షితులు, వేదపారాయణదారులు, రుత్వికులు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఎమ్మెల్యేలకు షాకిచ్చిన కెఏ.పాల్



హైదరాబాద్: పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ 'ప్రజాశాంతి పార్టీ' అధ్యక్షుడు కెఏ.పాల్ దాఖలు చేసిన పిటిషన్ ను విచారించిన హైకోర్టు, పది మంది పార్టీ మారిన ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసింది. ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలోకి మారడం రాజ్యాంగ విరుద్ధం అని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కెఏ.పాల్ తన పిటిషన్ లో కోరారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బిఆర్ఎస్ టికెట్ పై గెలుపొంది, ఆరునెలలు గడవక ముందే మరో పార్టీలోకి జంప్ చేశారని ఆయన తన పిటిషన్ లో పేర్కొన్నారు. రాజీనామా చేయకుండ వేరే పార్టీలో చేరడం తప్పని, అది చట్టాన్ని, రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే కాగలదని వాదించారు. కెఏ.పాల్ పిటిషన్ పై వాదనలు విన్న హైకోర్టు ధర్మాసనం పార్టీ మారిన10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసింది. స్పీకర్ కి కూడా తాకీదులు జారీ చేసింది. నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోకుంటే సుమోటోగా కేసును విచారిస్తామని అసెంబ్లీ స్పీకర్ కు స్పష్టం చేసింది. ఇప్పుడు కెఏ.పాల్ పిటిషన్ పై స్పందించిన హైకోర్టు ఫిరాయింపు ఎమ్మెల్యేలను మరింత ఇరకాటంలో పడేసింది.

## మణిపూర్లో డెంగ్యూ విజృంభణ..




హైదరాబాద్ : ఈశాన్య రాష్ట్రం మణిపూర్ లో డెంగ్యూ విజృంభిస్తోంది. గత నెల రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా డెంగ్యూ కేసులు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఈ వైరస్ కారణంగా వెస్ట్ ఇంఫాల్ జిల్లాలో ఓ మరణం కూడా సంభవించింది. సెప్టెంబర్ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఏకంగా 448 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. అందులో ఇంఫాల్ వెస్ట్లో అత్యధికంగా 259 కేసులు వెలుగు చూశాయి. ఇక ఇంఫాల్ ఈస్ట్లో 117 కేసులు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సపమ్ రంజన్ సింగ్ కూడా ధ్రువీకరించారు. ఈ మేరకు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆగస్టులో 148 కేసులు నమోదైనట్లు చెప్పారు. సెప్టెంబర్ 13 నాటికి ఆ సంఖ్య 230కి పెరిగిందన్నారు. డెంగ్యూ వ్యాప్తిని అరికట్టేందుకు అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. డెంగ్యూ నివారణకు ఆరోగ్య శాఖ సిద్ధంగా ఉందన్నారు. ఓ వ్యక్తికి డెంగ్యూ పాజిటివ్ తేలితే అతను ఉన్న 100 మీటర్ల పరిధిలో ఫాగింగ్ చేస్తున్నట్లు చెప్పారు. అయితే, సమాజ భాగస్వామ్యం లేకుండా ఇన్ఫెక్షన్ను నియంత్రించడం కష్టమన్నారు. డెంగ్యూ దరిచేరకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పూల కుండీలతోపాటు తమ ఇళ్లలో, చుట్టుపక్కల నీరు నిలవకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. డెంగ్యూపై పోరాటంలో దోమల ఉత్పత్తి కేంద్రాలను నిర్మూలించడమే కీలకమని చెప్పారు.

## కాంగ్రెస్ దళిత వ్యతిరేక పార్టీ.. సెల్జాను అవమానించింది



తోహనా: కాంగ్రెస్ దళిత వ్యతిరేక పార్టీ అని భాజపా అగ్రనేత, కేంద్ర హెూంమంత్రి అమిత్ షావిమర్శించారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తోహనాలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. దళిత నేతలైన కుమారి సెల్జా, అశోక్ తన్వార్ వంటి నేతలతో పాటు ప్రతి ఒక్కరినీ ఆ పార్టీ అవమానించిందని మండిపడ్డారు. రిజర్వేషన్ల అంశంపై రాహుల్ గాంధీ అమెరికాలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించిన అమిత్ షా.. ఈ దేశంలో ఎస్సీలు, ఓబీసీల రిజర్వేషన్లను కాపాడేవారు ఎవరైనా ఉన్నారంటే.. అది ప్రధాని నరేంద్ర మోదీ ఒక్కరేనన్నారు. 'గత పదేళ్లుగా హరియాణాలోని ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేశాం. రాబోయే ఐదేళ్లకు మళ్లీ భాజపాను ఆశీర్వదించండి. కేంద్రంలో మోదీ సర్కార్ ఉంది.. ఇక్కడ భాజపా ప్రభుత్వం ఏర్పాటైతే.. ఈ డబుల్ ఇంజిన్ సర్కార్ హరియాణాను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతుంది. గతంలో కాంగ్రెస్ పాలనలో హరియాణా రైతుల భూముల విషయంలో అవినీతికి పాల్పడ్డారు" అని అమిత్ షా ఆరోపించారు. కుమారి సెల్జా ప్రస్తుతం కాంగ్రెస్ ఎంపీగా, సీడబ్ల్యూసీ సభ్యురాలిగా కొనసాగుతున్నారు. ఆమె అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి ఆసక్తి కనబరచగా.. అందుకు అధిష్ఠానం నిరాకరించింది. అలాగే, కొన్నేళ్ల పాటు కాంగ్రెస్లో కీలక నేతగా ఉన్న అశోక్ తన్వార్ ఈ ఏడాది జనవరిలో భాజపాలో చేరిన విషయం తెలిసిందే.

# గ్లేసియర్ టూరిజం... ప్రాణాంతకం!

విషాదాంతమవుతున్న పర్యటనలు

శరవేగంగా కరిగిపోతున్న గ్లేసియర్స్

మంచులో చిక్కి పర్యాటకుల దుర్మరణం

తెల్లని రంగులో మెరిసిపోతూ చూడగానే మనసుకు హాయిగొలిపే హిమానీ నదాలు (గ్లేసియర్స్) మనసును ఇట్టే ఆకర్షిస్తాయి.



వాటికి సమీపంలోకి వెళ్లాలని, మంచును బంతులుగా చేసి ఆడుకోవాలని, మంచు ముద్దలతో గుహలాగా చేసుకొని అందులో సేదదీరాలని పర్యాటకులు ఆరాటపడుతుంటారు. అందుకే గ్లేసియర్ టూరిజానికి ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన డిమాండ్ ఉంది. గ్లేసియర్స్ ఉన్న దేశాలకు ఈ పర్యాటకంతో భారీ ఆదాయం లభిస్తోంది. హిమానీనదాలను ప్రత్యక్షంగా చూసేందుకు జనం పోటెత్తుతున్నారు. అయితే ఆనందం మాటున విషాదం అన్నట్లుగా గ్లేసియర్ టూరిజం ప్రాణాంతకంగా మారుతోంది. గ్లోబల్ వార్మింగ్ దెబ్బకు కొన్నేళ్లుగా గ్లేసియర్స్ శరవేగంగా కరిగిపోతుండటం పర్యాటకుల పాలిట శాపమవుతోంది. హిమానీ నదాలను సందర్శించే క్రమంలో కొన్నేళ్లలో పదుల సంఖ్యలో మృతి చెందారు. మంచులో చిక్కి విగత జీవులయ్యారు. వాతావరణాన్ని ముందుగానే అంచనా వేయడానికి ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి ఉన్నా గ్లేసియర్లలో పరిస్థితులు అనూహ్యం. అవి ఎప్పుడు ఎలా మారుతాయో చెప్పలేమని గ్లేసియర్ గైడ్లు అంటున్నారు. "అప్పటిదాకా రాయిలా స్థిరంగా కనిపించే మంచు క్షణాల్లో కరిగిపోతుంది. ఆ సమయంలో అక్కడు వాళ్లంతా మంచులో కూరుకుపోయి మరణించాల్సిందే" అని చెబుతున్నారు...! వాతావరణ మార్పులతో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఫలితంగా ధ్రువాల్లో మంచు కరిగిపోతోంది. భూమిపై ఉన్న మొత్తం గ్లేసియర్లలో 2100 నాటికి సగం అంతరించిపోతాయని సైంటిస్టులు చెబుతున్నారు. ఇప్పటికే అవి చాలావరకు కరిగిపోయాయి కూడా. అందుకే సాహసికులు త్వరపడుతున్నారు. గ్లేసియర్లను సందర్శించడం చాలామందికి ఒక కల. దాన్ని నిజం చేసుకోవడానికి ధ్రువపు ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారు. గ్లేసియర్ పర్యాటకాన్ని 'లాస్ట్-చాన్స్ టూరిజం'గా భావిస్తున్నట్టు యూనివర్సిటీ ఆఫ్ ఒట్టావా అసోసియేట్ ప్రొఫెసర్ జాకీ డాసన్ చెప్పారు.

### కరిగే మంచు.. పెను ముప్పు

సాధారణంగా ఎండాకాలంలోనే గ్లేసియర్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్టు నిపుణులు గుర్తించారు. గ్లేసియర్ల ఉపరితలంపై మంచు కరుగుతుండడంతో వాటిపై ఒత్తిడి పెరుగుతోంది. దాంతో ముక్కలుగా విచ్ఛిన్నమవుతున్నాయి. స్థిరంగా ఉన్న గ్లేసియర్ కంటే కరుగుతున్నవి మరింత ప్రమాదకరం. వాటికి దూరంగా ఉండాలని అసోసియేషన్ ఆఫ్ ఐస్‌లాండ్ మౌంటెయిన్ గైడ్స్ ప్రతినిధి గరార్ సిగుర్‌జాన్సన్ చెప్పారు. కొన్నేళ్ల క్రితం వరకు గ్లేసియర్లపై సమ్మర్ స్కీయింగ్‌కు జనం అమితాసక్తి చూపేవారు. ప్రమాదాల నేపథ్యంలో వేసవి కాలంలో స్కీయింగ్‌ను చాలా దేశాలు రద్దు చేశాయి. ప్రమాదాలు, మరణాల పెరుగుతున్నా పర్యాటకుల సంఖ్య తగ్గడం లేదు!

### ఎన్నెన్ని విషాదాలో...!

2019లో అలాస్కాలోని వాల్డెజ్ గ్లేసియర్‌లో చిక్కుకొని ముగ్గురు పర్యాటకులు మరణించారు. వీరిలో ఇద్దరు జర్మన్లు, ఒకరు ఆస్ట్రేలియన్. 2018లో అలాస్కా గ్లేసియర్లలో రెండు ప్రమాదాల్లో 32 ఏళ్ల మహిళ, ఐదేళ్ల బాలుడు చనిపోయారు. 2022 జూలైలో ఉత్తర ఇటలీలో మార్మోలడా గ్లేసియర్ నుంచి 64 వేల మెట్రిక్ టన్నుల మంచు, నీరు, రాళ్లు విరిగిపడ్డాయి. మంచు మొత్తం నదిలా పారుతూ దిగువన పర్యాటకులను ముంచెత్తింది. దాంతో 11 మంది మరణించారు. 2023లో ఐస్‌లాండ్‌లోని ఓ గ్లేసియర్‌లో మంచు గుహ హఠాత్తుగా కుప్పకూలడంతో అమెరికన్ టూరిస్టు మృతి చెందాడు. ఇది ఐస్‌లాండ్‌లో సంచలనం సృష్టించింది. గ్లేసియర్ టూరిజం సంస్థలు వేసవిలో ఐస్ కేవ్ టూర్లను నిలిపేశాయి. పర్యాటకుల భద్రతపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాయి.

# చర్చ కాదు, రచ్చ



మాట్లాడగలగడం, మేధ వికసించడం మానవ చరిత్రలో మహత్తర ఘట్టాలంటారు శాస్త్రవేత్తలు. అవి లేకపోతే మనిషి మనుగడా, ఆ మనుగడతో పెనవేసుకున్న ప్రపంచమూ ఇప్పటిలా ఉండేవే కావు. మేధ జ్ఞానాన్ని పెంపొందిస్తే, దానిని నలుగురికీ పంచేది మాటే. మాట నేర్చిన తొలిరోజుల్లో దాని ప్రభావానికి ఆశ్చర్య చకితుడైన మనిషి దానికి మహత్తును ఆపాదించి మంత్రంగా మార్చు కున్నాడు. నిత్య జీవనంలో దాని లౌకికమైన విలువనూ గుర్తించాడు. ఒంటరి మనిషిలో స్వగతంగా ఉన్న మాట, మరో మనిషి జత కాగానే సంభాషణ అయిందిబీ మరికొందరు జత పడితే చర్చ అయిందిబీ శ్రోతలు పెరిగిన కొద్దీ ప్రసంగమైంది. వీటిలో ప్రతి ఒక్కటీ జ్ఞానవ్యాప్తికి వాహిక అయింది. చర్చనే వాద, ప్రతివాదమనీబీ సంవాదమనీబీ ఆంగ్లంలో డిబేట్, డిస్కషన్ అనీ అంటున్నాం. చర్చలేని సందర్భం మానవ జీవితంలో ఉండనే ఉండదు. కుటుంబ స్థాయి నుంచి, దేశస్థాయి వరకూ నిరంతరం చర్చ సాగుతూనే ఉంటుంది. చర్చకు వస్తువు కాని విషయమూ ఉండదు. భూమి సూర్యుడి చుట్టూ తిరిగినట్టే మానవ ప్రపంచం చర్చ చుట్టూ తిరుగుతుంది. దేనినైనా సరే చర్చించే అభ్యాసం మనకు కొత్తది కాదంటూ నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్ 'ది ఆర్గ్యుమెంటేటివ్ ఇండియన్'(సంవాద భారతీయుడు) అనే పుస్తకమే రాశాడు. రామాయణ, మహాభారతాల్లో, భగవద్గీతలో, ఉపనిషత్తుల్లో చర్చలూ, వాదప్రతివాదాలూ ఎలా సాగాయో ఎత్తిచూపాడు. హెచ్చు, తగ్గుల సమాజంలో కిందిమెట్టు మీద ఉన్న స్త్రీ, పురుషవర్గాల గొంతుకూ మన సంవాద సంప్రదాయం ఎంతోకొంత చోటిచ్చిందన్నాడు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్యం వేళ్ళు చర్చలోనే పాతుకున్నాయంటూ, ప్రత్యేకించి మన దేశంలోని రకరకాల అసమానతలను ప్రజాస్వామికంగా పరిష్కరించుకోడానికి మనదైన సంవాద సంప్రదాయం స్ఫూర్తినిస్తుందన్నాడు. రామాయణంలో రాముడికి పట్టాభిషేక నిర్ణయాన్ని దశరథుడు అందిరినీ సంప్రదించే తీసుకుంటాడు. జాబాలికి, రాముడికి జరిగిన సంవాదం మరో ఉదాహరణ. పరలోకం లేదనీ, పితృవాక్పాలన అర్థరహితమనీ, ప్రత్యక్షంగా కనిపించే రాజ్యాన్ని అనుభవించమనీ జాబాలి అన్నప్పుడు రాముడు అతని మాటలు ఖండిస్తూ, నువ్వు చెప్పినట్లు చేస్తే ప్రజలు నన్నే ఆదర్శంగా తీసుకుని విచ్చలవిడిగా సంచరిస్తారంటాడు. విభీషణ శరణాగతి లాంటి ప్రతి సందర్భంలోనూ రాముడు సహచరులతో చర్చించే నిర్ణయం తీసుకుంటాడు. మహాభారతంలో ధర్మరాజు తనను జూదంలో ఒడ్డి ఓడినప్పుడుబీ తన్నోడి నన్నోడెనా, లేక నన్నోడి తన్నోడెనా అన్న చర్చను ద్రౌపది సభాముఖంగా లేవదీస్తుంది. ధర్మరాజు యుద్ధానికి విముఖుడైనప్పుడు యుద్ధపక్షాన వాదిస్తుంది. బృహదారణ్యకో పనిషత్తులో గార్గి అనే విదుషీమణి యాజ్ఞ్యవల్క్యునితో వాదోపవాదాలు జరిపి ఓటమిని హుందాగా ఒప్పుకుంటుంది. యాజ్ఞ్యవల్క్యునికి, అతని భార్య మైత్రేయికి జరిగిన సంవాదం గురించి కూడా ఉపనిషత్తు చెబుతుంది. ప్రత్యామ్నాయ చింతన నుంచి, ప్రతివాదం నుంచి, ప్రతిపక్షం నుంచే జైన, బౌద్ధ తాత్వికతలు అభివృద్ధి చెందాయి. అద్వైతవాది అయిన శంకరాచార్యుడు, కర్మవాది అయిన మండనమిశ్రునితోనూ, అతని భార్య ఉభయభారతితోనూ రోజుల తరబడి వాదోపవాదాలు జరిపి ఓడిస్తాడు. ఇప్పటిలా ప్రచురణ, ఎలక్ట్రానిక్, ఇంటర్నెట్ ఆధారిత సామాజిక మాధ్యమాలు లేని కాలంలో సైతం మనిషి తనే సంచార మాధ్యమంగా మారి, దూరభారాలను జయించి పండిత పరిషత్తులను మెట్టాడుబీ వాద, ప్రతివాదాలలో ప్రకర్షను చాటి జ్ఞానవిజ్ఞాన వ్యాప్తికి వేగుచుక్క అయ్యాడు. అలాంటి ఒక పండిత స్పర్థలోనే శ్రీనాథ మహాకవి "పగుల గొట్టించి తుద్భటవివాద ప్రౌఢి గౌడడిండమభట్టు కంచుఢక్క" అని చెప్పుకున్నాడు. నిన్నమొన్నటి వరకూ కాశీ, బెంగాల్‌లోని నవద్వీపం మొదలైనవి విద్వత్పరీక్షలకు పట్టుగొమ్మలుగా ప్రసిద్ధికెక్కాయి. అయల సోమయాజుల గణపతిశాస్త్రి అనే పండితుడు ఆంధ్రదేశం నుంచి నవద్వీపం వెళ్ళి అక్కడి విద్వజ్జనాన్ని మెప్పించి 'కావ్యకంఠ' బిరుదును అందుకొని వచ్చాడు. పురాతన నాగరికతలన్నీ సంవాద సంప్రదాయాన్ని పెంచి పోషించినవే. ప్రాచీన గ్రీకు తాత్వికుడు సోక్రటిస్ అభివృద్ధి చేసిన ప్రశ్నోత్తరాల సంవాద శైలి 'సోక్రటిక్ డైలాగ్' పేరిట ఒక వచనరచనా ప్రక్రియగా సారస్వతంలో భాగమైంది. సాంస్కృతిక పునరుజ్జీవనం దరిమిలా యూరప్‌లో ఆధునిక చర్చారూపాలు అభివృద్ధి చెంది, సంవాద సమాజాలు ఏర్పడి వైజ్ఞానిక వికాసాన్ని కొత్తపుంతలు తొక్కించాయి. సంవాద ప్రక్రియ నిర్దిష్టమైన రూపురేఖలు తెచ్చుకుని పాఠశాల నుంచి, విశ్వవిద్యాలయ స్థాయి వరకు విద్యలో భాగమైంది. అందులో పోటీపడే విద్యార్థుల తర్ఫీదుకు శిక్షకులు అవత రించారు. ఆల్ఫ్రెడ్ స్నైడర్, మాక్స్ వెల్ ష్రూనర్ అనే ఇద్దరు శిక్షకులు సంవాదకళను అనేక కోణాల నుంచి చర్చిస్తూ, నిర్వచిస్తూ 'మెనీ సైడ్స్- డిబేట్ ఎక్రాస్ కరిక్యులమ్' అనే పుస్తకం వెలువరించారు. ఈ మొత్తం నేపథ్యం నుంచి చూసినప్పుడు మన పరిస్థితే ఆశ్చర్యకరం. రాచరికపు రోజుల్లోనే మనం తీర్చిదిద్దుకున్న సంవాద సంప్రదాయం ప్రజాతంత్రంలో అక్కరకు రాకుండాపోయింది. ఇన్నేళ్ళ ప్రజాస్వామ్యంలో కీలక సంవాద కేంద్రాలైన శాసనసభలకు వేలసంఖ్యలో ప్రతినిధులను పంపుకున్నా, పంపుతున్నా సంవాద విధివిధానాల శిక్షణ అంచెలంచెల విద్యలో ఇప్పటికీ భాగం కాలేదు. ఎక్కడైనా పాఠ్యేతర అంశంగా కొన ఊపిరితో ఉన్నా కార్పొరేట్ చదువులు దానినీ పాడి ఎక్కించాయి. కొత్తగా సామాజిక మాధ్యమాల వెల్లువ సంవాదపు బరిలో ప్రతి ఒకరికీ అవకాశమిచ్చి మేలు చేసినా విధివిధానాల శిక్షణ లేక చర్చ రచ్చగా మారడంబీ ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు కావలసిన సంవాదం విషవాయువు కావడం చూస్తున్నాం!

# భూమి వైపుగా దూసుకొస్తున్న ఆస్టరాయిడ్ అపోఫిస్..!

## దిశ మారితే విధ్వంసం తప్పదంటూ శాస్త్రవేత్తల ఆందోళన..!

విశ్వంలో గ్రహశకలం దూసుకెళ్తుంటాయి. వీటికి స్థిరమైన మార్గం, గమ్యం లేకుండా సంచరిస్తుంటాయి. వీటి నుంచి భూమికి ముప్పు పెంచి ఉన్నది. ఇప్పటికే గ్రహశకలాలు భూమి దిశగా దూసుకువచ్చి మండిపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. చిన్న చిన్న గ్రహశకలాలు కావడంతో ప్రమాదం తప్పినట్లయ్యింది. అయితే, భారీ గ్రహశకలాలు భూమిని ఢీకొడితే విధ్వంసం తప్పదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. తాజాగా భారీ గ్రహశకలం భూమికి దగ్గరగా రాబోతున్నది. ఈ గ్రహశలం పేరు అపోఫిస్. దీనికి 'గాడ్ ఆఫ్ డిస్ట్రాక్షన్' పేరు కూడా ఉన్నది. ఈ గ్రహశకలానికి ఈజిప్ట్‌కు చెందిన అపెప్ దేవుడి పేరు పెట్టారు. అయితే, ఈ ఆస్టరాయిడ్ 2029లో భూమికి అత్యంత సమీపంలోకి రానున్నది. కేవలం 30,600 కిలోమీటర్ల దూరం నుంచి వెళ్తుందని పేర్కొన్నారు. ఈ గ్రహశకలాన్ని నేరుగా కంటితో చూడవచ్చని చెప్పారు. అపోఫిస్ ఆస్టరాయిడ్ మరికొన్ని చిన్న గ్రహశకలాలను ఢీకొట్టుకుంటూ వెళ్తే తన మార్గాన్ని మార్చుకునేందుకు అవకాశం ఉందని తాజాగా పరిశోధనల్లో తేలిందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో భూమి వాతావరణంలోకి ప్రవేశించే అవకాశాలు లేకపోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆస్టరాయిడ్ 1230 అడుగుల వెడెల్పు.. దాదాపు మూడున్నర ఫుట్‌బాల్ మైదానాల విస్తీర్ణానికి సమానంగా ఉంటుందని పేర్కొన్నారు. దాంతో ఈ గ్రహశకలం



భూమిని ఢీకొంటే భారీ విధ్వంసం ఏర్పడుతుందని.. అయితే, ఇలా జరిగేందుకు చాలా తక్కువ అవకాశాలు మాత్రమే ఉన్నాయన్నారు. ఇందులో ఏమాత్రం భయపడాల్సిన అవసరం లేదన్నారు. గ్రహశకలం భూమిని తాకే అవకాశాలు చాలా తక్కువ అని అధ్యయనం రచయిత యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్రన్ అంటారియో ఖగోళశాస్త్రవేత్త పాల్ వీగెర్ట్ పేర్కొన్నారు. 2029లో.. ఆ తర్వాత భవిష్యత్‌లో భూమిని ఢీకొట్టే మార్గంలో మరో గ్రహశకలం అపోఫిస్‌ను ఢీకొట్టే అవకాశం మిలియన్‌లో ఒకటి మాత్రమేనని.. చిన్న గ్రహశకలమైనా అపోఫిస్ మార్గాన్ని ప్రమాదకరంగా మారుస్తుందని పేర్కొన్నారు. ఈ గ్రహశకలం 2029లో భూమికి దగ్గరగా వస్తుందని.. ఈ క్రమంలో చిన్న గ్రహశకలాలను ఢీకొట్టే అవకాశం ఉందన్నారు. ఈ గ్రహశకలాన్ని 2004లో గుర్తించారు. ఈ ఆస్ట్రరాయిడ్ భూమిని ఢీకొట్టేందుకు అవకాశం ఉందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. తాకే అవకాశాలు తక్కువగానే ఉన్నా.. ఢీకొట్టే అవకాశాలను తోసిపుచ్చేందుకు అవకాశం లేదన్నారు. ఆస్ట్రాయిడ్ పేరు అపోఫిస్ 99942. ఇది ప్రమాదకరమైన ఆస్ట్రరాయిడ్స్‌లో అగ్రస్థానంలో ఉన్నది.

# సంపాదకీయం

## సరైన దిశలో తొలి అడుగు

### (విశ్లేషణ)


కోర్టు నోరు విప్పిందంటే న్యాయం నిలబడుతుందని సామాన్యులకు ఆశ. దేశంలో చట్టాలను తుంగలో తొక్కుతున్న బుల్‌డోజర్ సంస్కృతిపై మంగళవారం దేశ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు కాసింతైనా సంతోషం కలిగిస్తున్నది అందుకే. అనేక రాష్ట్రాలలో క్రిమినల్ కేసుల్లో దర్యాప్తును ఎదుర్కొంటున్న నిందితులు, వారి కుటుంబ సభ్యుల ప్రైవేట్ గృహాలు, ఆస్తు లపై బుల్‌డోజర్లను నడిపిస్తూ… 'దాన్ని ఘనకార్యంగా పేర్కొంటూ, సమర్థించుకుంటున్న' వైఖరి పాలకుల సాక్షిగా పెచ్చుమీరుతోంది. ఈ పరిస్థితుల్లో తదుపరి విచారణ జరిగే అక్టోబర్ 1 దాకా దేశవ్యాప్తంగా ఈ అడ్డగోలు కూల్చివేతలన్నిటికీ సుప్రీమ్ కోర్ట్ అడ్డుకట్ట వేయడం విశేషం. అదే సమ యంలో నీటి వసతులు, రైల్వే లైన్లకు అడ్డుగానూ, ఫుట్‌పాత్‌లు, ప్రభుత్వ స్థలాల్లోనూ సాగిన దురా క్రమణలనూ, అనధికారిక నిర్మాణాలనూ కూల్చేందుకు అభ్యంతరం లేదని సుప్రీమ్ పేర్కొంది. అలాగే, కూల్చివేతలపై దేశవ్యాప్తంగా అమలయ్యేలా నిర్ణీత మార్గదర్శకాల్ని రూపొందించాలన్న కోర్ట్ ప్రతిపాదన హర్షణీయం. ఇన్నాళ్ళ తరువాత ఇప్పటికైనా ఇది సరైన దిశలో సరైన అడుగు. యోగి ఆదిత్యనాథ్ సారథ్యంలోని ఉత్తరప్రదేశ్‌లో 2017లో ఈ బుల్‌డోజర్ న్యాయానికి బీజం పడింది. ఆ తరువాత ఇది అనేక బీజేపీ పాలిత రాష్ట్రాలకు పాకింది. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే ఇప్పటికి 4.5 లక్షల దాకా గృహాలు ఇలా నేలమట్టమయ్యాయని అంచనా. ఇకపై చట్టవిరుద్ధంగా ఒక్క కూల్చివేత జరిగినా అది పూర్తిగా రాజ్యాంగ విధానానికే విరుద్ధమని కోర్ట్ పేర్కొనడం గమనార్హం. నిజానికి, గతంలోనూ కోర్టులు ఇలాంటి వ్యాఖ్యలు చేసినా, వాటి ఆదేశాలను ధిక్కరిస్తూ అనేకచోట్ల కూల్చివేతలు యథేచ్ఛగా సాగాయి. అసలు అనేక రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని నిందితుల మీదకు బుల్‌డోజర్‌ను నడిపిస్తున్న తీరుపై చాలా కాలంగా చర్చ జరుగుతోంది. తప్పు చేసినవారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సింది పోయి, నోటీసులైనా ఇవ్వకుండా, నిర్ణీత ప్రక్రియ ఏదీ పాటించకుండా వారికి శిక్షగా బుల్‌డోజర్‌ను ఉపయోగించడమేమిటనే ధర్మబద్ధమైన ప్రశ్నలు వినిపిస్తూ వచ్చాయి. పైపెచ్చు, ముస్లిమ్‌ల ఇళ్ళను లక్ష్యంగా చేసుకొని కూల్చివేతలు సాగించడమనేది బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పాలనా విధానంగా తయారవడం ఆందోళన రేపింది. ఈ పరిస్థితుల్లో జస్టిస్ బి.ఆర్. గవాయ్, కె.వి. విశ్వనాథన్‌లతో కూడిన సుప్రీమ్ కోర్ట్ డివిజన్ బెంచ్ ఈ పద్ధతిని తప్పుబట్టింది. ఒక కేసులో నిందితులైనంత మాత్రానో, లేదంటే దోషి అయినంత మాత్రానో వారి ఇంటిని కూల్చేయవచ్చా? అందుకు చట్టం అనుమతిస్తుందా? లేదు కదా! ఆ మాటే సుప్రీమ్ అంటోంది. పైగా ఇంట్లో ఎవరో ఒకరు నేరం చేస్తే, కూల్చివేతలతో ఆ కుటుంబం మొత్తానికీ శిక్ష విధించడం ఏ రకంగా సబబు? ప్రభుత్వ పాలన నిర్వహించే కార్యనిర్వాహక వ్యవస్థే జడ్జిగా మారి, శిక్షించవచ్చా? ఆక్రమణలనూ, అనధికారిక నిర్మాణాలనూ తొలగించేందుకు వివిధ రాష్ట్రాల్లోని స్థానిక చట్టాలు అనుమతిస్తున్నాయి. కానీ, వాటిని ప్రతిపక్షాల పీక నొక్కేందుకూ, నిర్ణీత వర్గాలపై ప్రతీకారేచ్ఛకూ సాధనంగా మార్చుకోవడంతోనే అసలు సమస్య. గొంతు విప్పిన భార తీయ ముస్లిమ్‌లపై ఉద్దేశపూర్వకంగా సాగుతున్న దాడిలో భాగమే ఈ కూల్చివేతలని చివరకు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సైతం పేర్కొనే పరిస్థితి వచ్చిందంటే తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఈ బుల్‌డోజర్ న్యాయం దేశంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ పద్ధతుల్లో సాగుతున్నా, అన్ని చోట్లా ఒక అంశం మాత్రం సర్వసాధారణం. అది ఏమిటంటే – గతంలో కోర్టులిచ్చిన ఆదేశాలను పట్టించుకోకుండా, నిర్ణీత ప్రక్రియ అంటూ లేకుండానే ఈ కూల్చివేతలు కొనసాగడం! దురాక్రమణ లకు వ్యతిరేకంగా ఉద్యమం అంటూ ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ లాంటి చోట్ల ఇటీవలి కూల్చివేతల్లోనూ చట్ట ఉల్లంఘన నిర్భీతిగా సాగింది. గుజరాత్, అస్సామ్, త్రిపురల్లో సైతం కూల్చివేతల పర్వానికి కట్టడి లేకుండా పోయింది. అసాంఘిక శక్తులపై ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమిస్తోందనే భావన కల్పిస్తూ, రాజకీయ లబ్ధి పొందడం అధికార పార్టీల వ్యూహం. దానిలోని మతపరమైన కోణాన్ని కప్పిపుచ్చడం వాటికి వెన్నతో పెట్టిన విద్య. ఈ బుల్‌డోజర్‌సంస్కృతిపై భారత అత్యున్నత న్యాయస్థానం జోక్యానికి ఇంతకాలం పట్టడం విచారకరమే. అయితే, ఇప్పుడిక పనిప్రదేశాల్లో లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా 'విశాఖ' మార్గదర్శకాలు చేసినట్టుగానే దీనిపైనా అఖిల భారత స్థాయిలో కోర్టు మార్గదర్శకాలు ఇవ్వనుండడం ఒకింత ఊరట. అనధికారిక నిర్మాణాల గుర్తింపు, నోటీసులివ్వడం, వాదనలు వినడం, అనంతరం చట్టబద్ధంగా కూల్చివేతలు జరపడం… ఈ ప్రక్రియ అంతటికీ దేశవ్యాప్తంగా ఒకే విధమైన నియమావళి ఉండడం కచ్చితంగా మంచిదే. ఇటీవలి కూల్చివేతల డేటాను నిశితంగా సమీక్షిస్తే అనేక లోపాలు కనిపిస్తాయి. అందుకే, ఈ అంశంపై సంబంధిత వర్గాల నుంచి సూచనలు కోరుతున్న కోర్ట్ రేపు మార్గదర్శకాల రూపకల్పనలోనూ జాగ్రత్తగా వ్యవహరించడం కీలకం. మత ఘర్షణలు, ఆ వెంటనే సాగే కూల్చి వేతల మధ్య సంబంధాన్ని కప్పిపుచ్చేందుకు పాలకులు ఎత్తులు వేయడం తరచూ చూస్తున్నాం. ఆ పన్నాగాలు పారనివ్వకుండా మార్గదర్శకాల తయారీ అవసరం. అలాగే, ఎప్పుడో నోటీసులు ఇచ్చా మని మభ్యపెట్టేందుకు వెనకటి తేదీలతో కాగితాలు చూపించి, పాలనా యంత్రాంగం ఇష్టారీతిన సాగించే కూల్చివేతలకు చెక్ పెట్టాలి. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా జరిగే ఏ చర్యలనూ అనుమతించని రీతిలో నియమావళిని కట్టుదిట్టంగా రూపొందించాలి. ఆదేశాల ఉల్లంఘనను తీవ్రంగా పరిగణించి, కోర్టు ధిక్కారం కింద కఠిన చర్యలు చేపట్టాలి. ప్రజలెనుకున్న పాలకులు తామే జడ్జీలుగా, తామే శిక్షలు అమలు చేసేవారిగా ప్రవర్తిస్తే అది పౌరుల ప్రాథమికహక్కులకే భంగకరం.

# అమెరికా - భారత్ మధ్య కీలక ఒప్పందం..
# యంక్యూ-9బి అత్యాధునిక కిల్లర్ డ్రోన్ల సరఫరాకు డీల్..!

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ మూడు రోజుల అమెరికా పర్యటనకు వెళ్లారు. ఇవాళ రాత్రి న్యూయార్క్?లో 'మోదీ అండ్ యూఎస్ ప్రోగ్రెస్ టుగెదర్' కార్యక్రమంలో ప్రధాని పాల్గొననున్నారు.

ఈ కార్యక్రమానికి నసావు వెటరన్స్ మెమోరియల్ కొలీజియం వేదిక కానుంది

మరోవైపు భారత్ %-% అమెరికా మధ్య రక్షణ, వాణిజ్య బంధం బలపడుతోంది. ఈ క్రమంలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కిల్లర్ డ్రోన్‌లను అమెరికా నుంచి భారత్ కొనుగోలు చేయనుంది. ఈ ఒప్పందాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, అధ్యక్షుడు జో బిడెన్ ఖరారు చేశారు. భారతదేశం అమెరికా నుండి 31 యంక్యూ-9బి (16 స్కై గార్డియన్, 15 సీ గార్డియన్) రిమోట్‌గా పైలట్ చేసే విమాన డ్రోన్‌లను కొనుగోలు చేయబోతోంది. ఈ డ్రోన్ల ధర దాదాపు 3 బిలియన్ డాలర్లు. గత ఏడాది జూన్‌లో, రక్షణ మంత్రిత్వ శాఖ అమెరికా నుండి గాలి నుండి ఉపరితల క్షిపణులు, లేజర్-గైడెడ్ బాంబులతో కూడిన యంక్యూ-9బి స్కై గార్డియన్, సీ గార్డియన్ సాయుధ డ్రోన్‌లను కొనుగోలు చేయడానికి ఆమోదించింది.





భారత్-అమెరికా డిఫెన్స్ ఇండస్ట్రియల్ కోఆపరేషన్ రోడ్‌మ్యాప్‌ను మోదీ, బిడెన్ ప్రశంసించారు. ఈ రోడ్‌మ్యాప్ కింద, భారీ పరికరాలు, జెట్ ఇంజిన్‌లు, మందుగుండు సామగ్రి, గ్రౌండ్ మొబిలిటీ సిస్టమ్‌ల వంటి ఆయుధాల తయారీని చేర్చారు. ఈ ముఖ్యమైన సహకారంలో, లిక్విడ్ రోబోటిక్స్, భారత సముద్ర రక్షణ ఇంజనీరింగ్, సముద్ర భద్రతను పెంపొందించడానికి మానవరహిత ఉపరితల వాహనాల ఉత్పత్తికి కూడా ప్రాధాన్యత ఇవ్వనుంది. క్వాడ్ కాన్ఫరెన్స్ అనంతరం ఇరువురు నేతలూ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశంలో ఇరువురు నేతలు భారత్-అమెరికా భాగస్వామ్యాన్ని చాలా పటిష్టంగా అభివర్ణించారు. పరస్పర ఆసక్తి ఉన్న రంగాల్లో ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని మరింతగా పెంచుకునేందుకు ఇరువురు నేతలు చర్చించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంతో సహా ప్రపంచ, ప్రాంతీయ సమస్యలపై సమావేశంలో చర్చించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇటీవల మోదీ ఉక్రెయిన్ పర్యటనపై ద్వైపాక్షిక సమావేశంలో చర్చ జరిగింది. ఈ సమావేశంలో, యుఎస్-ఇండియా సిఇఒ ఫోరమ్‌కు కో-చైర్‌గా ఉన్న రెండు కంపెనీలు లాక్‌హీడ్ మార్టిన్ మరియు టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ మధ్య సి-130జె సూపర్ హెర్క్యులస్ ఎయిర్‌క్రాఫ్ట్‌పై టీమ్ ఒప్పందాన్ని ఇరువురు నేతలు అభినందించారు. %జ%-130 సూపర్ హెర్క్యులస్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను నిర్వహించే భారత నౌకాదళం, గ్లోబల్ పార్టనర్‌ల సంసిద్ధతకు మద్దతుగా భారతదేశంలో కొత్త మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్ సదుపాయాన్ని ఈ ఒప్పందం ఏర్పాటు చేస్తుంది. యుఎస్-ఇండియా రక్షణ, ఏరోస్పేస్ సహకారంలో ఇది ఒక ముఖ్యమైన దశ. ఇది ఇరుపక్షాల లోతైన వ్యూహాత్మక, సాంకేతిక భాగస్వామ్య సంబంధాలను ప్రతిబింబిస్తుంది.

# ఢిల్లీలో కొలువుదీరిన అతిషి కేబినెట్..
# మంత్రులుగా ఛాన్స్ కొట్టేసిన వారు ఎవరంటే..?

ఢిల్లీ:దేశ రాజధాని ఢిల్లీలో అనూహ్యంగా రాజకీయ పరిణామాలు మారాయి. ముఖ్యమంత్రి పదవికి అరవింద్ కేజ్రీవాల్ రాజీనామాతో అతిషి సీఎంగా బాధ్యలు చేపట్టారు. అమ్ ఆద్మీ పార్టీకి చెందిన అతిషి మార్లేనా శనివారం సాయంత్రం ఢిల్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 43 ఏళ్ల అతిషి ఢిల్లీలో అత్యంత పిన్న వయస్కురాలైన ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించారు. ఐదుగురు మంత్రులతో అతిషి కేబినెట్ కొలువుతీరింది. అతిషి 1981 లో మధ్య ప్రదేశ్ లోని భోపాల్‌లో జన్మించారు. ఆమె తల్లిదండ్రులు ప్రొఫెసర్లు, విద్యావంతుల కుటుంబం నుంచి రావడమే కాకుండా ఆమెకు విద్య పట్ల గల ఆసక్తి వల్ల ఢిల్లీలో విద్యను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించారు. ఆమె సెయింట్ స్టీఫన్స్ కాలేజీ, ఢిల్లీ యూనివర్శిటీ లో డిగ్రీ చేశారు%ొ% ఆ తర్వాత ఆక్స్ఫర్డ్ యూనివర్శిటీలో విద్యాభ్యాసం కొనసాగించారు. 2015 లో ఆప్ ప్రభుత్వంలో అతిషి భాగమయ్యాక, ఆమె ముఖ్యంగా విద్యాశాఖకు సంబంధించిన ఎన్నో పథకాలు అమలు చేశారు. ఢిల్లీ పాఠశాలలలో విద్యా ప్రమాణాలను పెంచడానికి తీసుకున్న చర్యలు ఆమెకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయి. పాఠశాలల్లో హ్యాపీనెస్ క్లాసెస్, ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ మైండ్‌సెట్ కరిక్యులం వంటి పథకాలు అమలు చేయడం ద్వారా విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకురాగలిగారు. ప్రజల ఆరోగ్య, విద్యా సంక్షేమ పథకాలు రూపొందించడంలో భాగమయ్యారు. ఆప్ పార్టీ కి వచ్చిన రాజకీయ, న్యాయపరమైన కష్టకాలంలో, అతిషి తన అద్భుతమైన నాయకత్వంతో కీలక పాత్ర పోషించారు. పార్టీకి విశ్వాసం కలిగించేలా పనిచేయడం, ముఖ్యమైన సమయాల్లో నాయకత్వం వహించడం వంటి దృఢమైన పనితీరు ఆమెను ఢిల్లీ రాజకీయాల్లో విశిష్టంగా నిలబెట్టాయి. అతిషి సామాజిక సమానత్వం, మహిళా సంక్షేమం, విద్యా రంగం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. ఇక అతిషి కేబినెట్ విషయానికి వస్తే, సుల్తాన్‌పూర్ మజ్రా ఎమ్మెల్యే ముఖేష్ అహ్లావత్ తొలిసారిగా ఢిల్లీ ప్రభుత్వంలో మంత్రి అయ్యారు. గోపాల్ రాయ్, సౌరభ్ భరద్వాజ్, కైలాష్ గెహ్లాట్, ఇమ్రాన్ హుస్సేన్ అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వంలో కేబినెట్ మంత్రులుగా ఉన్నారు. అంతకుముందు సెప్టెంబర్ 17న ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన కేసులో తీహార్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన అరవింద్ కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత అమ్ ఆద్మీ పార్టీ శాసనసభా పక్ష సమావేశంలో అతిషిని శాసనసభా పక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అతిషి మార్లేనా

ఆప్ సీనియర్ నాయకులు అతిషి ఢిల్లీలోని కల్కాజీ ఎమ్మెల్యే. అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వంలో, ఆమె విద్య, పిడబ్ల్యుడి, విద్యుత్, పర్యాటకం, స్త్రీ మరియు శిశు అభివృద్ధి, అనేక ఇతర శాఖల మంత్రిగా ఉన్నారు. ఆమె అమ్ ఆద్మీ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యురాలు కూడా. 2003లో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుండి చరిత్రలో మాస్టర్స్ డిగ్రీని పొందారు. అమ్ ఆద్మీ పార్టీ వ్యవస్థాపక సభ్యులలో ఒకరు. ఆమె



ఆద్మీ పార్టీ ఆవిర్భావం నుండి సభ్యులుగా కొనసాగుతున్నారు.

సౌరభ్ భరద్వాజ్

సౌరభ్ భరద్వాజ్ ఢిల్లీలోని గ్రేటర్ కైలాష్ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వంలో ఆరోగ్య, పట్టణాభివృద్ధి, పర్యాటక-కళా సంస్కృతి భాష, పరిశ్రమ, నీటిపారుదల, వరద నియంత్రణ మంత్రిగా ఉన్నారు. ఇంతకు ముందు ఢిల్లీ జల్ బోర్డు ఛైర్మన్‌గా కూడా ఉన్నారు. సౌరభ్ భరద్వాజ్ ఒక ప్రైవేట్ కంపెనీలో మైక్రోచిప్స్, కోడింగ్ నిపుణుడిగా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు.

కైలాష్ గెహ్లాట్

కైలాష్ గెహ్లాట్ ఢిల్లీ దేహత్‌లోని నజఫ్‌గఢ్ అసెంబ్లీ స్థానం నుండి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఢిల్లీ గ్రామీణ ప్రాంతంలో ముఖ్యమైన నాయకుడిగా ఎదిగారు. అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వంలో రవాణా, రెవెన్యూ, పరిపాలనా సంస్కరణలు, సమాచారం, సాంకేతికత, చట్టం, న్యాయం మరియు శాసన వ్యవహారాల బాధ్యతలను నిర్వహించారు. ఆగస్టు 15న ఢిల్లీలోని ఛత్రసాల్ స్టేడియంలో మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్థానంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడంతో ఆయన వెలుగులోకి వచ్చారు.

గోపాల్ రాయ్

గోపాల్ రాయ్ అమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీ ఇంచార్జ్‌గా ఉన్నారు. ఢిల్లీ ప్రభుత్వంలో అత్యంత అనుభవం ఉన్న నాయకుడు. అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వంలో పర్యావరణం, ఇతర మంత్రిత్వ శాఖల బాధ్యతలను ఆయన నిర్వహించారు. అతను అమ్ ఆద్మీ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు కూడా. ఉద్యమ కాలం నుంచి అరవింద్ కేజ్రీవాల్‌తో అనుబంధం ఉంది.

ఇమ్రాన్ హుస్సేన్

ఇమ్రాన్ హుస్సేన్ బల్లిమారన్ అసెంబ్లీ స్థానం నుండి అమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ముస్లిం ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో ఆయనకు మంచి పట్టు ఉంది. ఆయన రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. అతను అరవింద్ కేజ్రీవాల్ కేబినెట్‌లో ఆహార, పౌర సరఫరాలు, ఎన్నికల మంత్రిగా ఉన్నారు. జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ స్టడీస్ విద్యార్థి.

ముఖేష్ అహ్లావత్

దళిత నాయకుడు ముఖేష్ అహ్లావత్ ఢిల్లీలోని సుల్తాన్‌పూర్ మజ్రా ఎమ్మెల్యేగా గెలుపొందారు. ముఖేష్ తొలిసారి ఎమ్మెల్యే. ఆప్ ఆయనకు 2020లో సుల్తాన్‌పూర్ నుంచి టికెట్ ఇచ్చింది. అతని కంటే ముందు సందీప్ కుమార్ కూడా 2015లో సుల్తాన్‌పూర్ మజ్రా నుంచి ఆప్ టిక్కెట్‌పై ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అంతకు ముందు ఈ సీటు కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేది. 1993 నుంచి 2013 వరకు ఇక్కడ జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. అతిషీ కేబినెట్‌లో చోటు దక్కించుకున్న ఏకైక కొత్త ముఖం ముఖేష్ అహ్లావత్.


# డీజేను శాశ్వతంగా బ్యాన్ చేయాలి..
# అసదుద్దీన్ ఓవైసీ సంచలన కామెంట్స్

పండగ వచ్చినా.. పెళ్లి జరిగినా.. ఇంకా ఏ శు భకార్యమైనా ఇప్పుడు అందరికీ డీజే ర్యాలీలు తీయడం ఒక ఆనవాయితీగా మారింది. కుటుంబ సభ్యులతో, స్నేహితులతో సరదాగా డాన్సులు చేస్తూ ఊరంతా తెలిసేలా హోరెత్తించడం ఇప్పుడు ఒక సంప్రదాయంగా మారింది. డీజే కొట్టు.. దుమ్ము రేపు అన్నట్లుగా ముఖ్యంగా యువత దీనికి బాగా ఆకర్షితులవుతున్నారు. కొందరు.. ఈ డీజే సౌండ్‌లతో చెవులకు చిల్లులు పడేలా నానా హంగామా చేస్తున్నారు. కానీ అది ఆ చుట్టుపక్కల వారికి ఇబ్బందికరంగా మారుతోంది. ఈ నేపథ్యంలోనే మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. డీజే డాన్సులతో యువత చెడిపోతున్నారని, తద్వారా ప్రజల్లో దీని వల్ల ఎలాంటి మంచి సందేశం వెళ్లడం లేదని అన్నారు. అందుకే మతపరమైన ర్యాలీల్లో డీజేలపై నిషేధం విధించాలని తెలంగాణ ప్రభుత్వానికి ఒవైసీ విజ్ఞప్తి చేశారు. డీజే సంస్కృతితో ఆధ్యాత్మిక వాతావరణం కలుషితం అవుతోందని అనడంతో పాటు మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో భాగంగా చార్మినార్ వద్ద డీజే బాక్స్ పేలడంపై స్పందించారు. ఇది ఏ మాత్రం సమాజానికి పనికి వచ్చే చర్య కాదన్నారు. డీజే కావాలి అని కోరుకునే వాళ్లకు క్లబ్బులు, పబ్బులు లాంటివి సిద్ధంగా ఉంటాయని, అంతేకాని ఇలా నడిరోడ్డు మీద డీజే అంటూ పెట్టి ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించడం సరికాదంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మిలాద్ ఉన్ నబీ వేడుకల సమయంలో చార్మినార్ వద్ద డీజే బాక్స్ పేలిపోయి పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన స్థానిక అధికారులు ఆ మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. డీజే పేరుతో కొంతమంది చేసే వికృత చేష్టలు, విన్యాసాలతో ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయి. మరోవైపు, నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలంలో ఉరడీ మధు అనే యువకుడు డీజే శబ్దానికి గుండెపోటు వచ్చి మృతి చెందాడు. ఈ క్రమంలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలంగాణలో డీజేను శాశ్వతంగా బ్యాన్ చేయాలని తెలిపారు. డీజే పేరుతో యువత హద్దులు మీరి ప్రవర్తిస్తోందని.. మతపరమైన కార్యక్రమాలే కాదు.. తెలంగాణలో డీజేకు అనుమతులు ఇవ్వొద్దని.. శాశ్వతంగా నిషేధం విధించాలని అసదుద్దీన్ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు.



# ప్రభాస్ మూవీ.. ఈ పిల్లతో జాగ్రత్త హను!



పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కబోయే సినిమాని శనివారం గ్రాండ్ గా లాంచ్ చేశారు. మైత్రీ మూవీ మేకర్స్, టి-సిరీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించ బోతోంది. 1940 బ్యాక్ డ్రాప్ లో సెకండ్ వరల్డ్ వార్ కి ముందు జరిగిన కథగా ఈ సినిమా ఉండబోతోంది. "ఫౌజీ" అనే టైటిల్ ని ఈ సినిమాని ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. అయితే అధికారికంగా ఇంకా కన్ఫర్మ్ చేయలేదు. సెప్టెంబర్ నుంచి ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ అవుతుందంట. ఈ చిత్రంలో బ్రిటిష్ ఇండియన్ ఆర్మీ సోల్జర్ గా ప్రభాస్ కనిపిస్తాడంట. పవర్ ఫుల్ యాక్షన్ సీక్వెన్స్ ఉంటాయనే మాట వినిపిస్తోంది. ఈ సినిమాలో హీరోయిన్ గా ఇమాన్వి ఇస్మాయిల్ అనే అమ్మాయిని హను రాఘవపూడి హీరోయిన్ గా కన్ఫర్మ్ చేశారు. ఈ బ్యూటీకి ఇదే మొదటి చిత్రం. అయితే సోషల్ మీడియాలో తన డాన్స్ వీడియోలతో ఇమాన్వి బాగా పాపులర్ అయ్యింది. మంచి డాన్సర్ గా గుర్తింపు తెచ్చుకుంది. కొరియోగ్రాఫర్ కూడా చేస్తోంది. ఈ అమ్మాయి డాన్స్ టాలెంట్ కి చాలా మంది ఫ్యాన్స్ ఉన్నారు. మంచి ఎక్స్ ప్రెషన్స్ తో డాన్స్ పెర్ఫార్మ్ చేస్తూ ఉంటుంది. అయితే ఈ బ్యూటీని హీరోయిన్ గా హను రాఘవపూడి కన్ఫర్మ్ చేయడంతో డార్లింగ్ ఫ్యాన్స్ కొంత టెన్షన్ పడుతున్నారు. ప్రభాస్ హెవీ డాన్సర్ కాదని అందరికి తెలిసిందే. ఏదో చిన్న చిన్న స్టెప్పులతో మ్యానేజ్ చేస్తాడు. ఇమాన్వి డాన్స్, ఎక్స్ ప్రెషన్స్ చూస్తుంటే ప్రభాస్ ని సాంగ్స్ లో డామినేట్ చేసేస్తుందనే అభిప్రాయాన్ని ఫ్యాన్స్ వ్యక్తం చేస్తున్నారు. ప్రభాస్ డాన్స్ చేయకపోయిన పర్లేదు మరీ తేలిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత దర్శకుడు హను చేతిలోనే ఉందని ఫ్యాన్స్ అంటున్నారు. ఒక స్టార్ హీరో పక్కన కొత్త అమ్మాయిని హీరోయిన్ గా హను రాఘవపూడి ఎంపిక చేశారంటే కచ్చితంగా ఆన్ స్క్రీన్ రొమాన్స్ ని పెర్ఫెక్ట్ గా డిజైన్ చేస్తాడనే అభిప్రాయం ఇండస్ట్రీ వర్గాలలో ఉంది. అయితే ఇప్పటి వరకు హను రాఘవపూడి సినిమాలలో హీరోయిన్స్ పాత్రలన్నీ కూడా హీరోలని పెర్ఫార్మెన్స్ పరంగా డామినేట్ చేసే విధంగానే ఉన్నాయని అభిమానులు గుర్తు చేసుకుంటున్నారు. ఏది ఏమైనా ఇమాన్వి లాంటి టాలెంటెడ్ యాక్టర్ ప్రభాస్ కి జోడీగా నటించడంపై ఫ్యాన్స్ హ్యాపీగా ఫీల్ అవుతున్నారు. అయితే ఆమె ఎక్కడ తమ అభిమాన హీరోని డామినేట్ చేస్తుందా అనే టెన్షన్ పడుతున్నారు. మరి మొదటి సినిమానే ఇండియన్ నెంబర్ వన్ స్టార్ కి జోడిగా నటిస్తోన్న ఇమాన్వి ఏ స్థాయిలో "ఫౌజీ"తో మెప్పిస్తుందనేది వేచి చూడాలి.

# డెబ్యూ మోక్షజ్ఞ పాన్ ఇండియా ట్రయల్?




బాహుబలి, సైరా నరసింహా రెడ్డి, ఆర్.ఆర్.ఆర్, హనుమాన్ .. ఈ సినిమాలన్నిటిలో కామన్ ఎలిమెంట్ 'సూపర్ హీరోయిజం'. సూపర్ హీరోలను తెరపై చూపించి ఔరా! అనిపిస్తున్నారు మన దర్శకులు. ఎంపిక చేసుకున్న పాత్రకు సూపర్ హీరోయిజాన్ని జోడించి భారీ యాక్షన్ కి ఆస్కారం కల్పించడం ద్వారా మాస్ ని పదే పదే థియేటర్లకు రప్పిస్తున్నారు. ఇప్పుడు అదే తీరుగా మోక్షజ్ఞను తెరపై పరిచయం చేసేందుకు హనుమాన్ ఫేం ప్రశాంత్ వర్మ చేస్తున్న ప్రయత్నం ఆసక్తిని కలిగిస్తోంది. నందమూరి నటసింహం బాలకృష్ణ నటవారసుడిని పరిచయం చేయడం అంటే ఆషామాషీనా? సరైన సమయంలో సరైన దర్శకుడితో ముందుకు వెళ్లాలనే బాలయ్య బాబు నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. హనుమాన్ తో పాన్ ఇండియా హిట్టు కొట్టిన ప్రశాంత్ వర్మకు ఈ అవకాశం ఇవ్వాలనే నిర్ణయం సముచితమైనదన్న భావన నందమూరి అభిమానుల్లోను ఉంది. ఒక రెగ్యులర్ మాస్ డైరెక్టర్ చేతికి మోక్షజ్ఞను అందించి ఉంటే కచ్ఛితంగా అది విమర్శలకు తావిచ్చేది. కానీ బాలయ్య బాబు ఎంతో తెలివిగా మోక్షు ఆరంగేట్ర చిత్రాన్ని ప్లాన్ చేసారు. మొదట్లో ఆదిత్య 369 సీక్వెల్ తీస్తారని, దానికి బాలకృష్ణ డైరెక్టర్ అంటూ ప్రచారం సాగినా, దానికి బ్రేక్ ఇచ్చిన హనుమాన్ తో ట్రెండింగ్ లో ఉన్న దర్శకుడిని ఆశ్రయించడం ఒక గొప్ప ఎత్తుగడగా భావిస్తున్నారు. మోక్షజ్ఞ డెబ్యూ ప్రాజెక్ట్ గురించి ఎప్పటికప్పుడు లీకులు అందుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమాలో శ్రీదేవి రెండో కుమార్తె ఖుషి కపూర్ కథానాయికగా నటిస్తుందని గుసగుసలు వినిపించాయి. ఖుషి కపూర్ తో చర్చలు సాగుతున్నాయన్న సమాచారం ఉంది.

ఇంతలోనే ఇప్పుడు ఈ సినిమాలో బాలీవుడ్ ప్రముఖ హీరో నటిస్తారని కూడా టాక్ వినిపిస్తోంది. కోలీవుడ్, శాండల్వుడ్ నుంచి పేరున్న స్టార్లను తీసుకునే అవకాశం ఉందంటూ..! మరో గుసగుస వినిపిస్తోంది. హనుమాన్ ఫేం ప్రశాంత్ వర్మ క్రేజీ ప్రాజెక్టుకి ప్రధాన అస్సెట్ కానుండగా, ఖుషి, బాలీవుడ్ హీరో, ఇతర పరిశ్రమల స్టార్లు పాన్ ఇండియా అప్పీల్ తెస్తారని భావిస్తున్నారు. ప్రశాంత్ వర్మ సూపర్ హీరో సినిమాటిక్ యూనివర్స్ లోనే ఈ ప్రాజెక్ట్ కూడా కొనసాగుతుండడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. భారతీయ పురాణేతిహాసాల నుంచి ఒక ఆసక్తికరమైన పాత్రను తీసుకుని అందులో మోక్షజ్ఞను ప్రవేశ పెడుతున్నారు. అతడిని సూపర్ హీరోగా తెరపై చూపిస్తారు. మోక్షజ్ఞ పాత్రకి గురువు పాత్రలో సీనియర్ బాలీవుడ్ హీరో నటిస్తారని టాక్ వినిపిస్తోంది. ప్రయత్నం బావుంది. అంతకంతకు ఉత్కంఠ పెంచుతోంది. కానీ కెరీర్ ఆరంగేట్రమే భారీ స్పాన్ తో ఉంటే అది డెబ్యూ హీరోకి సవాల్ గా మారే ఛాన్సుంటుందేమో!

# ధూమపానం మానేస్తే... గంటల్లో, రోజుల్లో, నెలల్లో వచ్చే మార్పులివే!










సరదా కోసమో, స్టైల్ కోసమో అలవాటైన ధూమపానం నిజంగా మానేయాలనుకున్నప్పుడు చాలా కష్టం అని అంటుంటారు అనుభవజ్ఞులు! మానెయ్యండి అని చెప్పినంత ఈజీ కాదు ఈ అలవాటు నుంచి బయటపడటం అని చెబుతుంటారు! కానీ... మనసుంటే మార్గం ఉంటుంది, మానాలని దృఢంగా నిర్ణయించుకుంటే మానేయడం ఏమీ అత కష్టం కాదని అంటుంటారు నిపుణులు! అవును... ధూమపానం అలవాటు చేసుకోవడం ఎంత సులువో, మానేయడం అంత కష్టం అని అంటుంటారు. కానీ... నిజంగా ఈ అలవాటు నుంచి బయటపడినవారు మాత్రం ఆ మార్పును స్పష్టంగా అనుభవిస్తుంటారు. మానసి కంగానూ, శారీరకంగానూ ఎంతో మార్పును ఎక్స్ పీరియన్స్ చేయడంతో పాటు.. సరికొత్త లైఫ్ లోకి అడుగుపెట్టిన అనుభూతి కలుగుతుందని చెబుతుంటారు. వాస్తవానికి ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా కొన్ని మిలియన్స్ మంది ఈ ధూమపానానికి అలవాటైపోయారు. తక్కువమంది మానాలని ప్రయత్నిస్తుంటారు. అతి కొద్ది మాత్రం ఆ అలవాటును మానేస్తుంటారు. ఈ సమయంలో ధూమపానం అలవాటును వదులుకోవడం వల్ల శరీరంలో కలిగే మార్పులు ఎన్నో ఉంటాయి. అవి ఏమిటనేది ఇప్పుడు చూద్దాం..! ధూమపానం మానేసిన 20 నిమిషాల్లో బ్లడ్ ప్రెసర్ (బీపీ) సాధారణ స్థితికి వచ్చేస్తుంది. ఇదే క్రమంలో పల్స్ రేటూ నార్మల్ అయిపోతుంది. అదేవిధంగా కాళ్లు, చేతులు, బాడీ టెంపరేచర్ నార్మల్ స్థితికి వచ్చేస్తుంది. ఇక స్మోకింగ్ మానేసిన 12 గంటల తర్వాత రక్తంలో కార్బన్ మోనాక్సైడ్ స్థాయి సాదారణ స్థితికి వచ్చేస్తుంది. గుండెకు, ఇతర భాగాలకు మరింత ఆక్సిజన్ సరఫరా అవుతుంది. ఇదంతా 12 గంటల్లోనే జరిగిపోతుంది. ఇక


ధూమపానం మానేసిన 24 గంటల్లో హార్ట్ ఎటాక్ రిస్క్ తగ్గగా.. 48 గంటల్లో నర్వ్ ఎండింగ్స్ తిరిగి అభివృద్ధి చెందుతాయి. ఇదే క్రమంలో... తీపి, ఉప్పు తదితర రుచులను ఆస్వాధించే విధానం మరుతుంది.. రుచి బాగా తెలుస్తుంది! ఇక 72 గంటల్లో బ్రాంకియల్ ట్యూబ్స్ రిలాక్స్ అవ్వడంతోపాటూ సులబంగా శ్వాస తీసుకోవచ్చు. ఊపిరితిత్తుల కెపాసిటీ పెరుగుతుంది. ఇక స్మోకింగ్ మానేసిన రెండు వారాల నుంచి మూడు నెలల్లో బ్లడ్ సర్క్యులేషన్ ఇంప్రూవ్ అవుతుంది. నడవడం సులువవుతుంది. లంగ్స్ ఫంక్షనింగ్ 30 శాతం మెరుగుపడుతుంది. ఇదే సమయంలో ఎనర్జీ లెవెల్స్ పెరుగుతాయి. లంగ్స్ లో సీలియా మళ్లీ పెరుగుతుంది. ఫలితంగా ఊపిరితిత్తులు శుభ్రంగా ఉండి, ఇన్ఫెక్షన్ తగ్గుముఖం పడుతుంది. అదే విధంగా మ్యూకస్ ని హ్యాండిల్ చేసే సామర్థ్యం పెరుగుతుంది. ఇలా శరీరంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటాయి. ఇదే క్రమంలో... దూమపానం మానేసిన కొన్ని నెలల తర్వాత అంగస్తంభన సమస్య నుంచి విముక్తి లభించే అవకాశం ఉంది.

ధూమపానం మానేసిన తర్వాత ఏడాది లోపు ప్రారంభంలో 10 - 15 నిమిషాలు నడవడానికి ఇబ్బంది పడేవారి సమస్య తగ్గుతుంది.. ఆయాసం తగ్గుతుంది. ఇక ధూమపానం మానేసిన నాలుగేళ్ల తర్వాత అసలు ఆ అలవాటు లేని వ్యక్తిలా మారిపోతారు!




# సుధీర్ బాబు జటాధర.. పాన్ ఇండియా రేంజ్ లోనే..



టాలీవుడ్ టాలెంటెడ్ హీరో సుధీర్ బాబు తన కెరీర్ లో మరో బిగ్గెస్ట్ మూవీతో సిద్ధమవుతున్నాడు. తన లుక్స్ ఫిట్నెస్ తో తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న సుధీర్, ఇప్పుడు పాన్-ఇండియా స్థాయిలో తెరకెక్కబోతున్న జటాధర అనే చిత్రం ద్వారా మరోసారి ప్రేక్షకులను మంత్ర ముగ్దులను చేయబోతున్నాడు. ఈ సినిమాతో సుధీర్ బాబు సూపర్ నేచురల్ ఫాంటసీ ప్రపంచంలోకి అడుగుపెడుతున్నాడు. ప్రసిద్ధ నిర్మాత ప్రేరణ అరోరా, శివిన్ నారంగ్ తో కలిసి నిర్మిస్తున్న ఈ సినిమా తెలుగులోనే కాకుండా హిందీ భాషలో కూడా రూపొందనుంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ ఇటీవలే విడుదల కాగా, అది సోషల్ మీడియాలో మంచి హల్ చల్ చేసింది. సుధీర్ బాబు త్రిశూలం పట్టుకొని, లార్డ్ శివా ఛాయాచిత్రం ముందు శరీర సౌష్టవం ప్రదర్శిస్తూ ఉన్న లుక్ అద్భుతంగా ఆకట్టుకుంటోంది. ఈ లుక్ చూసిన అభిమానులు మరింత అంచనాలు పెంచుకుంటున్నారు. జటాధర సినిమాను ఒక సాధారణ చిత్రం కాకుండా, తెలుగు సినీ పరిశ్రమతో పాటు బాలీవుడ్లో కూడా ఒక పెద్ద విజయాన్ని సాధించేలా రూపొందిస్తున్నారు. ఈ సినిమా సుప్రీం స్టార్ హెూదాలో సుధీర్ బాబుకు ప్రత్యేక గుర్తింపునిస్తుంది అని అంటున్నారు. అలాగే, బాలీవుడ్ నుంచి ఒక ప్రముఖ హీరోయిన్ ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తుందని వార్తలు వినిపిస్తున్నాయి. సినిమాలో ప్రతినాయక పాత్రను ఒక %ూ% లిస్టర్ హీరో చేయనున్నట్లు సమాచారం. ఈ విషయం తెలియగానే, అభిమానుల్లో ఉన్న ఆసక్తి మరింత పెరిగింది. సుధీర్ బాబు సాలిడ్ ప్రెజెన్స్, స్టార్ కాస్ట్ కాంబినేషన్ తో ఈ ప్రాజెక్ట్ పై భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా నిర్మాత ప్రేరణ అరోరా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఆమె గతంలో "రుస్తుమ్," "టాయిలెట్: ఏక్ ప్రేమ్ కథ," "ప్యాడ్ మాన్," "పరి" వంటి చిత్రాలను నిర్మించి, విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ఇప్పుడు జటాధర తో ఆమె మరింతగా ప్రేక్షకులను అలరించబోతున్నారు. ప్రీ-ప్రొడక్షన్ పనులు కూడా జెట్ స్పీడ్ లో జరుగుతున్నాయి. హైదరాబాదులోని ప్రధాన లొకేషన్లలో చిత్రీకరణ త్వరలోనే ప్రారంభం కానుంది. ఇప్పటికే ముఞ్జియా, స్త్రీ, కాంతారా వంటి సంచలన చిత్రాలు ఇండియన్ సెన్సేషన్ గా నిలిచాయి. ఇప్పుడు జటాధర ఆ స్థాయిని మించి డిఫరెంట్ కంటెంట్ తో ప్రేక్షకులను కట్టిపడేయడానికి వస్తోంది. ఈ సినిమాను 2025 మహాశివరాత్రి సందర్భంగా గ్రాండ్గా విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు.

Printed Published and owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao RNI Title Code :- TELTEL12296